www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 2-1-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 258 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: తదియ రా. 1.09 తదుపరి చవితి; నక్షత్రం: శ్రవణం రా. 11.10 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: తె. 3.02-4.34; దుర్ముహూర్తం: ఉ. 10.09-11.13, మ. 2.53-3.37; అమృతఘడియలు: మ. 1.01-2.35; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 5.48 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రైతులకు కేంద్రం శుభవార్త

పంటల బీమా పథకాలకు కేటాయింపులు పెంపు

పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐ పథకాల కొనసాగింపు

ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదం

డీఏపీపై వన్‌టైమ్ స్పెషల్ ప్యాకేజీ పొడిగింపునకు ఓకే

కొత్త ఏడాది మా తొలి భేటీ రైతు శ్రేయస్సుకు అంకితం

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మోదీ



2

తల్లిని, నలుగురు చెల్లెళ్లను చంపేశాడు

గొంతు, మణికట్టు కోసి హత్యలు

యూపీలోని లక్నోలో ఘటన

హత్యల తర్వాత హంతకుడి వీడియో

స్థానిక భూమాఫియా ఆగ్రాలోని మా ఇంటిని ఆక్రమించుకుంది

నా చెల్లెళ్లను హైదరాబాద్‌లో అమ్మే కుట్ర

మేం హిందూ మతంలోకి మారాలనుకున్నాం

వీడియోలో వ్యాఖ్యలు.. అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు



అర్షద్

2



2

ఎడారిలో భారీ సోలార్ వాల్

చైనా మరో అద్భుతం.. 400 కి.మీ. పొడవు, 5 కి.మీ. వెడల్పుతో ప్లాంట్

100 గిగావాట్ల విద్యుత్తు లక్ష్యం

ఇప్పటికే 5.42 గిగావాట్ల ఉత్పత్తి

అనంత్ 'టైమ్'.. చాలా కాస్ట్‌లీ బ్రో!

అంబానీ రిస్ట్ వాచ్ ఖరీదు రూ.22 కోట్లు

ప్రపంచంలో ముగ్గురి వద్దే ఆ గడియారం



2

200 కోట్లు తాగేశారు




31న భారీగా మద్యం అమ్మకాలు

2.5 లక్షల కేసుల లిక్కర్, 70 వేల కేసుల బీరు ఫట్

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మద్యం ప్రియులు రెచ్చిపోయారు. 31వ తేదీ ఒక్కరోజే దాదాపు రూ.200 కోట్ల మద్యం తాగేశారు. నూతన సంవత్సరం సందర్భంగా సుమారు 2.5లక్షల కేసుల లిక్కర్, 70వేల కేసుల బీరును మందుబాబులు కొనుగోలు చేశారు. రాష్ట్రంలో సాధారణంగా రోజుకు రూ.80కోట్ల మద్యం అమ్ముడవుతుంది. దీనికి

మిగతా 6వ పేజీలో...



బెజవాడ దుర్గమ్మ దర్శనానికి వచ్చిన సందర్భంగా చంద్రబాబు అభివాదం

మోయలేనన్ని పాపాలు!

అవన్నీ మేమే మోయాలంటే కుదరదు: చంద్రబాబు

జగన్ హయాంలో సర్వం నాశనం.. రాత్రికి రాత్రే సరిదిద్దలేం.. కొంత టైం పడుతుంది

ఆర్థిక పరిస్థితి కుప్పకూలినా పళ్ల బిగువున లాక్కొస్తున్నాం

జగన్ మళ్లీ వస్తే ఎలాగని పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారు

ఇక రానే రాడని చెబుతున్నాం.. 6 నెలల్లో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం.. రాష్ట్ర చరిత్రలో ఇదో రికార్డు

విద్యుత్ ధర రూ.4.80కి తగ్గించేందుకు కృషి చేస్తున్నాం

అదానీ వ్యవహారంలో తుది నివేదిక కోసం చూస్తున్నాం

ఇక ఆకస్మిక తనిఖీలు ఉంటాయ్.. ప్రభుత్వ వేగం పెంచుతాం

మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు చిట్‌చాట్

ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కుదరదు

ప్రజల్లో పార్టీ ఇమేజ్ కాపాడుకోవాలి

ఎంత స్థాయివారు తప్పుచేసినా ఊరుకోం

మా వాళ్లకు కౌన్సెలింగ్ మొదలుపెట్టా: బాబు

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని జగన్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి వెళ్లిపోయారని.. పళ్ల బిగువున ఆ సమస్యలను భరిస్తూ ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మోయలేనన్ని పాపాలు ఆయన చేశారని.. సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. 'ఆయన చేసిన పాపాలన్నీ మమ్మల్నే మోసి మునిగి పొమ్మంటే సాధ్యం కాదు. రాత్రికి రాత్రి సరిదిద్దడానికి మా దగ్గరేమీ మంత్రదండం లేదు. దిద్దుబాటుకు కొంత సమయం పడుతుంది' అని తెలిపారు. కొత్త సంవత్సరం తొలి రోజు ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన.. మీడియా ప్రతినిధులతో పిచ్చాపాటీ మాట్లాడారు. 'రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి మేం పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతుంటే మళ్లీ జగన్ వస్తే ఎలాగని అడుగుతున్నారు. ఇక రానే రాడని కచ్చితంగా చెబుతున్నాం. పారిశ్రామికవేత్తల చెయ్యి మెలిపెట్టి వాటాలు రాయించుకోవడం, జే ట్యాక్స్ కట్టించుకోవడం ఈ ప్రభుత్వంలో లేవు. అవి చేసినవారు ఇక రారు' అని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఈ ఆరు నెలల్లో రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిందని, రాష్ట్ర చరిత్రలో ఇది రికార్డని తెలిపారు. మిగిలిన

మిగతా 12వ పేజీలో...

కక్ష సాధింపులు మా ప్రాధాన్యం కాదు

కావాలని ఎవరినీ వేధించం

తప్పులు చేసి ఉంటే వదిలిపెట్టం

మామూలుగా అయితే నేను అధికారంలోకి వచ్చీ రాగానే జగన్‌ను అరెస్టు చేయాలి. కానీ చేయలేదు. కక్ష సాధింపులు మా ప్రాధాన్యం కాదు.

- సీఎం చంద్రబాబు

1600 మందికి రూ.24.16 కోట్లు లబ్ధి

నూతన సంవత్సరం తొలిరోజు సీఎంఆర్‌ఎఫ్ ఫైలుపై సీఎం చంద్రబాబు సంతకం

కూటమి ప్రభుత్వంలో 9,123 మందికి లబ్ధి

వారంపాటు బాబు బిజీ

నేడు మంత్రివర్గ సమావేశం

4న విశాఖలో నేవీ డేకు హాజరు

6, 7 తేదీల్లో కుప్పం టూరు

8న విశాఖలో మోదీ పర్యటనకు

నాలుగో వారంలో దావోస్‌కు





కడప నగర శివారులో సీకేదిన్నె మండల పరిధిలో సజ్జల సోదరులు ఆక్రమించిన అటవీ భూముల్లో సాగు చేసిన పంటలు, అటవీ భూమిలో సజ్జల గెస్ట్‌హౌస్

రిజర్వ్ ఫారెస్ట్‌లో

సజ్జల సామ్రాజ్యం!

దర్జాగా మామిడి, నేరేడు, టేకు సాగు

అక్కడే గెస్ట్‌హౌస్‌లు, షెడ్ల నిర్మాణం

కాల్వలు, కుంటలూ వదలని వైనం

రామకృష్ణారెడ్డి అండతో సోదరుల ఆక్రమణ

కొట్టేసినవారు సజ్జల బినామీలని ప్రచారం

కడప శివారున 42 ఎకరాల అటవీ భూమి కబ్జా

విలువ కోట్లలో

(కడప-ఆంధ్రజ్యోతి)

జగన్ హయాంలో సకల శాఖ మంత్రిగా పేరొందిన సజ్జల రామకృష్ణారెడ్డి సోదరులు అటవీ భూమికి ఎసరు పెట్టారు. ఎకరా, రెండు ఎకరాలు కాదు ఏకంగా 42 ఎకరాల భూమి ఆక్రమించేశారు. అక్కడ దర్జాగా పండ్ల తోటలు, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. అంతేగాక అటవీ భూమిలో గెస్ట్ హౌస్‌లు, పనివారి కోసం షెడ్లు కట్టించారు. విశ్వసనీయ

మిగతా 11వ పేజీలో...



నేటి నుంచి బెజవాడలో

పుస్తక మహోత్సవం

11 రోజులపాటు నిర్వహణ

3

హీట్‌వేవ్ @ 2024

శతాబ్ద కాలంలో అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు

దేశ వార్షిక సగటు కంటే 0.65 డిగ్రీలు ఎక్కువ

11

గత వేడి సంవత్సరం 2016ను మించి అధిక ఉష్ణోగ్రత

ప్రపంచవ్యాప్తంగానూ ఎక్కువే

బ్యాంక్ మేనేజర్ ఉరఫ్

లేడీ రౌడీ షీటర్

హడలెత్తిస్తున్న ప్రభావతి క్రైమ్ హిస్టరీ

బ్యాంకులో పనిచేస్తుండగా బంగారం చోరీ

దీంతో ఉద్యోగం నుంచి ఉద్వాసన

స్వగ్రామం మర్రిబంధం చేరుకుని అరాచకాలు

ఆగడాలు భరించలేక రౌడీషీట్ తెరిచిన పోలీసులు

తాజాగా జనసేన నేతపై దాడి ఘటనతో కలకలం

చేతులు కట్టేసి కుటుంబంతో కలిసి కొట్టిన ప్రభావతి

స్పృహ తప్పిన నేతను ఆస్పత్రికి చేర్చిన గ్రామస్థులు



ప్రభావతి

ఏలూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు మేనేజరు నుంచి లేడీ రౌడీ షీటరుగా మారిన ఓ మాజీ ఉద్యోగిని కథ ఇది.. ఆమె హిస్టరీ అంతా ఆగడాలు.. అరాచకాలే! పని చేస్తున్న బ్యాంకులో బంగారం చోరీచేసిన వ్యవహారంలో ఉద్యోగం పోయింది. సొంత గ్రామం ఏలూరు జిల్లా మర్రిబంధం చేరుకుని స్థానికంగా అడ్డూఅదుపూ లేకుండా

మిగతా 11వ పేజీలో...



మచిలీపట్నం తాలూకాపోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరైన పేర్ని జయసుధ

గోదాం వ్యవహారాలన్నీ మేనేజరే చూసుకున్నారు!

నాకేమీ తెలియదు: పేర్ని నాని భార్య

బియ్యం మాయం కేసులో పోలీసుల ముందు హాజరు

12

మేయర్ అధికారిక వాహనంలో రాక

వాహనంతో జనం పైకి దూసుకెళ్లి.. ఆపై కాల్పులు

2

న్యూ ఇయర్ వేళ అమెరికాలో ఘటన

10 మంది మృతి.. 30 మందికి గాయాలు

ఉగ్రదాడి కాదన్న ఎఫ్‌బీఐ.. దర్యాప్తు మొదలు



ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ డైరెక్టర్‌గా డాక్టర్ భారతీ కులకర్ణి



హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): భారత వైద్య పరిశోధన మండలి-జాతీయ న్యూట్రిషన్ సంస్థ (ఐసీఎంఆర్-ఎన్ఐఎన్) నూతన డైరెక్టర్‌గా డాక్టర్ భారతీ కులకర్ణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఐసీఎంఆర్-ఎన్ఐఎన్‌లో 20 ఏళ్లపాటు శాస్త్రవేత్తగా పని చేసిన భారతీ కులకర్ణి.. గడచిన మూడేళ్లుగా న్యూఢిల్లీలోని ఐసీఎంఆర్‌లో రీప్రొడక్టివ్, చైల్డ్ హెల్త్-న్యూట్రిషన్ విభాగం అధిపతిగా వ్యవహరిస్తున్నారు. పుణె యూనివర్సిటీలో పీడియాట్రిక్స్ విద్యనభ్యసించిన భారతి.. అమెరికాలోని జాన్ హాప్కిన్స్ బ్లూమ్‌బర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో మాస్టర్స్ చేశారు. దీంతోపాటు ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. కాగా, డాక్టర్ భారతి పరిశోధనలు ఎక్కువగా ప్రసూతి, శిశు పోషణ, రక్తహీనత, బాల్యంలో పోషకాహార లోపం, వ్యవసాయం-పోషకాహార సంబంధం తదితర అంశాలపై జరిగాయి. దేశంలో పోషకాహార విధానాలు, కార్యక్రమాల రూపకల్పనలో ఆమె పరిశోధనలు విశేషంగా తోడ్పడ్డాయి. అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రభావవంతమైన పలు జర్నల్స్‌లో డాక్టర్ భారతి 130కి పైగా పరిశోధనా పత్రాలను రాయడంతోపాటు విధాన నిర్ణయ పత్రాల రూపకల్పనలోనూ కీలక పాత్ర పోషించారు. తాను చేసిన సేవలకుగాను పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి పరిశోధన గ్రాంట్లు పొందారు. కాగా, కొత్త సంవత్సరం తనకు కొత్త బాధ్యతలను కూడా వెంటబెట్టుకొని వచ్చిందని, దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన సంస్థకు సారథ్యం వహించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని డాక్టర్ భారతి తన లింక్డిన్ ఖాతాలో పేర్కొన్నారు.

అనంత్ 'టైమ్' చాలా కాస్ట్లీ బ్రో!

» అంబానీ రిస్ట్ వాచ్ రూ.22 కోట్లు



ఇదిగో ఈ ఫొటోలో కనిపిస్తున్న చేతి గడియారాన్ని చూశారా..!! చూడటానికి ఐసు ముక్కలా భలే ఉంది కదా.. మనం కూడా ఒకటి కొనేసుకుందాం అని అనుకుంటుంటే మాత్రం కాస్త ఆగండి. ఎందుకంటే దాని ధర ఎంతో తెలిస్తే మీ గుండెల్లో నిజంగానే ఐసు ముక్క పడుద్ది. అనంత్ అంబానీ ధరించిన ఈ చేతి గడియారం ఖరీదు రూ.22 కోట్ల పైమాటే. రిచర్డ్ మిల్లే కంపెనీకి చెందిన అత్యంత అరుదైన ఈ చేతి గడియారాలు ప్రపంచంలో మూడంటే మూడే ఉన్నాయి. ప్రపంచంలోని అత్యంత ధనవంతుల్లో ఒకరైన ముఖేశ్ అంబానీ కుమారుడైన అనంత్ దగ్గర వాటిల్లో ఒకటి ఉంది. ఇటీవల ఓ కార్యక్రమంలో అనంత్ ఈ గడియారంతో కనిపించాడు. ఓ ఇన్‌స్టాగ్రామ్ పేజీ ఈ చేతి గడియారం వివరాలను పోస్ట్ చేయగా... అనంత్ టైమ్ కూడా చాలా కాస్ట్లీ బ్రో అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇదే కాదు.. రూ.కోట్ల విలువ చేసే వేర్వేరు కంపెనీలకు చెందిన మరికొన్ని చేతి గడియారాలు కూడా అనంత్ అంబానీ వద్ద ఉన్నాయి.



హమాస్‌పై ఇజ్రాయెల్ లక్షిత దాడులు

» ఇద్దరు కీలక కమాండర్లు, 14 మంది ఫైటర్లు మృతి

టెల్‌అవీవ్, జనవరి 1: గాజాపై ఇజ్రాయెల్ లక్షిత దాడులు ఉధృతమవ్వడంతో.. హమాస్‌కు భారీ దెబ్బ తగిలింది. మంగళవారం దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో జరిపిన ఆపరేషన్‌లో హమాస్ నుఖ్బా ప్లటూన్ కమాండర్ అబేద్ అఅల్-హాదీ సభా, ఉత్తర గాజాపై నిర్వహించిన దాడుల్లో మరో కమాండర్ మహమ్మద్ సాదీ మాన్రీ మృతిచెందినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) బుధవారం ఎక్స్‌లో వెల్లడించింది. వీరిద్దరూ అక్టోబరు 7 నాటి దాడుల్లో పాల్గొన్నట్లు తెలిపింది. అటు సెంట్రల్ గాజాలో నిర్వహించిన ఆపరేషన్‌లో 14 మంది హమాస్ ఫైటర్లు హతమయ్యారని, వీరిలో ఆరుగురు అక్టోబరు 7 దాడుల్లో పాల్గొన్నట్లు వెల్లడించింది.

శబరిమలలో.. స్పెషల్ పాస్‌ల రద్దు!

శబరిమల, జనవరి 1: ఎరుమేళి నుంచి అటవీ మార్గంలో అలుదానది, కరిమల కొండ మీదుగా(పెద్దపాదం) శబరిమలకు వచ్చే భక్తులకు ఇస్తున్న స్పెషల్ పాస్‌లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) ప్రకటించింది. గత నెల 30 నుంచి ప్రారంభమైన మకరవిళక్కు సీజన్‌కు అంచనాలకు మించి, ఐదు రెట్లు అధికంగా స్వాములు వస్తున్నారని, దీంతో.. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పాసుల జారీని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

వాళ్లు ఉమ్మిలేస్తారు.. మూత్రం పోస్తారు!

» అందుకే హిందూయేతరులకు షాపులు వద్దు

» మహాకుంభమేళాలో దుకాణాల కేటాయింపుపై అఖాడా పరిషత్ చీఫ్ రవీంద్ర వ్యాఖ్యలు

ప్రయాగ్‌రాజ్, జనవరి 1: ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 13 నుంచి ప్రారంభంకానున్న మహాకుంభమేళాలో హిందూయేతరులకు దుకాణాలు కేటాయించవద్దని అఖిల భారతీయ అఖాడా పరిషత్ చీఫ్ మహంత్ రవీంద్ర పురీ డిమాండ్ చేశారు. ఈ మహాక్రతువును పవిత్రంగా, పరిశుభ్రంగా నిర్వహించాలంటే వారికి దుకాణాలు కేటాయించకూడదని ఆయన పట్టుబట్టారు. "వాళ్లు ఎక్కడబడితే అక్కడ ఉమ్మిలేస్తారు.. మూత్రం పోస్తారు. పవిత్ర మహాకుంభమేళా అపవిత్రం అయిపోతుంది. అందుకే అలాంటి వారికి దుకాణాలు కేటాయించరాదని మా నాగా సాధువుల తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం" అని రవీంద్ర పురీ వ్యాఖ్యానించారు.

సైబర్ నేరాలకు వేదికగా వాట్సాప్

» కేంద్ర హోంశాఖ వార్షిక నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 1: సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు సైబర్ నేరాలకు వేదికలుగా మారాయి. వాట్సాప్ కేంద్రంగా సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్ తర్వాత స్థానంలో టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ ఉన్నాయి. 2023-24 సంవత్సరంలో నమోదైన సైబర్ నేరాల జాబితాను కేంద్ర హోంశాఖ తాజాగా విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం.. గతేడాది మొదటి మూడు నెలల్లో వాట్సాప్ ద్వారా జరిగిన సైబర్ మోసాలపై 43,937 ఫిర్యాదులు రాగా, టెలిగ్రామ్‌లో మోసాలపై 22,680, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా జరుగుతున్న నేరాలపై 19,800 చొప్పున నమోదయ్యాయి. ఈ నేరాలకు పాల్పడేందుకు సైబర్ మోసగాళ్లు గూగుల్ సేవల ప్లాట్‌ఫాంలను ఉపయోగిస్తున్నారు.



ఎడారిలో భారీ సోలార్ వాల్

» మరో అద్భుతాన్ని సృష్టిస్తున్న చైనా

బీజింగ్, జనవరి 1: ఇసుక నుంచి కూడా తైలం పిండగల నేర్పు తనకుందని చైనా మరోసారి నిరూపిస్తోంది. ఇప్పటికే 21,196 కిలో మీటర్ల గ్రేట్ వాల్‌తో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న చైనా.. తమ దేశంలోని వాయవ్య ప్రాంతంలో ఉన్న కుబుకీ ఎడారిలో ఇంకో గ్రేట్ వాల్‌ను నిర్మిస్తూ ఇప్పుడు మరో అద్భుతాన్ని సృష్టిస్తోంది. ఈ కొత్త గోడ సాధారణ ఇటుకలతో నిర్మించేది కాదు. కోట్ల కొద్దీ సౌర ఫలకలతో నిర్మించే సోలార్ విద్యుత్ ప్లాంట్. 2030 కల్లా పూర్తవుతుందని భావిస్తున్న ఈ ప్లాంట్ పొడవు 400 కిలోమీటర్లు, వెడల్పు 5 కిలోమీటర్లు. దలాద్ బానెర్ ప్రాంతంలోని ఎడారిలో నిర్మించే ఈ సౌర విద్యుత్ గోడతో మొత్తం 100 గిగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనేది చైనా లక్ష్యం. ఇప్పటి వరకు 5.42 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యే సౌర ఫలకలను అక్కడ అమర్చినట్లు డ్రాగన్ దేశం అధికారిక పత్రిక చైనా డైలీ వెల్లడించింది. ఇది పూర్తయితే ప్రపంచంలోనే అతి పెద్ద సోలార్ ప్లాంట్ అవుతుంది.

వాహనంతో జనం పైకి దూసుకెళ్లి.. ఆపై కాల్పులు

» అమెరికాలో 10 మంది మృతి.. 30 మందికి గాయాలు

లూసియానా, జనవరి 1: అమెరికాలో నూతన సంవత్సర వేడుకల వేళ ఓ దుండగుడు బీభత్సం సృష్టించాడు. ఓ బార్ వెలుపల జనం గుమిగూడి ఉండగా.. వాహనంతో వారిపైకి దూసుకెళ్లి ఆపై కాల్పులు జరిపాడు. దీంతో 10 మంది మృతి చెందగా.. 30 మంది వరకు గాయపడ్డారు. లూసియానా రాష్ట్రం న్యూ ఆర్లీన్స్‌లోని ఫ్రెంచ్ క్వార్టర్ బోర్బన్ స్ట్రీట్‌లో బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. కొత్త సంవత్సర వేడుకలు కాసేపట్లో ముగుస్తాయనగా.. ఓ బార్ వెలుపల జనాలు గుమిగూడారు. ఓ ఆగంతకుడు ఎస్‌యూవీ పికప్ ట్రక్కుతో వారిపైకి దూసుకెళ్లాడు. అనంతరం తుపాకీ తీసి కాల్పులకు తెగబడ్డాడు. అప్రమత్తమైన అక్కడి పోలీసులు దుండగుడిపై కాల్పులు జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అప్పటికే పలువురు మృతి చెందగా.. దాదాపు 30 మందికి గాయాలయ్యాయి. 'ఇది తీవ్రవాద దాడి కాదని భావిస్తున్నాం. ఘటనా స్థలంలో పేలుడు పదార్థాలు లభించాయి. వాటిని పరిశీలించాల్సి ఉంది' అని ఎఫ్‌బీఐ వెల్లడించింది.

2,331 మంది నైజీరియన్ల దేశ బహిష్కరణ

న్యూఢిల్లీ, జనవరి 1: గత ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి బహిష్కరణకు గురైన విదేశీయుల్లో అత్యధికులు నైజీరియన్లేనని కేంద్ర హోంశాఖ వార్షిక నివేదిక తెలిపింది. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ మొత్తం 2,331 మందిని భారత్ నుంచి బహిష్కరించగా వీరిలో నైజీరియన్లు 1,471 మంది ఉన్నారు. ఆ తర్వాత స్థానంలో బంగ్లాదేశీయులు 411 మంది, ఉగాండాకు చెందినవారు 78 మంది ఉన్నారు. ఇదే సమయానికి 98,40,321 మంది విదేశీయులు భారత్‌లో పర్యటించారు. వీరిలో బంగ్లాదేశీయులు 21 లక్షల మంది ఉండగా అమెరికా నుంచి 17 లక్షల మంది, యూకే నుంచి 9 లక్షల మంది సందర్శించారు. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా ఆస్ట్రేలియా, కెనడా, శ్రీలంక, మలేసియా, జర్మనీ, నేపాల్, సింగపూర్ ఉన్నాయి. అలాగే గతేడాది పాకిస్థాన్‌కు చెందిన 1,112 మందికి లాంగ్ టర్మ్ వీసా (ఎల్‌టీవీ) మంజూరు చేసినట్లు ఆ నివేదికలో హోంశాఖ పేర్కొంది.

రైతులకు కేంద్రం శుభవార్త

పంటల బీమా పథకాలకు కేటాయింపులు పెంపు.. పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐ పథకాల కొనసాగింపు

» కేంద్ర క్యాబినెట్ ఆమోదం

» డీఏపీపై వన్‌టైమ్ స్పెషల్ ప్యాకేజీ పొడిగింపునకు ఓకే

» కొత్త ఏడాది మా తొలి భేటీ రైతు శ్రేయస్సుకు అంకితం: మోదీ



న్యూఢిల్లీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదిలో రైతులకు కేంద్రప్రభుత్వం శుభవార్త తెలిపింది. పంటల బీమా పథకాలైన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై), పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా(ఆర్‌డబ్ల్యూబీసీఐ) పథకాలను 2025-26 వరకూ కొనసాగించడంతో పాటు వాటి కేటాయింపులను పెంచాలని నిర్ణయించింది. ఈ రెండు పథకాలనూ కొనసాగించే ప్రతిపాదనకు బుధవారం ప్రధాని మోదీ నేతృత్వంలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఈ పథకాలకు 2020-21 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు రూ.66,550 కోట్లు కేటాయించగా.. దాన్ని 2021-22 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరాలకుగాను రూ.69,515.71 కోట్లకు పెంచింది. కేంద్రం నిర్ణయంతో 2026 వరకూ రైతులకు మేలు జరగనుంది. అలాగే, బీమా పథకాల అమలులో భారీ మొత్తంలో సాంకేతికతను వినియోగించేందుకు రూ.824.77 కోట్లతో ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ(ఫియట్) ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ టెక్నాలజీ పంట నష్టం అంచనాలను త్వరితగతిన తెలుసుకోవడంతో పాటు, క్లెయిం సెటిల్‌మెంట్, వివాదాలను తగ్గించేందుకు దోహదపడనుంది. అలాగే.. రైతులకు డై అమ్మోనియం ఫాస్ఫేట్(డీఏపీ)పై సబ్సిడీకి అదనంగా ఇస్తున్న వన్ టైం స్పెషల్ ప్యాకేజీని పొడిగించాలని కూడా కేంద్రం నిర్ణయించింది. డీఏపీ మెట్రిక్ టన్నుకు స్పెషల్ ప్యాకేజీ కింద రూ.3,500 ఇవ్వాలని.. దీన్ని జనవరి ఒకటో తేదీ నుంచి తదుపరి ఉత్తర్వుల వరకూ పొడిగించాలని కేంద్ర ఎరువుల శాఖ చేసిన ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. రైతులకు డీఏపీని నిరంతరం తక్కువ ధరలో అందుబాటులో ఉంచడానికి మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు 31 వరకు వర్తించేలా.. డీఏపీపై సబ్సిడీకి అదనంగా రూ.2,625 కోట్లతో వన్ టైం స్పెషల్ ప్యాకేజీకి క్యాబినెట్ గత జూలైలో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. కేంద్రం తాజా నిర్ణయంతో 50 కిలోల డీఏపీ బస్తా రూ.1,350కి రైతులకు అందుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ ప్యాకేజీకి రూ.3,850 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: మోదీ

రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. దేశానికి అన్నం పెట్టేందుకు కష్టపడి పనిచేస్తున్న రైతులను చూసి గర్విస్తున్నట్లు తెలిపారు. 2025లో జరిగిన మొదటి క్యాబినెట్ భేటీని రైతుల శ్రేయస్సు కోసం అంకితం చేసినట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ఈ భేటీలో కీలకనిర్ణయాలు తీసుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

కనండి బాబు!

జననాల రేటు పెంచుకునేందుకు టోక్యో తిప్పలు

టోక్యో, జనవరి 1: కొత్త సంవత్సరం తొలిరోజున జపాన్ రాజధాని టోక్యో నగరం వింత నిర్ణయం తీసుకుంది. పడిపోతున్న జననాల రేటును అరికట్టేందుకు వారంలో నాలుగు రోజులనే ప్రభుత్వ ఉద్యోగులకు పని దినాలుగా ప్రకటించింది. అధిక పని ఒత్తిడి కారణంగా దంపతులకు ఏకాంత సమయాలు తగ్గిపోయాయని టోక్యో ప్రభుత్వం గుర్తించింది. దీంతో వృత్తికి, కుటుంబానికి మధ్య వారు నలిగిపోతున్నారని తెలుసుకుంది. చివరకు.. వృత్తికే ప్రాధాన్యం ఇచ్చి సంతానం ఆలోచనను ఎప్పటికప్పుడు వాయిదా వేసేస్తున్నారని గుర్తించింది. ఈ నేపథ్యంలో దంపతులు విరివిగా కలుసుకునేందుకు, పిల్లల గురించి ఆలోచించుకునేందుకు వీలుగా సెలవు దినాలను పెంచాలని నిర్ణయించామని టోక్యో మెట్రోపాలిటన్ అసెంబ్లీలో గవర్నర్ యురికో కొయికే ప్రకటించారు. ఈ ఏడాది ఏప్రిల్ 15వ తేదీ నుంచి ఈ నిర్ణయం అమలులోకి రానుంది. అలాగే.. చిన్న పిల్లలు ఉన్న దంపతులు తమ జీతంలో కొంత వదులుకునే ప్రాతిపదికన తోటి ఉద్యోగులతో అవగాహనకు వచ్చి.. కాస్త ముందుగానే ఆఫీసు నుంచి బయటపడే వీలు కూడా కల్పిస్తామని కొయికే తెలిపారు. "జపాన్ అత్యంత గడ్డు పరిస్థితుల్లో ఉంది. మన ప్రజల జీవనానికి, బతుకుతెరువుకు, ఆర్థిక జీవితానికి భరోసాని ఇచ్చే చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది" అని కొయికే తెలిపారు.

ఎయిర్ ఇండియా విమానాల్లో వైఫై సేవలు

దేశీయ సర్వీసుల్లో తొలిసారి ఈ సేవలు



న్యూఢిల్లీ, జనవరి1: దేశంలోనే తొలిసారిగా ఎయిర్ ఇండియా తమ విమాన సర్వీసుల్లో వైఫై సేవలు ప్రారంభించింది. దేశీయంగా ఈ సేవలు ప్రస్తుతానికి ఉచితంగా అందిస్తున్నట్లు ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఎయిర్ ఇండియా ఎయిర్ బస్ ఏ-350, బోయింగ్ 787-9, ఎయిర్ బస్ ఏ321 నియో ఎయిర్ క్రాఫ్టులలో ఈ సేవలు ప్రారంభమయ్యాయి. విమానం పదివేల అడుగులకు చేరాక ప్రయాణికులకు వైఫై సేవలు అందుతాయి. లాప్‌టాప్, టాబ్లెట్, ఐఓఎస్, ఆండ్రాయిడ్ వ్యవస్థలున్న స్మార్ట్ ఫోన్‌లకు వైఫై కనెక్టివిటీ ఉంటుంది. ఇంటర్‌నెట్ అందుబాటులోకి రావడంతో ఇక విమాన ప్రయాణ సమయాల్లోనూ స్నేహితులకు, బంధువులకు ఎప్పటికప్పుడు సందేశాలు పంపవచ్చు. సోషల్ మీడియాలో వెంటనే అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఎయిర్ ఇండియా ఇప్పటికే సింగపూర్, లండన్, పారిస్, న్యూయార్క్‌కు నడిపే అంతర్జాతీయ సర్వీసుల్లో వైఫై సేవలు అందిస్తోంది. ఎయిర్‌బస్ ఏ 350, ఎయిర్‌బస్ ఏ321 నియో, బోయింగ్ బీ787-9 ఎయిర్‌క్రాఫ్టులలో ఈ సేవలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి.



అమెరికాలో 'ఓపీటీ' మంటలు!

» ప్రోగ్రాం దుర్వినియోగం అవుతోంది

» హెచ్-1బీ వీసాకు సాధనంగా మారింది

» స్థానిక యువత ఉద్యోగాలకు దూరం

» 'మాగా' నేటివిస్టుల ఆరోపణలు

» ఓపీటీని రద్దు చేయాలని డిమాండ్

» భారతీయ విద్యార్థుల భవితకు ముప్పు

వాషింగ్టన్, జనవరి 1: అమెరికాలో పని అనుభవాన్ని పొందడానికి విదేశీ విద్యార్థులను అనుమతించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రాంపై వ్యతిరేకత క్రమంగా పెరుగుతోంది. ఈ కార్యక్రమంపై మాగా (మేక్ అమెరికా గ్రేట్ అగైన్) నేటివిస్టులు తీవ్ర నిరసన తెలుపుతున్నారు. ఓపీటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రభావం భారతీయ విద్యార్థులపై ఎక్కువగా పడనుంది. అధికారంలోకి వస్తే హెచ్-1బీ వీసాల జారీ విధానాన్ని సంస్కరిస్తామని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మాగా నేటివిస్టులు ఓపీటీపై దృష్టి సారించారు. ఎఫ్-1 వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులు సాధారణంగా వారి మొదటి విద్యా సంవత్సరం తర్వాత ఓపీటీలో పాల్గొనవచ్చు. స్టెమ్ (ఎస్‌టీఈఎం) గ్రాడ్యుయేట్లు మూడేళ్ల వరకూ అమెరికాలో ఉండి పని అనుభవం పొందే అవకాశం ఉంది. తొలుత స్వల్పకాలిక వర్క్ పర్మిట్ కోసం ఉద్దేశించిన ఈ ఓపీటీ ఇప్పుడు పూర్తిగా దుర్వినియోగమవుతోందని, అమెరికాలో ఉద్యోగంతో పాటు హెచ్-1బీ వీసా పొందడానికి ఒక సాధనంగా మారిపోయిందని మాగా నేటివిస్టులు ఆరోపిస్తున్నారు. పని అనుభవం కోసం ఓపీటీలో చేరడానికి చాలా మంది విదేశీ విద్యార్థులు ప్రత్యేకించి భారత్ నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు అమెరికాలో చదవడానికి వస్తుంటారు. ఈ ప్రోగ్రాం వ్యవధి ముగిసేలోగా హెచ్-1బీ వీసాలకు మారడం ద్వారా అమెరికాలో తొమ్మిదేళ్ల వరకూ నివసించే అవకాశం పొందుతారు. వీరిలో కొందరు గ్రీన్ కార్డులు పొంది చివరకు అమెరికా పౌరులుగా మారుతున్నారు. కాంగ్రెషనల్ రిసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) నివేదిక ప్రకారం 2023 కేలండర్ సంవత్సరంలో అమెరికాలో 14,90,000 మంది ఎఫ్-1, ఎం-1 వీసాలు కలిగిన విద్యార్థులు, గ్రాడ్యుయేట్లు ఉన్నారు. వీరిలో 3,44,686 (23% మంది) ఓపీటీద్వారా పనిచేయడానికి అనుమతి పొందారు. ఈ కారణంగా అమెరికన్ గ్రాడ్యుయేట్లు ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని మాగా నేటివిస్టులు మండిపడుతున్నారు. అయితే ఓపీటీని రద్దు చేస్తే గ్రాడ్యుయేషన్ తర్వాత విదేశీ విద్యార్థులు పని అనుభవం పొందకుండానే దేశాన్ని విడిచి వెళ్లాల్సి వస్తుందని, దీనివల్ల అమెరికాకు వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

తల్లిని, నలుగురు చెల్లెళ్లను చంపేశాడు!

గొంతు, మణికట్టు కోసి దారుణ హత్యలు.. యూపీలోని లక్నోలో ఓ హోటల్‌లో ఘటన

లక్నో, జనవరి 1: తల్లిని, నలుగురు చెల్లెళ్లను గొంతు, మణికట్టు కోసి దారుణంగా చంపాడు ఓ ఉన్మాది. ఇదంతా వారిని 'రక్షించేందుకే!' నంటూ ఓ వీడియో కూడా విడుదల చేశాడు. తమ ఇరుగుపొరుగువారు తమ ఇంటిని, స్థలాన్ని ఆక్రమించుకున్నారని, తన చెల్లెళ్లు నలుగురినీ హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి అమ్మేద్దామని చూస్తున్నారని.. దీనిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, అందుకే ఈ హత్యలు చేశానని ఆ వీడియోలో సమర్థించుకున్నాడు. దిగ్భ్రాంతికరమైన ఈ దారుణం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో బుధవారం వెలుగులోకి వచ్చింది. నిందితుడు 24 ఏళ్ల మహమ్మద్ అర్షద్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. జరిగిన ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు. అర్షద్ కుటుంబం యూపీలోని ఆగ్రాలో నివసిస్తోంది. తల్లి అస్మా. నలుగురు చెల్లెళ్లు అల్షియా (19), రహ్మీన్ (18), అక్సా (16), ఆలియా (9). వీరి తండ్రికి సంబంధించిన వివరాలు వెల్లడికాలేదు. ఇటీవల వీరందరూ అజ్మీర్‌కు వెళ్లారు. అక్కడి నుంచి సోమవారం లక్నో చేరుకొని స్థానికంగా ఉన్న షరన్‌జీత్ అనే హోటల్‌లో దిగారు. మంగళవారం రాత్రి అర్షద్ విషం కలిపిన ఆహారం తీసుకొచ్చి తల్లి, చెల్లెళ్లకు అందజేశాడు. వారు అది తిన్న తర్వాత ఒక్కొక్కరిని చంపాడు. కొందరిని చున్నీతో గొంతు నులిమి చంపగా, మరికొందరిని మణికట్టు వద్ద బ్లేడుతో కోసి చంపాడు. చంపేటప్పుడు అరవకుండా నోట్లో గుడ్డలు పెట్టి అదిమాడు. ఈ దారుణ హత్యల అనంతరం తండ్రిని రైల్వేస్టేషన్ వద్దకు తీసుకెళ్లి అక్కడ వదిలేశాడు. తాను పోలీసుల వద్దకు వెళ్లి చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. దీంతో ఈ దారుణం బయటపడింది.

మిస్టరీగా మారిన వీడియో!

తల్లి, చెల్లెళ్లను చంపిన అనంతరం అర్షద్.. హోటల్ గదిలోనే ఓ వీడియో చేసి సోషల్ మీడియాలో విడుదల చేశాడు. వైరల్‌గా మారిన ఆ వీడియోలో.. తమ కుటుంబానికి కొందరు అన్యాయం చేశారని తెలిపాడు. ఆగ్రాలో తాము నివసించే ఇంటిని ఇరుగుపొరుగువాళ్లు బలవంతంగా లాగేసుకున్నారని, పదిరోజులుగా తమ కుటుంబం మొత్తం చలిలో ఫుట్‌పాత్‌పైనే తలదాచుకుంటుందని పేర్కొన్నాడు. రాణు అలియాస్ అఫ్తాబ్, అలీమ్‌ఖాన్, సలీం, అహ్మద్ రాణు, ఆరిఫ్, అజహర్ అనే వ్యక్తులు తమకు అన్యాయం చేశారని, వీరందరూ కలిసి ఓ భూఆక్రమణ మాఫియాను నడుపుతున్నారని, అమ్మాయిల అక్రమ రవాణాకు కూడా వీరు పాల్పడుతుంటారని ఆరోపించాడు. 'అమ్మాయిలను సరఫరా చేసే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి నా నలుగురు చెల్లెళ్లను అమ్మేద్దామని వీరు కుట్ర పన్నారు. నా మీద తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపాలని చూశారు. మా స్వస్థలం యూపీలోని బదౌన్. మమ్మల్ని బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వ్యక్తులుగా ముద్ర వేసి దుష్ప్రచారం చేశారు. వీరి ఆగడాలు భరించలేక మేం హిందూమతంలోకి మారాలనుకున్నాం. మా ఇల్లును ఆక్రమించుకున్నారు. మిగిలిన స్థలంలో ఒక ఆలయాన్ని కట్టి ప్రశాంతంగా బతకాలనుకున్నాం. పూజలు కూడా చేయటం ప్రారంభించాం' అని అర్షద్ వెల్లడించాడు. తమ మీద జరుగుతున్న వేధింపులపైన ఎంతమందికి చెప్పినా కూడా తమకు సహాయం లభించలేదన్నాడు. తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి మరో దారి లేకే తాము అందరమూ చనిపోవాలని నిర్ణయించుకున్నామని, తన కుటుంబసభ్యులను మణికట్టు, గొంతు కోసి తానే చంపానని, తాను కూడా ఇంకొద్దిసేపట్లో చనిపోతానని తెలిపాడు. రాత్రి 2 గంటలకు ఈ వీడియో చేస్తున్నానంటూ, దుప్పట్లతో కప్పి ఉన్న తన వారి మృతదేహాలను కూడా ఈ వీడియోలో అర్షద్ రికార్డు చేశాడు. వీడియో చివరలో ప్రధాని మోదీకి, యూపీ సీఎం యోగికి ఓ విజ్ఞప్తి చేశాడు. 'దేశంలోని ముస్లింలందరూ ఒకే రకమైన వాళ్లు కాదు. మేం చనిపోయిన తర్వాతనైనా మాకు న్యాయం చేయండి. యోగీ జీ మీరు గొప్పగా పని చేస్తున్నారు. ఇటువంటి ముస్లింలను వదిలిపెట్టొద్దు. వారు భూఆక్రమణ, నకిలీ కరెన్సీ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు' అని అర్షద్ పేర్కొన్నాడు. ఆక్రమణకు గురైన తమ ఇంటిని ఆలయంగా మార్చాలని, తమకు సంబంధించిన వాటిని, తన చెల్లెళ్లు సేకరించుకున్న వస్తువులను అనాథ శరణాలయానికి అందజేయాలని కోరాడు.

త్వరలో ఒక్కటి కానున్న ఎంపీ తేజస్వి సూర్య, గాయని శివశ్రీ స్కందప్రసాద్





బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరు దక్షిణ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ఓ ఇంటివాడు అవుతున్నారు. చెన్నైకి చెందిన గాయని, భరతనాట్య కళాకారిణి శివశ్రీ స్కంద ప్రసాద్‌ను ఆయన పెళ్లి చేసుకోనున్నారు. రెండోసారి ఎంపీగా, భారతీయ జనతా యువమోర్చా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్న తేజస్వి సూర్య వివాహం గురించి ఆరేడేళ్లుగా పలు సభలు, సమావేశాలలో ప్రస్తావనలు వచ్చాయి. ఆయన సున్నితంగా దాటవేస్తూ వచ్చారు. తాజాగా ఆయన వివాహం గురించి రెండు కుటుంబాలవారు నిర్ణయానికి వచ్చారని తెలిసింది. 29 ఏళ్ల శివశ్రీ శస్త్ర యూనివర్సిటీలో బయో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. మద్రాస్ యూనివర్సిటీలో భరతనాట్యంలో ఎంఏ, మద్రాస్ సంస్కృత యూనివర్సిటీలో సంస్కృతంలో ఎంఏ పూర్తి చేశారు. సైక్లింగ్, ట్రెక్కింగ్ అంటేనూ ఆమె ఆసక్తి చూపుతారు. ఆమె యూట్యూబ్ చానెల్‌కు రెండు లక్షలమంది ఫాలోయెర్స్, సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. గత ఏడాది శ్రీరామనవమి సందర్భంగా శివశ్రీ కన్నడలో 'పూజిసలిందె హూగలుతందె' (పూజలు చేయ పూలు తెచ్చాను) అనే పాటను పాడటంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆమెను ప్రశంసించారు. తేజస్విసూర్యకు 34 ఏళ్లు. ఫిట్‌నెస్, వాక్చాతుర్యంతో రాజకీయాలలో పేరు సంపాదించారు. ఆర్ఎస్ఎస్, ఏబీవీపీలో పనిచేశారు. తేజస్వి సూర్య లా పూర్తి చేసి, అడ్వకేట్‌గా వృత్తి ప్రారంభించారు. ఆ తరువాత కొంతకాలానికే రాజకీయాల్లోకి వచ్చారు. మార్చిలో వీరి వివాహం జరుగుతుందని తెలిసింది.

మన్మోహన్‌సింగ్ స్మారకం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం

» స్థలాన్ని ఎంపిక చేయాలని సింగ్ కుటుంబాన్ని కోరిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 1: దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ స్మారకాన్ని నిర్మించే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా రాజ్ ఘాట్, రాష్ట్రీయ స్మృతి స్థల్ లేదా కిసాన్ ఘాట్‌లకు సమీపంలో ప్రతిపాదించిన స్థలాన్ని ఎంపిక చేయాలని సింగ్ కుటుంబాన్ని కోరినట్టు తెలుస్తోంది. స్మారకం కోసం ఒకటి నుంచి ఒకటిన్నర ఎకరాల స్థలాన్ని ప్రతిపాదించినట్టు సమాచారం. ఈ ప్రాంతాలను ఇప్పటికే పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు పరిశీలించారు. నూతన విధానం ప్రకారం స్మారకానికి అవసరమైన స్థలాన్ని కేటాయించడానికి ముందు ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. తర్వాత భూమి కేటాయింపునకు దరఖాస్తు చేయాలి. స్మారకం నిర్మాణానికి సంబంధించి సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ (సీపీడబ్ల్యూడీ)తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సి ఉంటుందని తెలుస్తోంది. మన్మోహన్ సింగ్ కుటుంబంతో సంప్రదించిన తర్వాతే స్మారకం స్థలాన్ని ఖరారు చేయనున్నట్టు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. కాగా జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సంజయ్ గాంధీల స్మారకాలున్న రాజ్‌ఘాట్‌కి సమీపంలో మన్మోహన్ సింగ్ స్మారకానికి అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది.

మా మంచి మేడమ్

- విడిచి వెళ్లొద్దంటూ విద్యార్థుల కన్నీళ్లు
- రిటైరైనా వచ్చి బాగోగులు చూస్తానంటూ ఓదార్పు

రామభద్రపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తమను విడిచి వెళ్లొద్దంటూ చుట్టూ చేరి విద్యార్థుల రోదనలు.. వారిని సముదాయించలేక ఉపాధ్యాయిని కంట నీరు.. విజయనగరం జిల్లా రామభద్రపురం పూడివీధి ఎలిమెంటరీ పాఠశాలలో బుధవారం కనిపించిన దృశ్యమిది. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయగౌరి ఈ ఏడాది మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. దీంతో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న ఆమె బుధవారం పాఠశాల నుంచి వెళ్తుండగా విద్యార్థులు తమను విడిచి వెళ్లొద్దంటూ వేడుకున్నారు. ఆ చిన్నారుల కన్నీరు చూసి ఆమె కూడా దుఃఖం ఆపుకోలేకపోయారు. రిటైరైనా పాఠశాలకు వచ్చి బాగోగులు చూసుకుంటానంటూ విద్యార్థులను ఓదార్చారు. విజయగౌరి 2023 జూన్ నుంచి ఈ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్నారు. తన 33 ఏళ్ల సర్వీసులో ఎక్కడ పనిచేసినా విద్యతోపాటు సాంస్కృతిక, చిత్ర లేఖనం, క్రీడా పోటీల్లో విద్యార్థులను బాగా ప్రోత్సహించేవారు. జాతీయ పండగలప్పుడు పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం, ఆకలితో వచ్చిన విద్యార్థులకు తన సొంత డబ్బుతో అల్పాహారం తెప్పించి పెట్టడం, వారి అభిరుచులకు అనుగుణంగా ప్రాజక్టులు చేయించడం తదితరాల వల్ల ఆమెతో విద్యార్థులకు అనుబంధం పెరిగింది. అందుకే ఆమె పాఠశాలను విడిచి వెళ్తుంటే విద్యార్థులు కన్నీటిపర్యంతమయ్యారు.



తమను విడిచి వెళ్లొద్దంటూ ఏడుస్తున్న విద్యార్థులు.. కన్నీళ్లు తుడుచుకుంటున్న ప్రధానోపాధ్యాయురాలు విజయగౌరి

సోషల్ మీడియాను సక్రమంగా వాడదాం

- అసభ్యకరమైన పోస్టులకు స్వస్తి చెబుదాం
- చాగంటి కోటేశ్వరరావు సందేశం



అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): 'మనం ఎవరినైనా ఏదైనా మాట అనే ముందు, వాళ్లు కూడా మనల్ని అలాగే అంటే మనకి బాధగా ఉంటుందా... సంతోషం కలుగుతుందా? అన్నది ఆలోచించుకోవాలి' అని ప్రవచన కర్త, ఆంధ్రప్రదేశ్ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచించారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులపై స్పందించిన ఆయన రాష్ట్ర ప్రజలకు వీడియో ద్వారా తన సందేశాన్ని తెలియజేశారు. 'మనం ఇతరులను ఒక మాట అంటే వాళ్లు బాధపడతారని తెలిసినప్పుడు అలాంటివి మాట్లాడకూడదు. ఏ పని చేస్తే ఇతరులు బాధపడతారో అటువంటి పనులు అసలు చేయకూడదు. ధర్మాలలోకెల్లా పెద్ద ధర్మం ఇదే. కాబట్టి ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలి' అని చాగంటి సూచించారు. '84 లక్షల జీవరాసుల్లో వాక్కు ఉన్నది ఒక్క మనుషుడికే. ఆ మనిషి తన వాక్కును పది మంది శాంతి... సంతోషాల కోసం వాడాలి. అంతేగాని ఇతరుల మనసులను గాయపర్చడానికి మాటల్ని వాడకూడదు. ఈ విషయాలు దృష్టిలో పెట్టుకుని సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుందాం. ఇతరుల మనసులు బాధపడేటట్టుగా, ప్రత్యేకించి కుటుంబ సభ్యుల్ని, మహిళల్ని ఉద్దేశించి అసభ్యకరమైన పోస్టులు పెట్టకుండా మనల్ని మనం నియంత్రించుకుని సభ్యత, సంస్కారాలను చాటుకుందాం' అని చాగంటి పిలుపునిచ్చారు.

డీఎస్పీ పదోన్నతుల్లో 'సీమ' సీఐలకు అన్యాయం!

1996వ బ్యాచ్‌కు మొండి చేయి.. 2003 బ్యాచ్ సీఐలకు అవకాశం

- రాయలసీమ పోస్టులపై శీతకన్ను
- ఇతర ప్రాంతాల వారికి ప్రమోషన్లు
- సానుకూలం కాకుంటే న్యాయపోరాటానికి సిద్ధం
- జాబితాపై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల గుర్రు
- నేడు డీజీపీ తిరుమలరావు వద్ద పంచాయితీ



అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల(సీఐ) పదోన్నతుల్లో ప్రాంతాల మధ్య పోలీసు శాఖ వివక్ష చూపుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక రేంజ్‌లో ఉన్న ఖాళీలను గోప్యంగా ఉంచి.. మరో రేంజ్‌లో లేని పోస్టులు సృష్టించి భర్తీ చేస్తున్నారనే వాదన తెరమీదికి వచ్చింది. ఫలితంగా కర్నూలు రేంజ్‌లో 1996లో సబ్ ఇన్‌స్పెక్టర్లు(ఎస్ఐ)గా నియమితులైనవారు ఇప్పటికీ సీఐలుగానే ఉన్నారు. ఆ తర్వాతి బ్యాచ్(1998) ఎస్ఐలదీ అదే పరిస్థితి. కానీ, గుంటూరు రేంజ్‌లో మాత్రం 2003 బ్యాచ్ ఎస్సైలు సీఐల నుంచి డీఎస్పీల పదోన్నతి జాబితాలో చేరారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారు ఇలా రోస్టర్ జాబితాలో ముందుకొచ్చారా? అంటే కాదు. గుంటూరు రేంజ్‌లో జనరల్ కేటగిరీ సీఐలు.. రాయల సీమ రేంజ్‌లో బీసీ అధికారుల కన్నా ముందున్నారు. ఏలూరు, విశాఖపట్నం రేంజ్‌లలో ఉన్న పోస్టుల కన్నా అధికంగా చూపడంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీమ సీఐలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతుల నిబంధనలు, సుప్రీం కోర్టు మార్గదర్శకాలు, గత ప్రభుత్వాలు ఇచ్చిన జీవోలు తీసుకుని డీజీపీకి విన్నవించేందుకు సిద్ధమయ్యారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఆయనకు తెలియజేసి న్యాయం చేయాలని అభ్యర్థించనున్నారు. అప్పటికీ తమకు న్యాయం జరగకపోతే కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. పోలీసు శాఖలో ఏర్పడే ఖాళీలు, పదవీ విరమణల నేపథ్యంలో ఆ పోస్టులకు కొత్తగా నోటిఫికేషన్లు విడుదల చేసి అర్హులను ఎంపిక చేస్తారు. మరోవైపు పదోన్నతుల ద్వారా కొన్నింటిని భర్తీ చేస్తారు. ప్రమోషన్లకు సంబంధించి గతంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో-153 మార్గదర్శకాలను డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీలు పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తాయి. రాష్ట్రంలో కానిస్టేబుల్ పోస్టులు జిల్లా పరిధిలో ఉంటే ఎస్ఐ పోస్టులు రేంజ్ పరిధిలో, డీఎస్పీ పోస్టులు రాష్ట్రస్థాయిలో ఉంటాయి. అయితే, కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ వరకు జిల్లాలోనే పనిచేసే ఉద్యోగి పదోన్నతి లభించి ఎస్ఐ అయితే రేంజ్ పరిధిలోకి వస్తారు. ఉదాహరణకు అనంతపురం జిల్లాలో ఏఎస్ఐకి పదోన్నతి లభించి ఎస్ఐ అయితే, కర్నూలు రేంజ్‌కు మారతారు. ఇక, సీఐలకు పదోన్నతి వచ్చి డీఎస్పీలు అయితే రాష్ట్ర స్థాయికి చేరతారు.

జాబితా సిద్ధం కావడంతో

రాష్ట్ర స్థాయి పోలీసు నియామకాల్లో రేంజ్‌ల వారీగా ఎంపికైన ఎస్ఐలలో 1995 బ్యాచ్ వరకు రాయల సీమలో కొందరు మినహా ఇతర రేంజ్‌లలో ఎస్ఐలు డీఎస్పీలుగా పదోన్నతులు పొందారు. ఈ నేపథ్యంలో 4 రేంజ్‌లలోని 1996, 1998 బ్యాచ్ ఎస్ఐలు ఇప్పుడు డీఎస్పీలుగా పదోన్నతి పొందాల్సి ఉంది. అన్ని ప్రాంతాల నుంచి అర్హుల జాబితా రూపొందించిన పోలీసు ప్రధాన కార్యాలయం.. ఆయా రేంజ్‌ల ఐజీలు, డీఐజీలకు పంపి పరిశీలించాలని కోరింది. అనంతరం తుది జాబితా పంపాలని సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా 155 మంది సీఐలు డీఎస్పీల పదోన్నతులకు ఎంపికయ్యారు. అయితే, వీరిలో చార్జ్ మెమోలు, సస్పెన్షన్లు, ఏసీబీ కేసులు, ఇతరత్రా క్రమ శిక్షణ చర్యలు ఏమైనా ఉన్నాయా? పనితీరు ఎలా ఉంది? తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఆ తర్వాత రేంజ్‌ల వారీగా తుది జాబితాను రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు పంపుతారు. ఆ జాబితాను చూసిన కర్నూలు రేంజ్ సీఐలు అవాక్కయ్యారు.

41 తప్పులు

రాయలసీమలో 1996 బ్యాచ్ సీఐలను కాదని, గుంటూరు రేంజ్‌లో 2003 బ్యాచ్‌కు చెందిన 13 మందిని పదోన్నతి జాబితాలోకి చేర్చడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పదోన్నతుల జాబితాను నిశితంగా పరిశీలించారు. ఎక్కడెక్కడ తప్పులున్నాయి? డబుల్ ఎంట్రీలు ఏస్థాయిలో ఎన్ని జరిగాయి? బ్యాచ్‌ల వారీగా, రిజర్వేషన్లు, కన్వర్షన్లు ఇలా అన్నీ పరిగణనలోకి తీసుకున్నారు. దీంతో విశాఖపట్నం రేంజ్‌లో 12, ఏలూరు రేంజ్‌లో 19, గుంటూరు రేంజ్‌లో 41 తప్పులున్నట్లు పసిగట్టారు. ఆయా అంశాలను డీజీపీకి వివరించి న్యాయం చేయాలని కోరనున్నారు. ఒకవేళ న్యాయం జరగకపోతే హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.



ఏడుకొండలుకు గాలి యంత్రం అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీవో మధులత

24 గంటల్లోనే చంద్రబాబు హామీ అమలు

- ఏడుకొండలుకు గాలియంత్రం అందజేసిన కలెక్టర్

నరసరావుపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా యల్లమంద పర్యటనలో మంగళవారం సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ 24 గంటల్లోనే అమలు అయింది. పింఛన్ల పంపిణీ సందర్భంగా ఉల్లంగుల ఏడుకొండలు ఇంటికి వెళ్లి పింఛన్ అందజేసి వారికి చంద్రబాబు స్వయంగా కాఫీ తయారు చేసి అందజేసిన విషయం తెలిసిందే. ఈ సమయంలో తనకు టైర్లకు గాలి పట్టే గాలి యంత్రం(ఎయిర్ కంప్రెషర్) కావాలని ముఖ్యమంత్రిని ఏడుకొండలు కోరారు. ఆ యంత్రాన్ని అతనికి అందించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పి.అరుణ్‌బాబు బుధవారం ఏడు కొండలు ఇంటికి వెళ్లి ఆ గాలియంత్రాన్ని అందజేశారు. చంద్రబాబు చెప్పినట్లుగానే తన ఇంటికి అధికారులు వచ్చి గాలి యంత్రాన్ని ఇవ్వడంతో ఏడుకొండలు కుటుంబం ఆనందోత్సాహాలు వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆ కుటుంబం సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేసింది. ఆయన రాకతో తమ ఇంటికి వెలుగొచ్చిందని, తమకు ఇచ్చిన మాటను అమలు చేసి ఆదుకున్నారని ఏడుకొండలు చెప్పారు.

కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ నాటకోత్సవాలను కర్నూలు డీఈవో శామ్యూల్‌పాల్ ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో తోడల్లుళ్లు మృతి

- ఒక మహిళ పరిస్థితి విషమం
- ధర్మవరం చర్చికి వెళ్తుండగా ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ
- మృతులు విజయనగరం జిల్లాకు చెందిన వారు



రాంబాబు, ఉమ, నాగలక్ష్మి, గోపీ (ఫైల్)

మార్టూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. చర్చిలో ప్రార్థన కోసం వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తోడల్లుళ్లు మృతి చెందారు. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమయ్యాయి. ఈ ప్రమాదం బుధవారం ఉదయం 11 గంటల సమయంలో బాపట్ల జిల్లా మార్టూరు మండల పరిధిలో రాజుపాలెం కూడలి సమీపంలో జరిగింది. గండిపల్లి ఫ్యాక్టరీ నుంచి ఆవుల మేత లోడుతో చిత్తూరు వెళుతున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొల్లు రాంబాబు(24), పల్లపు గోపీ(23) మృతి చెందగా, రాంబాబు భార్య ఉమ తీవ్రగాయాలతో అపస్మారకస్థితిలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విజయనగరం జిల్లా బాడింగి మండలం పి.వెంకంపేట గ్రామానికి చెందిన రాంబాబు, అదే జిల్లా తెర్లాం మండలం నందబలగ గ్రామానికి చెందిన గోపీ తోడల్లుళ్లు. ఇద్దరూ విజయవాడలోని వాంబే కాలనీలో నివాసం ఉంటున్నారు. వారిద్దరూ భార్యాపిల్లలతో కలిసి అత్తగారి ఊరు మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామానికి వచ్చారు. నూతన సంవత్సరం తొలిరోజు ప్రార్థన కోసం అద్దంకి సమీపంలోని ధర్మవరం చర్చికి పయనమయ్యారు. అత్తమామలు గంటా తిరుపతిరావు, లక్ష్మీ, బావమరుదులు రామ్, లక్ష్మణ్, మరో వ్యక్తితో కలిసి నాలుగు బైకులపై బుధవారం ఉదయం 8 గంటలకు బయలుదేరారు. ఒక బైక్‌పై రాంబాబు దంపతులు, గోపీ.. మిగిలిన వారు విడివిడిగా ద్విచక్రవాహనాలపై బయలుదేరారు. ఈ క్రమంలో రాంబాబు, గోపీ ప్రమాదంలో మరణించారు. వీరు వెనుక ఉండటంతో ప్రమాదం జరిగిన సంగతి మిగిలిన వారికి తెలియలేదు. మార్టూరు దాటి వలపర్ల వద్ద టిఫిన్ కోసమని ఆగిన రామ్ ఫోన్ చేయడంతో ప్రమాదం గురించి తెలిసింది. వెంటనే వారంతా వెనక్కి వచ్చి రోడ్డుపై పడి ఉన్న మృతదేహాలను చూసి ఒక్కసారిగా కుప్పకూలారు. సీఐ శేషగిరిరావు ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న మృతదేహాలను పరిశీలించారు. లారీడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదా తెలిపారు.

నేటి నుంచి బెజవాడలో పుస్తక మహోత్సవం

- 11 రోజులపాటు నిర్వహణ



ఇందిరాగాంధీ స్టేడియంలో పుస్తక మహోత్సవానికి సిద్ధమవుతున్న స్టాల్స్

విజయవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో ఏటా విజయవాడలో నిర్వహించే పుస్తక మహోత్సవం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఎంజీ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 35వ విజయవాడ పుస్తక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీని ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. మొత్తం 294 స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాల నిర్వహణకు రెండు వేదికలు ఏర్పాటు చేశారు. పుస్తకావిష్కరణలు జరిగే వేదికకు చెరుకూరి రామోజీరావు వేదికగా నామకరణం చేశారు. చిన్నారుల కార్యక్రమాలు నిర్వహించే వేదికకు రతన్‌టాటా ప్రతిభా వేదికగా పేరు పెట్టారు. ఈ ప్రదర్శన గురువారం నుంచి 12వ తేదీ వరకు 11 రోజులపాటు రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పుస్తక ప్రదర్శన కొనసాగుతుంది.

తులసిబాబును గుర్తించేందుకు అనుమతి ఇవ్వండి

- ప్రకాశం ఎస్పీకి డిప్యూటీ స్పీకర్ రఘురామ లేఖ

ఒంగోలుక్రైం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కస్టోడియల్ టార్చర్ కేసుకు సంబంధించి విచారణకు పిలిచిన కామేపల్లి తులసిబాబును గుర్తించేందుకు తనకు అనుమతి ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కోరారు. ఈ మేరకు కేసు విచారణ చేస్తున్న ప్రకాశం ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు లేఖ రాశారు. 2021 మే 14 రాత్రి సీఐడీ అధికారులు కస్టోడియల్ టార్చర్‌కు గురి చేసిన సమయంలో 115 కిలోలు బరువు ఉన్న పొడవాటి వ్యక్తి తన ఛాతీపైన కూర్చున్నారని తనకు కొంతమంది చెప్పారని, ఆ వ్యక్తి తులసిబాబుగా భావిస్తున్నానని రఘురామ తెలిపారు. అతనిని ఈనెల 3న తన కేసులో విచారణకు పిలిచారని పత్రికలలో చూశానన్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన తులసిబాబు అప్పట్లో సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ అవినీతికి చీఫ్ కలెక్షన్ ఏజెంటుగా, కుడిభుజంగా ఉండేవాడని తెలిసిందన్నారు. ప్రస్తుతం గుడివాడ టౌన్‌లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కార్యాలయంలో కార్యకలాపాలు చూస్తున్నాడని తెలిపారు. అతనిని విచారణ పిలిచిన రోజు తనకు అనుమతి ఇస్తే గుర్తుపట్టగలనని లేఖలో పేర్కొన్నారు.

నేడు బెంగళూరుకు ఏపీ మంత్రుల బృందం

- ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం

బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో అమలవుతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంపై అధ్యయనం చేసేందుకు ఏపీ మంత్రుల బృందం గురువారం బెంగళూరులో పర్యటించనుంది. రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, హోం మంత్రి అనిత, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి ఈ బృందంలో ఉన్నారు. కర్ణాటక రవాణా శాఖ ముఖ్యులతో శుక్రవారం వారు భేటీ అవుతారు. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రుల బృందం అధ్యయనం చేస్తోంది.

పెంపుడు కుక్క మృతి.. యజమాని ఆత్మహత్య



బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్క మరణాన్ని జీర్ణించుకోలేక బెంగళూరు నగరంలోని హెగ్గడదేవనపురలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజశేఖర్ (33) అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం జర్మన్ షెపర్డ్ జాతికి చెందిన కుక్కను కొనుగోలు చేశాడు. దానికి బౌన్సీ అని పేరు పెట్టుకుని పెంచాడు. అనారోగ్యం కారణంగా బౌన్సీ మంగళవారం మృతి చెందింది. అదే రోజు అంత్యక్రియలు నిర్వహించిన రాజశేఖర్, ఇంటికి వచ్చాక బౌన్సీకి ఉపయోగించిన చెయిన్‌తో ఉరి వేసుకున్నాడు.

కాకినాడ బీచ్‌లో ఇద్దరు విద్యార్థులు మృతి

సర్పవరం జంక్షన్(కాకినాడ), జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం తొలిరోజు కాకినాడ ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌లో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. కొత్తపల్లి మండలం కోనపాపపేటకు చెందిన గుత్తుల సతీష్‌కుమార్(17) స్నేహితులతో కలిసి బుధవారం బీచ్‌కు వచ్చాడు. కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన వడిసెల గౌరీ లక్ష్మీనాగసాయి(16), బోరా శ్రీనివాస్ కూడా ఈ బీచ్‌కు వచ్చారు. వీరంతా వేర్వేరుగా స్నానానికి దిగగా కెరటాల ఉధృతికి గల్లంతయ్యారు. వీరిలో సతీష్‌కుమార్, నాగసాయి మృతదేహాలు తీరానికి కొట్టుకువచ్చాయి. శ్రీనివాస్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బీరేన్ పశ్చాత్తాపం!

మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌కు సంవత్సరాంతమున జ్ఞానోదయం కలిగింది. ఏడాదిన్నరగా ఇల్లు తగలబడటానికి కారకుడు తానేనని ఆయన ఒప్పుకున్నారు. 2023మే 3నుంచి 2024డిసెంబరు 31వరకూ జరిగినదంతా మణిపూర్ ప్రజలు తమ మనస్సుల్లోంచి చెరిపేసి, తనను క్షమించేయాలని కోరుతూ తీవ్ర పశ్చాత్తాపాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో జరిగినదానికి ఎంతో చింతిస్తున్నాను, ఎంతోమంది మరణించారు, ఎంతోమంది తమ ఆత్మీయులను కోల్పోయారు, ఇళ్ళూవాకిళ్ళూ వదిలేశారు అంటూ, ఇదంతా తన కారణంగానే జరిగిందని బాధపడ్డారు. తన వల్ల కష్టపడ్డవారు, నష్టపోయినవారు నిండుమనసుతో తనను క్షమించేసి, అన్ని జాతులవారూ, తెగలవారూ చేయీచేయీ కలిపి కొత్తసంవత్సరంలో ఆనందంగా కలిసిసాగాలన్నది ఆ ప్రకటన సారాంశం.

పశ్చాత్తాపాన్ని ప్రకటించడం, క్షమాపణలు చెప్పడం మెచ్చదగ్గ లక్షణాలు. ఎదుటివారు ఎంత కఠినాత్ములైనా, ఇటువంటి చర్యలకు కాస్తంతైనా మనసు కరగకుండా ఉండదు. బీరేన్ ప్రకటన మండుతున్న గుండెలను ఓదార్చి, శాంతిస్థాపనకు ఏమాత్రం దోహదపడినా సంతోషించాల్సిందే. కానీ, జరిగిందేదో జరిగిపోయిందనీ, గతాన్ని మరిచిపోవాలనీ చెప్పడానికి బీరేన్‌సింగ్ అర్హుడా అన్నది అతి ముఖ్యమైన ప్రశ్న. ఇప్పటివరకూ ఆయన ఘోరాన్ని ఒప్పుకోలేదని, ఇప్పుడు ఒప్పుకున్నారని, సమస్య తీవ్రతను గుర్తించడం, పరస్పరం కలహించుకుంటున్నవారు ఏకం కావాలని ఆశించడం మంచిదేనన్న విశ్లేషణలు సరైనవే. కానీ, ఆయన క్షమాపణల వెనుక కూడా ఏవో కొత్త కుట్రలున్నాయేమోనని, మరింత అణచివేతకు ఆయన మార్గాన్ని సుగమం చేసుకుంటున్నారని మీతీయేతర జాతులవారు అనుమానపడుతున్నారట.

కొత్తసంవత్సరంలో అంతా మంచి జరగాలని కోరుకోవడంలో తప్పేమీ లేదు. కానీ, తగిన ప్రాతిపదికలు, పునాదులు లేకుండా అది తనకు తానుగా జరిగిపోదని ఆయనకూ తెలుసు. ఏడాదిన్నరకాలంలో సయోధ్యకు వీలైన వాతావరణాన్ని ఆయన సృష్టించిందేమీ లేదు. హైకోర్టు తన పరిధిని అతిక్రమించి మీతీలకు ఎస్టీ రిజర్వేషన్ కట్టబెట్టే చర్యలకు తెరదీయడం వెనుక బీరేన్ కుట్ర ఉన్నదని ఆదివాసీ తెగలు అనుమానించడంతో ఈ అగ్గిరేగిన విషయం తెలిసిందే. అప్పటికే వారికి వ్యతిరేకంగా బీరేన్ ప్రభుత్వం పలు నిర్ణయాలు చేయడం, వారిని మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులుగా చిత్రీకరించడం వంటివి నిప్పు సులువుగా అంటుకోవడానికి దోహదం చేశాయి. ఈ మొత్తం హింసాకాండలో బీరేన్ పూర్తిగా మీతీలపక్షాన వ్యవహరించారు. చివరకు పోలీసు స్టేషన్లనుంచి దోచుకున్న ఆయుధాలు కూడా వారి చేతుల్లోకే పోయాయి. మీతీ మిలిటెంట్‌గ్రూపులు రెచ్చిపోగలిగాయి. మీతీ బీరేన్ తమపక్షాన లేరని ఆదివాసీ తెగలు అనతికాలంలోనే నిర్ధారణకు వచ్చాయి. ఉన్నతస్థానంలో ఉంటూ సమన్యాయం చేయవలసిన నాయకుడు తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, తమకు చెందాల్సిన ఉద్యోగాలనూ, ప్రకృతివనరులను తనవారికి కట్టబెట్టదల్చుకున్నాడని వారికి అనిపించింది. నాయకుడిపైన ఉన్న ఈ విశ్వాసరాహిత్యమే అక్కడ అగ్గి ఆరనివ్వకుండా చేస్తోంది. దశాబ్దాలుగా పరస్పరం ఘర్షణపడుతున్న ఆదివాసీ తెగలన్నీ ఏకతాటిమీదకు వచ్చాయి. సమాజం నిలువునా చీలిపోయి, పరస్పర అవిశ్వాసం నిండిన ఈ వాతావరణం మిలిటెంట్ గ్రూపులకు సరికొత్త ఆక్సిజన్ అందించింది. ఇప్పుడు హింస ఎవరో ఇద్దరి మధ్య అని కాక, మొత్తం సమాజాన్ని కమ్మేసివుంది. ఏడాదిన్నరకాలంగా ఒక రాష్ట్రం ఇలా మండుతూంటే, కేంద్రం ఊరుకోవడం, ముఖ్యమంత్రిని సమర్థించుకురావడం మణిపూర్ విషయంలోనే జరిగింది. అదే ఓ విపక్షపాలిత రాష్ట్రమైవుంటే అగ్గిరాజుకున్న అనతికాలంలోనే అది కేంద్రం చేతుల్లోకి పోయివుండేది. ఇంతజరిగినా అక్కడకు మోదీ వెళ్ళకుండా, జరుగుతున్నదేమిటో దేశప్రజలకు తెలియనివ్వకుండా, పార్లమెంట్‌లో సైతం అసత్యాలతో కాలాన్ని నెట్టుకొచ్చేశారు. వేలాది సైనికులను మోహరించడం తప్ప, బీరేన్‌ను తప్పించాలన్న డిమాండ్‌కు ఢిల్లీపాలకులు లొంగనే లేదు.

నాలుగు మంచిమాటలు చెప్పి, క్షమించమని అడిగినంతనే సులభంగా వదిలేయగలిగేంత చిన్న పొరపాటు కాదిది. మణిపూర్ పాలకులు ఉద్దేశపూర్వకంగా రేపిన కార్చిచ్చు అది. తమ ప్రయోజనాలకు అనుగుణంగా దానిని రగిలిస్తూవచ్చిన వారు ఇప్పుడు హఠాత్తుగా గతాన్ని మరిచిపోమంటున్నారు. ఆదివాసీ తెగల్లో తన పట్ల ఆగ్రహానికీ, అవిశ్వాసానికి ఏయే చర్యలు దోహదం చేశాయో బీరేన్‌కు తెలుసు. ఈ సందర్భంగా వారికి కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చివున్నా ఆయన పట్ల నమ్మకం పెరిగేది, ఈ పశ్చాత్తాపానికి కాస్తంత విలువ ఉండేది.

సామాజిక వైవిధ్యంలో జీవన సౌందర్యం

తబలా మేస్ట్రో జాకిర్ హుస్సేన్ ఇటీవల మరణించిన తరువాత ఆయనకు సంబంధించిన ఒక పాత విడియో క్లిప్ సామాజిక మాధ్యమాలలో మళ్లీ కనిపిస్తోంది. అందులో ఆయన తన తండ్రి, సుప్రసిద్ధ హిందుస్థానీ సంగీతకారుడు అల్లా రఖా చెప్పిన కొన్ని మాటలను గుర్తు చేసుకున్నారు: 'నేను చదువుల తల్లి సరస్వతిని, ప్రథమ పూజ్యుడు వినాయకుడిని ఆరాధిస్తుంటాను. వారు నా ఉపాధ్యాయులు'. విశేషంగా ఆకట్టుకునే, అంతకంటే ఆసక్తికరమైన ఈ విలువైన వాక్కులు మత నిష్ఠాపరుడు, దైవ భీతుడు అయిన ఒక ముస్లిం మతస్థుడివి. మన భారతావనిలో శతాబ్దాలుగా హిందువులు, ముస్లింల మధ్య సమున్నత సాంస్కృతిక సమ్మేళనాన్ని సూచిస్తున్న మాటలు అవి. అంతేకాదు, ఒక స్పష్టమైన మనోవైఖరిని అవి వ్యక్తం చేస్తున్నాయి. 'గంగా–జముని' తెహ్‌జీబ్ (సంప్రదాయం)గా ఆ విశిష్ట మనోవైఖరి మన ప్రజల జీవన రీతుల్లో ప్రతిబింబిస్తోంది.

గంగా–జముని సంప్రదాయం ఒక సంయుక్త లేదా ఉమ్మడి సంస్కృతిని పరివేష్టించి ఉన్న సంప్రదాయమే 'గంగా–జముని'. మతసహిష్ణుత, ఒక సాంస్కృతిక వారసత్వ భాగస్వామ్యానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సంకీర్ణ సంస్కృతి అది. మన సంగీతం, లలితకళలు, వాస్తురీతులు, వంటకాలలో అది నిండుగా కనిపిస్తుంది. అయితే దేశ విభజన బీభత్సాలు, వాటి చేదు జ్ఞాపకాలు, ఇటీవలి కాలంలో సంకుచితమైపోయిన సామాజిక దృక్పథాల నేపథ్యంలో 'గంగా–జముని' సంప్రదాయం గత కాలం గురించి ఒక జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోతోంది! వివిధ చింతనా ధోరణుల సమన్వయాన్ని, మన సంప్రదాయ సహనం, సమైక్యతా స్ఫూర్తిని మనం ఉద్దేశపూర్వకంగానే తిరస్కరిస్తున్నామా? అదే నిజమైన పక్షంలో మన సామాజిక జీవన రీతులలో సువ్యక్తమవుతున్న సంక్లిష్ట మత, సాంస్కృతిక, భాషా పరమైన వైవిధ్యాలను ఎలా సమన్వయం చేసుకోగలుగుతాం?

క్రీ.శ. 712లో సింధ్ ప్రాంతంపై అరబ్‌ల దండయాత్రతో ఇస్లాం భారతావనిలోకి ప్రవేశించింది. మొగల్ చక్రవర్తుల కాలంలో ఆ కొత్త మతం మన దేశంలో విస్తృతంగా వ్యాపించింది. ఇస్లాంను స్వీకరించిన వారిలో అత్యధికులు కుల వ్యవస్థ అన్యాయాలు, దురాగతాలను తప్పించుకునేందుకై బలవంతంగానో లేదా స్వచ్ఛందంగానో ఆ మతంలో చేరినవారే. క్రైస్తవ భారతీయులు తమ చరిత్ర సెయింట్ థామస్ కేరళలో అడుగిడిన నాటి నుంచి ప్రారంభమవుతుందని విశ్వసిస్తారు క్రీ.శ 52లో సెయింట్ థామస్ మలబారు ప్రాంతంలోని యూదులను క్రైస్తవంలో చేరేలా ప్రేరేపించి మన దేశంలో క్రైస్తవం నెలకొనేందుకు, వర్ధిల్లేందుకు దోహదం చేశారని భావిస్తారు. చరిత్ర పరిణామ క్రమంలోని వేర్వేరు దశలలో యూదు, పార్సీ, బహాయీ మతస్థులు మన దేశానికి శరణార్థులుగా వచ్చి, ఆ తరువాత స్వేచ్ఛగా తమ మతాలను విస్తరింపజేసుకుని వర్ధిల్లుతున్నారు.

మన తీరాలకు క్రైస్తవం, ఇస్లాం వచ్చిన శతాబ్దాల తరువాత భారతదేశ జనాభా మతాల వారీగా ఇలా ఉంది: హిందువులు 79.8 శాతం; ముస్లింలు 14.2 శాతం,



'వసుధైవ కుటుంబకం' (ప్రపంచం ఒకే కుటుంబం) అన్న మన ప్రాచీన భావన హిందూ సంస్కృతిలో ప్రగాఢంగా వేళ్లూనుకుని ఉన్నది. ఈ సమున్నత దార్శనిక చింతనే భారత్ ఒక 'విశ్వగురు' అన్న మన వాదనకు విశ్వసనీయతను కల్పిస్తున్నది.. బహుళ మతాలు వర్ధిల్లుతున్న భారతీయ సమాజంలో, ఐశ్వర్యాభివృద్ధికి, జీవన భద్రతకు సామాజిక సమైక్యత ఒక ముఖ్యమైన ప్రాతిపదిక.

క్రైస్తవులు 2.3 శాతం. ఇప్పుడు అన్ని మతాల వారిలోను సంతానోత్పత్తి రేట్లు పడిపోతున్నాయి. వాస్తవ పరిస్థితి ఇదయితే కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించుతున్న కారణంగా హిందూ జనాభా తగ్గిపోతోందని, అదే సమయంలో ఆ పద్ధతులను పాటించని కొన్ని ఇతర మతాల వారి సంఖ్య గణనీయంగా ఎదుగుతుందని, ఇది ఇలాగే కొనసాగిన పక్షంలో హిందువులు తమ జన్మ భూమిలోనే మైనారిటీలు అయిపోతారనే వాదన ఒకటి గట్టిగా విన్పిస్తోంది. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించడమే. అంతేకాదు చాలా ప్రమాదకరమైన భయాందోళనలను రగుల్కొల్పే వాదన.


1996లో అమెరికా సామాజిక శాస్త్రవేత్త శామ్యూల్ హంటింగ్టన్ 'నాగరికతల సంఘర్షణ' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ప్రపంచం భవిష్యత్తులో నాగరికత ప్రాతిపదికన విభజితమైపోతుందని, భావజాలాల మధ్య కాకుండా, మౌలికంగా విభిన్నమైన మతాలు, సంస్కృతుల మధ్య సంఘర్షణలు ప్రజ్వరిల్లుతాయనేది ఆ సిద్ధాంత సారం మరి బహుళ సంస్కృతులు, మతాలు ఉన్న భారతదేశమే హంటింగ్టన్ ప్రమాదకర జోస్యం నిజమయ్యేందుకు అత్యధిక అవకాశమున్న నెలవుగా కనిపిస్తోంది.

వైవిధ్యాన్ని ఆదరిస్తూ సహన భావాన్ని పెంపొందించడంలోను, ఆర్థికంగా, సాంస్కృతికంగా పరస్పర సంబంధాలను ప్రోత్సహించడంలోనూ భారత ప్రజాస్వామ్యం ఇంత వరకూ సత్ఫలితాలను సాధించింది. సమస్త భారత పౌరులకూ సాపేక్షంగా శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు అవి విశేషంగా దోహదం చేశాయి. మరి హంటింగ్టన్ ప్రతిపాదన ప్రకారం అనివార్యమైన హిందూ, ఇస్లామిక్ నాగరికతల సంఘర్షణను భారత్ అధిగమించగలదా? కాలమే నిర్ణయిస్తుంది. అయితే కొన్ని వాస్తవాలను నిశితంగా పరిశీలిద్దాం.

గత ప్రభుత్వాలు స్వార్థ ప్రయోజనాల కోసం మైనారిటీ మతస్థులను బుజ్జగించాయి. తద్వారా ఎన్నికలలో ప్రయోజనం పొందాయి. అయితే ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. పూర్తిగా విరుద్ధమైన పరిస్థితులు ఉన్నాయి. బుజ్జగింపులు ఏ మాత్రం లేకపోగా మైనారిటీ మతాలవారు తీవ్ర వివక్షకు, బెదిరింపులకు గురవుతున్నారు. వారి ఆరాధనా మందిరాలపై దాడులు జరుగుతున్నాయి. నివాస గృహాలు కూల్చివేయబడుతున్నాయి. అంతే కాకుండా మైనారిటీ వర్గాలవారు ఆర్థికంగా, సామాజికంగా వెలివేతకు గురవుతున్నారు. హంతక మూకలు చెలరేగిపోతున్నాయి. ఇవి, మైనారిటీ మతస్థులు నేడు ఎదుర్కొంటున్న కష్టనష్టాల్లో కొన్ని మాత్రమే. కొంతమంది మతాచార్యులు, పాలక వర్గాల పెద్దలు ముస్లింలు, క్రైస్తవుల పట్ల విద్వేషాన్ని పనిగట్టుకుని రెచ్చగొడుతున్నారు. ప్రభుత్వాలు ఉపేక్ష వహిస్తున్నాయి, మీడియా మౌనం పాటిస్తోంది. ఇది చోటుచేసుకుంటున్న విపత్కర పరిణామాలకు మౌన అంగీకారమా?

కుల మతాల ప్రాతిపదికన ప్రజలను విభజించే కుటిల రాజకీయాలు పెచ్చరిల్లుతున్నాయని మన ఎన్నికల చరిత్ర స్పష్టం చేస్తోంది. మరి మతపరమైన విభజనలు మన జాతీయ భద్రతను పటిష్ఠం చేస్తాయా లేక బలహీనపరుస్తాయా? జాతీయ ప్రయోజనాల కంటే ఎన్నికలలో గెలుపే ప్రాధాన్యం పొందనున్నదా? రాజకీయ అధికారం కోసం ఆచరిస్తున్న ఈ నీతిబాహ్య రాజకీయాలు అంతిమంగా మన సామాజిక ఐక్యతను తీవ్రంగా దెబ్బతీసే వినాశనకరమైన ఉద్రిక్తత్తలు, హింసాకాండకు దారితీసే అవకాశం ఎంతైనా ఉన్నది. అటువంటి పరిస్థితి వాటిల్లితే అది జాతి భద్రతపై తప్పక ప్రతికూల ప్రభావం చూపగలదు. దేశ భద్రతకు 'రెండున్నర ఫ్రంట్‌ల్లో యుద్ధం చేయవలసివచ్చే అగత్యమేర్పడనున్నదని మన సైనికాధికారులు సూచించడం గమనార్హం. 'రెండు ఫ్రంట్‌లు మన ఇరుగుపొరుగున ఉన్న శత్రువుల నుంచి యుద్ధ ముప్పు నెదుర్కోవడానికి సంబంధించినవన్నది స్పష్టం. నిర్దిష్టంగా తెలియని 'సగం ఫ్రంట్ సామాజిక సమైక్యత విచ్ఛిన్నమవడం వల్ల వాటిల్లే ముప్పు. ఇది కూడా సరిహద్దుల్లో యుద్ధం వలే ప్రమాదకరమైనది. మత దురభిమానాల కారణంగా తలెత్తే జగడాలు ఇప్పటికే తీవ్రంగా ఉన్న నక్సల్స్ తిరుగుబాటు, కశ్మీర్‌లో ఉగ్రవాదం, మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండకు తోడైతే జనితమయ్యే మొత్తం ముప్పుతో మన జాతీయ భద్రతకు మున్నెన్నడూ లేని సవాళ్లు ఎదురవుతాయి. చారిత్రకంగా మన దేశం తరచు విదేశీ దురాక్రమణలకు గురికావడానికి ప్రధాన కారణం మన సమాజంలో అంతర్గత ఐక్యత లోపించడమే కాదూ? దీనికి తోడు మన పాలకులు సంకుచిత ప్రయోజనాలను విడనాడి సమైక్యంగా ఆక్రమణకు వచ్చిన పరాయి సైన్యాలను ఎదుర్కోవడంలో విఫలమయ్యారు ప్రపంచంలోని ఇతర దేశాలలో గారిబాల్డి, బిస్మార్క్‌ల నుంచి టిటో, మండేలా దాకా జాతి నిర్మాతలుగా గౌరవాదరాలు పొందుతున్నారు. భిన్న తెగలు, మతాలకు చెందిన ప్రజలను సమైక్యపరిచి వారిని ఒక జాతిగా రూపొందించినందునే ఆ మహానాయకులు ఆ సమున్నత గుర్తింపునకు అర్హులయ్యారు. మన వర్తమాన రాజకీయ నాయకులకు విశేష ప్రజాదరణ ఉన్నది. ఎన్నికలలో తమకు అను కూలంగా తిరుగులేని ప్రజా తీర్పులు పొందుతున్నారు. 'చారిత్రక దురాగతాల'పై ప్రతీకారం తీర్చుకోవాలన్న అహేతుక వాదనలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని మలిచే శక్తి సామర్థ్యాలు నేటి రాజకీయ నాయకులకు ఉన్నాయి.

'వసుధైవ కుటుంబకం' (ప్రపంచం ఒకే కుటుంబం) అన్న మన ప్రాచీన భావన హిందూ సంస్కృతిలో ప్రగాఢంగా వేళ్లూనుకుని ఉన్నది. ఈ సమున్నత దార్శనిక చింతనే భారత్ ఒక 'విశ్వగురు' అన్న మన వాదనకు విశ్వసనీయతను కల్పిస్తున్నది. బహుళ మతాలు వర్ధిల్లుతున్న భారతీయ సమాజంలో, ఐశ్వర్యాభివృద్ధికి, జీవన భద్రతకు సామాజిక సమైక్యత అత్యంత ముఖ్యమైన ప్రాతిపదిక. జూన్ 2022లో నాగపూర్‌లో ఒక సమావేశంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ మాట్లాడుతూ ఒక ఉపయుక్త ప్రశ్న వేశారు: 'ప్రతి మసీదులోను ఒక శివలింగం కోసం ఎందుకు అన్వేషిస్తున్నారు?' ఈ ప్రశ్నకు ఆయనే ఇలా సమాధానమిచ్చారు: 'మనకు ప్రతి ఒక్కరి పట్ల గౌరవం ఉన్నది. అన్ని విశ్వాసాలను మనం ఆదరిస్తాం'. డిసెంబర్ 19, 2024న ఆయన ఇలా అన్నారు: 'మనం సుదీర్ఘకాలంగా శాంతి సామరస్యాలతో సహ జీవనం చేస్తున్నాం. ఈ సయోధ్యను ప్రపంచ మంతటికీ సమకూర్చాలంటే, ఆ ఐక్యతకు ఒక ఆదర్శాన్ని సృష్టించాల్సిన అవసరమున్నది'. ఈ విజ్ఞుని మాటలను మనం అవశ్యంగా లక్ష్య పెట్టాలి.



◆ అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్
భారత నావికాదళం మాజీ ప్రధానాధికారి
(ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యం)

వీధి నాటకానికి మూలస్తంభం

ఆ రోజు 1989 జనవరి 1. ప్రజలు నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నారు. ఢిల్లీ సమీపంలోని, జండాపూర్, షాహిబాబాద్ ప్రాంతంలో నాలుగురోడ్ల కూడలిలో ఒక కళాకారుడు తన కళాకారుల బృందంతో ఒక నాటకాన్ని వేయిస్తూ పర్యవేక్షిస్తున్నాడు. ఆయనే ఆ నాటక రచయిత, దర్శకుడు. అంతలోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక నాయకుడు కొంతమంది అనుచరులతో వచ్చి ప్రదర్శనకారులను చుట్టుముట్టి వారిపై దాడికి పూనుకున్నాడు. ఆ కళాకారుడు తన బృందాన్ని వెళ్లిపొమ్మని తాను మాత్రం అక్కడే ఉండి గూండాలను ఎదిరించాడు. గూండాలు ఆయన్ని తీవ్రంగా గాయపరిచి పారిపోయారు. ఆ కళాకారుడు ఢిల్లీలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండవ రోజు మరణించాడు.

ఆ కళాకారుడే సఫ్దర్ హష్మి. ఆయన బృందం ప్రదర్శించిన నాటకం 'హల్లాబోల్' ("నినదించు"). అప్పటికి కొద్ది రోజులుగా జరుగుతున్న కార్మికుల సమ్మెకు మద్దతుగా, వారిని ప్రోత్సాహపరుస్తూ జరిగిన ప్రదర్శన అది. ఆ ప్రాంతంలోని కార్మికులు, ఇతరులు చుట్టూ గుమిగూడి నాటకాన్ని చూస్తున్నారు. ఇంతలోనే పై సంఘటన జరిగింది. అప్పటికి కొద్దిరోజుల క్రితమే ఆ బృందం చేతనే 'చక్కా జాం' నాటకం ప్రదర్శితమైంది. 'చక్కా జాం' అంటే "ఆగిన చక్రాలు". దానికి కొనసాగింపే ఈ 'హల్లా బోల్'. సఫ్దర్ హష్మీ తన జీవితాన్ని వీధి నాటక ప్రక్రియకి అంకితం చేసిన కళాకారుడు. దోపిడీ రాజకీయ వికృత రూపాన్ని, జన జీవన స్థితిగతులను ప్రతిబింబించే నాటకాల ద్వారా ప్రజలను జాగరూకులను చేస్తున్న అయనను స్వార్థ రాజకీయ శక్తులు కత్తిగట్టి తుదముట్టించాయి.



సఫ్దర్ హష్మీ తన జీవితాన్ని వీధి నాటక ప్రక్రియకి అంకితం చేసిన కళాకారుడు. దోపిడీ రాజకీయ వికృత రూపాన్ని, జన జీవన స్థితిగతులను ప్రతిబింబించే నాటకాల ద్వారా ప్రజలను జాగరూకులను చేస్తున్న అయనను స్వార్థ రాజకీయ శక్తులు కత్తిగట్టి తుదముట్టించాయి.

12 ఏప్రిల్ 1954లో జన్మించిన ఆయన విద్యాభ్యాసం ఢిల్లీలో సాగింది. తరువాత ఆయన స్టీఫెన్స్ కాలేజీ నుండి ఇంగ్లీష్ లిటరేచర్‌లో బీఏ, ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి ఎమ్ఏ ఇంగ్లీష్ చేసాడు. ఈ కాలంలోనే ఎస్ఎఫ్ఐ, సాంస్కృతిక శాఖతో సంబంధాలు ఏర్పడ్డాయి. అప్పుడే అతనికి 'ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్' (ఇప్టా)తో కూడా సంబంధాలు ఏర్పడి అందులో క్రియాశీలక పాత్ర పోషించాడు. ఇప్టా కోసం కొన్ని నాటకాలు కూడా రాసాడు.

ఎమర్జెన్సీ కాలంలో హష్మీ ఢిల్లీ, కశ్మీర్ విశ్వవిద్యాలయాలలో ఇంగ్లీష్ లెక్చరరుగా ఉద్యోగం చేసాడు. కొంతకాలం ప్రెస్ ట్రస్ట్ అఫ్ ఇండియాకి, ది ఎకనామిక్ టైమ్స్‌కి జర్నలిస్టుగానూ పని చేసాడు. కొంతకాలం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి ఢిల్లీలో, ప్రెస్ ఇన్ఫర్మేషన్ అధికారిగా కూడా పనిచేసాడు. నాటక రచనలతో పాటు పిల్లల కోసం పాటలు, కథలు రాసాడు. దూరదర్శన్ కోసం కొన్ని డాక్యుమెంటరీలు నిర్మించాడు. 1979లో ఆయన మలయశ్రీని వివాహమాడాడు. భార్యతో కలిసి చాలా ప్రదర్శనలు ఇచ్చారు.

1973లో ఆయన 'జన నాట్య మంచ్' (జనమ్) అనే నాటక సంస్థను ఏర్పాటు చేశాడు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎన్నికలను రిగ్గింగ్ చేయిస్తే అయన 'కుర్సీ, కుర్సీ, కుర్సీ' అనే వ్యంగ్య నాటకాన్ని రాసి ప్రదర్శింపచేసాడు. 1975లో ప్రతిపక్షాలపై నిర్బంధం ఉన్న ఎమర్జెన్సీ సమయంలో ఆయన జనమ్ సంస్థ ద్వారా వీధుల్లోను, మురికి, కార్మిక వాడల్లోను నాలుగువేల పైచిలుకు వీధి నాటక ప్రదర్శనలు ఇచ్చాడు. హంగూ ఆర్భాటం లేకుండా ఉన్నది ఉన్నట్లు ప్రజల్లోకి వెళ్ళడానికి ఏకైక సాధనం వీధి నాటిక అని ఆయన నమ్మకం.

నిజానికి హష్మి మరణంతోనే అయన సృష్టించిన వీధి నాటకం అంతమైపోతుందని అనుకున్నారు. కానీ అందుకు భిన్నంగా జరిగింది. జనమ్, ప్రజానాట్యమండలి లాంటి సంస్థల కార్యకర్తలు వీధి నాటక ప్రక్రియను మరింత సుసంపన్నం, బలోపేతం చేసాయి. హష్మీ హత్య గావింపబడ్డ రెండవ రోజే అయన భార్య మలయశ్రీతో సహా జనమ్ కళాకారులు అదే చోట అదే నాటకాన్ని తిరిగి ప్రదర్శించారు. ఆనాటి ఆ ప్రదర్శనని సుమారు 500 మంది కవులు, కళాకారులూ, రచయితలు, మేధావులు తిలకించారనీ, విధ్వంసం జరిగిన వీధుల్లో మౌన ప్రదర్శన జరిపారని ఆనాటి పత్రికలు రాశాయి. నేడు హష్మీ లేడు, కానీ ఆయన స్థాపించిన 'జనమ్' ఉంది. 2023లో 'జనమ్' అర్ధ శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంది. వీధి నాటకాన్ని ప్రజల చెంతకు తీసుకువెళ్లాలనే ఆశయంతో 'జనమ్' సంచార నాటకశాలను సమకూర్చుకుని, కొన్ని వేల ప్రదర్శనలు ఇచ్చింది. 'జనమ్' 2007లో అమెరికాలోనూ, 2013లో యూకేలోనూ తన ప్రదర్శనలు ఇచ్చింది. నేడు సఫ్దర్ పేరు వీధి నాటకానికి, అభ్యుదయ కళలకి మారు పేరైంది.

ఆయన మరణం తరువాత సఫ్దర్ హష్మీ మెమోరియల్ ట్రస్ట్ (సహ్మత్) ఏర్పడి వివిధ కల్చరల్ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఆయన హత్యకు గురైన చౌరస్తాలో ప్రతి ఏటా ఆయన వర్ధంతిని జనమ్, వామపక్ష సంస్థలు కలిసి నిర్వహిస్తాయి. ఈనాడు ఆ ప్రజా కళాకారుడు భౌతికంగా కనుమరుగైనా అయన సృష్టించిన వీధి నాటకం సజీవంగా మన మధ్యనే ఉంది.

• పి. అరవింద కుమారి
(నేడు హష్మీ 35వ వర్ధంతి)

ఇది బీసీ నామ సంవత్సరం!

రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా విజయానంద్‌ను ప్రభుత్వం నియమించడం హర్షణీయం. రాష్ట్ర పాలనా యంత్రాంగంలో అత్యంత కీలక స్థానంలో బీసీ వ్యక్తిని నియమించి బీసీల పట్ల నిబద్ధతను చాటుకున్నారు ముఖ్యమంత్రి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ, నవ్యాంధ్రలో గానీ ఇప్పటి వరకు బీసీలకు సీఎస్ పోస్టు దక్కలేదు. చంద్రబాబు తొలిసారి బీసీ అధికారికి ఈ అగ్ర పదవిని కల్పించి చరిత్ర సృష్టించారు. ఎంతో కీలకమైన టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన పల్లా శ్రీనివాసరావు యాదవ్‌కు అప్పగించారు. బీసీ నేతగా టీడీపీ సీనియర్ నాయకుడిగా పార్టీకి, ప్రజలకు ఎంతో సేవ చేసిన చింతకాయల అయ్యన్న పాత్రుడికి శాసనసభ స్పీకర్ పదవి ఇచ్చి గౌరవించారు. బీసీలకు పదవులు ఇవ్వాలన్నా, బీసీలకు పెద్దపీట వేసి వెన్నుదన్నుగా నిలవాలన్నా అది టీడీపీతోనే సాధ్యమని దీనితో తేటతెల్లమైంది. కూటమి ప్రభుత్వం బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యతను బట్టి 2025ను బీసీ నామ సంవత్సరంగా పిలుచుకోవచ్చునేమో!



జగన్‌రెడ్డి ఏనాడు బీసీలను గౌరవించిన దాఖలాలు లేవు. బీసీ నేతలను తన ముందు చేతులు కట్టుకుని నిలబెట్టిన చరిత్ర జగన్ రెడ్డిదని ఆ పార్టీలో ఉన్న బీసీ నేతలే అంటున్నారు. గత పాలనలో బీసీలు, పేదలపై జరిగిన అరాచకాలు, అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు. ప్రతి పదవిలో తన సామాజిక వర్గానికి చెందిన అధికారులను నియమించుకొని ఆడిందే ఆట పాడిందే పాటగా జగన్ పరిపాలించాడు. రాష్ట్రంలో రాక్షస మూక పేదలు, బీసీల రక్తాన్ని తాగుతున్నా ఉన్నత పదవిలో ఉన్న పోలీసు అధికారులు కిక్కుమన లేదు. ఆ పాపపు ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించిన పేదలు, బీసీలకు న్యాయం చేయడానికి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికి చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీసీలు, అణగారిన వర్గాలపై దాడులను అరికట్టడానికి కీలకమైన డీజీపీ పదవిని బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ద్వారకా తిరుమల రావుకు అప్పగించారు.

టీడీపీ పార్టీ బీసీల పార్టీ. బీసీలకు ఉన్న అపారమైన ప్రేమకు నిదర్శనంగా వారికి నామినేటెడ్ పదవుల్లో అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చి గౌరవించారు చంద్రబాబు. సామాజిక న్యాయం అంటే ఏంటో పదవులు ఇచ్చి చూపించారు. కూటమి ప్రభుత్వం రాగానే బీసీ రక్షణ చట్టానికి రూపకల్పన చేసి, బీసీ సంక్షేమానికి రూ.39,007 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. 26 జిల్లాల్లో బీసీ భవనాలు, 68 కాపు భవనాల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. తొలి నామినేటెడ్ పదవి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ బీసీ ఉన్నతాధికారి పి. కృష్ణయ్యకు ఇచ్చారు.

గత ప్రభుత్వంలో అన్ని కీలక నామినేటెడ్ పదవుల్లో తన సామాజిక వర్గానికి జగన్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చి బీసీ, పేద వర్గాలను వంచించారు. ఆ వర్గాల ఉన్నతిని ఉక్కు పాదంతో తొక్కిపెట్టారు. పదవులు ఇవ్వకుండా, ప్రభుత్వం నుండి ఫలాలు అందకుండా చేసి వారి సంక్షేమాన్ని సర్వనాశనం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు దశాబ్దాలుగా అనుభవిస్తున్న 34 శాతం రిజర్వేషన్లలో కోత కోసి 16,800 మందికి రాజ్యాంగబద్ధ పదవులను దూరం చేశారు. బీసీల అభ్యున్నతి కోసం ఖర్చు చేయాల్సిన రూ.75,760 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారు. ఎనిమిది వేల ఎకరాల బీసీ అసైన్డ్ భూముల్ని బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. ఆదరణ పథకాన్ని రద్దు చేసి వృత్తి పనులు చేసుకునేవారి పొట్టకొట్టారు. బీసీ భవనాలను రద్దు చేశారు. విదేశీ విద్య, స్కిల్ డెవలప్మెంట్, స్టడీ సర్కిల్స్ వంటి విద్యా పథకాలు దూరం చేశారు. పారిశ్రామిక రాయితీలను కుదించి ఉపాధి అవకాశాలు దూరం చేశారు. కార్పొరేషన్లను ఉత్సవ విగ్రహాలుగా మార్చి స్వయం ఉపాధిని ప్రశ్నార్థకం చేశారు. 26 మంది బీసీ నేతల్ని అత్యంత కిరాతకంగా హత్య చేశారు. 2540 మందిపై దాడులకు పాల్పడ్డారు. 650 మంది బీసీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి వేధించారు. బీసీ సామాజిక వర్గాన్నంతా అణచివేసి, నలుగురికి పదవులిచ్చి బీసీలందరినీ ఉద్ధరించామని గొప్పలు చెప్పుకున్నారు. అప్పటి బీసీ మంత్రి వేణుగోపాలకృష్ణ నేలపై మోకాళ్లపై కూర్చుని కుర్చీలో కూర్చున్న వైవీ. సుబ్బారెడ్డికి దండం పెట్టే పరిస్థితి కల్పించారు. బీసీ మంత్రి జోగి రమేష్ నా జేబులో ఉన్నారని కొడాలి నాని ప్రకటించారు. ఇదీ నాటి వైసీపీలోని బీసీ మంత్రుల దీనస్థితి. కొద్ది మందికి పదవులు, రాజ్యసభ సీట్లు ఇచ్చి వారి నోరు మూయించి వారి సామాజికవర్గం మొత్తాన్ని జగన్‌రెడ్డి ముఠా నిలువు దోపిడీ చేసింది. జగన్ రెడ్డి చేసిన నిర్వాకాలు ఒక్కొక్కటి బయటకు వస్తుంటే జనం తమకు జరిగిన అన్యాయంపై అవాక్కవుతున్నారు. మరోసారి ఇలాంటి నేతలు అధికారం అంటూ వస్తే ఎలా బుద్ధి చెప్పాలో అలా చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.



■ అనగాని సత్యప్రసాద్
రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మంత్రి

'గాంధీ' పేరులేని ఏ నేతను మీరు గౌరవించారు?

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంతిమయాత్రను మీడియా, సోషల్ మీడియాల్లో చూసిన వారు కాంగ్రెస్ నకిలీ గాంధీలను మాత్రమే గౌరవిస్తుందని, దిగ్గజాలను సైతం అవమానిస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు. మన్మోహన్ సింగ్ ప్రజా నాయకుడేమీ కాదని, గాంధీల కంటే గొప్పవాడు కాదని సంకేతం ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎవరినీ అంతిమ యాత్ర వాహనం దరిదాపుల్లోకి రానివ్వలేదు. ఒంటరిగా, భారంగా మన్మోహన్ సింగ్ అంతిమయాత్ర సాగింది. రాహుల్‌గాంధీ తాను యువరాజునన్నట్లుగా అంతిమ యాత్ర వాహనం మీద కూర్చున్నారు. అంతేతప్ప గౌరవ సూచకంగా నడుద్దామని కూడా ఆలోచించలేదు. 74 సంవత్సరాల వయస్సులో ప్రధాని హోదాలో నరేంద్ర మోదీ వాజపేయి అంతిమ యాత్ర ముందు నాలుగు కిలోమీటర్లు నడిచారు. వాజపేయి అంతిమ యాత్ర కొన్ని వేలమంది మధ్య సాగింది. ప్రధాని మోదీతో పాటు బీజేపీ ముఖ్యనేతలంతా అంతిమయాత్రలో నడుస్తూనే పాల్గొన్నారు. బీజేపీ ప్రధాన కార్యాలయం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని రాష్ట్రీ స్మృతి స్థలం వరకూ నడుచుకూంటూనే వెళ్లారు. అది తమ పార్టీకి, దేశానికి నిస్వార్థంగా సేవ చేసిన నాయకుడికి బీజేపీ ఇచ్చిన గౌరవం.

వాజపేయి అంతిమ యాత్ర ముందు ప్రధాని హోదాలో నరేంద్ర మోదీ నాలుగు కిలోమీటర్లు నడిచారు. అది తమ పార్టీకి, దేశానికి నిస్వార్థంగా సేవ చేసిన నాయకుడికి బీజేపీ ఇచ్చిన గౌరవం. కేంద్ర ప్రభుత్వం మన్మోహన్ సింగ్‌ను అవమానించిందని ఏకపక్షంగా ఆరోపించిన రాహుల్‌గాంధీ ఈ సంతాపదినాల్లోనూ నూతన సంవత్సర వేడుకలకు వియత్నాం వెళ్లిపోయారు. ఇదా మన్మోహన్‌కు ఇచ్చే గౌరవం?




మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం అత్యున్నత గౌరవంతో కూడిన వీడ్కోలును ఇచ్చింది. నిగమ్ బోధ్‌లో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేసింది. మన్మోహన్ స్మారకం నిర్మించేందుకు స్థలాన్ని కేంద్రం కేటాయించిందన్న విషయాన్ని దాచిపెట్టి తప్పుడు ప్రకటనలు చేసింది. అంతేనా! అంత్యక్రియలు చేసినప్పుడు వీడియోల్లో కాంగ్రెస్ నేతలు కనపడలేదని కూడా పవన్ ఖేరా వంటి వారు ఆరోపించడాన్ని బట్టి మన్మోహన్ మరణాన్ని రాజకీయ లబ్ధికి ఎలా వాడుకోవాలో వారు ముందే మేథోమథనం చేసినట్లుగా అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం మన్మోహన్ సింగ్‌ను అవమానించిందని ఏకపక్షంగా ఆరోపించిన రాహుల్‌గాంధీ సంతాప దినాల్లోనూ నూతన సంవత్సర వేడుకలకు వియత్నాం వెళ్లిపోయారు. ఇదా కాంగ్రెస్ పార్టీకి గొప్ప సేవలు చేసిన మన్మోహన్‌కు ఇచ్చే గౌరవం?

మన్మోహన్‌కు గౌరవంపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ దిగ్గజాల్లో ఒకరు అయిన ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ వ్యక్తం చేసిన అభిప్రాయాలు నకిలీ గాంధీల అసలైన ముఖాలను బయటపెట్టేలా ఉన్నాయి. ప్రణబ్ ముఖర్జీ కోసం ఘాట్ నిర్మాణం చేయాలని అడగలేదేమని ఆమె అడిగిన ప్రశ్నకు సమాధానం లేదు. అలాగే తెలుగు దిగ్గజమైన పీవీ నరసింహారావుకు కాంగ్రెస్ చేసిన అవమానాన్ని అందరూ గుర్తుచేసుకుంటున్నారు. పీవీ నరసింహారావుకు రెండు గజాల స్థలం కేటాయించలేదనీ, గాంధీ కుటుంబానికి కాకుండా కాంగ్రెస్ ఎవరికైనా భారతరత్న ఇచ్చిందా అనీ పీవీ నరసింహారావు సోదరుడు మనోహర్‌రావు సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ నిర్వాకం కారణంగానే దేశ రాజధానిలో ఘాట్ లేని ఏకైక ప్రధానిగా పీవీ నరసింహారావు మిగిలిపోయారు. ఇంతటి అవమానం చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా? దేశాన్ని ఆర్థికంగా గట్టెక్కించిన పీవీ నరసింహారావుకు భారతరత్న ఇచ్చి గౌరవించింది బీజేపీ. దేశానికి సేవ చేసినవారు ఎవరైనా సరే బీజేపీకి ముఖ్యమేననీ, ఇందులో పార్టీ తేడాలు ఏమీ ఉండవనీ ఎన్నోసార్లు నిరూపించింది. దేశాన్ని ఆర్థికంగా గట్టెక్కించిన నేతగా పీవీ నరసింహారావును అందరూ గౌరవిస్తారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఆయన పార్థివ దేహాన్ని ఏఐసీసీ ఆఫీసులోకి కూడా రానివ్వలేదు. అసలు ఢిల్లీలోనే అంత్యక్రియలు జరపకుండా హైదరాబాద్‌కు పంపించివేశారు. పోనీ హైదరాబాద్‌లో అయినా గౌరవంగా చేశారా అంటే అదీ లేదు. భారతరత్న అటల్ బిహారీ వాజపేయి పరమపదించినప్పుడు బీజేపీ ముఖ్యనేత అమిత్ షా స్వయంగా ఆయన అస్థికల్ని పవిత్ర నదుల్లో కలిపారు. నాయకుడు అంటే ఈ రకమైన అభిమానం రాజకీయ పార్టీకి ఉండాలి.

ఉక్కుమనిషిగా దేశాన్ని బలోపేతం చేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను కాంగ్రెస్ ఎప్పుడైనా గుర్తించిందా? ఆయనను స్మరించుకోవడానికి ఏదైనా ఒక స్మారక కట్టడాన్ని కాంగ్రెస్ పార్టీ కట్టించిందా? ప్రధాని అవ్వాల్సిన ఆయనను ఉప ప్రధానిగా ఉంచింది. చనిపోయిన తర్వాత పూర్తిగా ఆయన పేరు ప్రఖ్యాతులను గాంధీ కుటుంబం కోసం మరుగునపడేలా చేసింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే పటేల్‌కు గుర్తింపు లభించింది. స్టాట్యూ ఆఫ్ యూనిటీని నిర్మించి ఆయన ఉన్నతిని ఆకాశమంత స్థాయిలో నిలబెట్టింది. గాంధీ కుటుంబం నుంచి కాకుండా కాంగ్రెస్ నుంచి ప్రధాని అయిన మరో దిగ్గజ నేత లాల్ బహదూర్ శాస్త్రిని కూడా కాంగ్రెస్ గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేయదు. ఆయన మరణంపై ఉన్న అనుమానాలపై చర్చ జరగకుండా అడ్డుకుంది. రెండుసార్లు పదమూడు రోజులు ప్రధానిగా పని చేసిన గుల్జారీలాల్ నందాను, ఉపప్రధానిగా చేసిన మొరార్జీ దేశాయ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ తమ పార్టీ నేతలుగా గుర్తించినట్లుగా కనిపించలేదు. ఇంత ఘోరమైన గత చరిత్రను పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ ఎవరిపై నిందలు వేయాలని అనుకుంటోంది? కాంగ్రెస్ ఇప్పటికీ పాత చింతకాయ పచ్చడి రాజకీయాలు చేస్తూ ఏదో బావుకుందామని అనుకుంటోంది. కానీ ప్రజలు ఆ నీచ రాజకీయాలను అసహ్యించుకుంటున్నారు.

○ ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి
బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు





దుర్గమ్మ సన్నిధిలో సీఎం

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు బుధవారం దర్శించుకున్నారు. ఆయనతో కరచాలనం చేసేం దుకు క్యూలైన్లలోని భక్తులు పోటీ పడ్డారు. ఆయన్ను తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీస్తూ, అభివాదం చేస్తూ ఆనందభరితులయ్యారు. సీఎం చంద్రబాబు కూడా అందరికీ నమస్కారం చేస్తూ ముందుకు సాగారు.



సీఎం చంద్రబాబుకు అభివాదం చేస్తున్న భక్తులు

రూ.11.60 కోట్లు తాగేశారు

ఏడాది ముగింపు వేళ మద్యం ప్రియులు ఫుల్ కిక్కు మీద ఉన్నారు. డిసెంబరు 30,31 తేదీల్లో రూ.11.60 కోట్ల మద్యం తాగేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 13,171 ఐఎంఎల్ కేస్‌లు, 4,402 బీరు కేస్‌లు ఖాళీ చేయడం ద్వారా ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురిపించారు. న్యూ ఇయర్ వేడుకలను మద్యం మత్తులో హుషారుగా జరుపుకున్నారు.



2024 డిసెంబరు 30, 31వ తేదీల్లో ఫుల్ కిక్కు..!

న్యూ ఇయర్ వేళ భారీగా పెరిగిన మద్యం అమ్మకాలు

- 13,171 ఐఎంఎల్ కేస్‌లు, 4,402 బీరు కేస్‌లు ఖాళీ
- ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగా అమ్మకాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో మంగళవారం ఒక్కరోజే రూ.11.60 కోట్ల అమ్మకాలు సాగాయి. డిపోల నుంచి 13,171 ఐఎంఎల్ కేసులు, 4,396 బీరు కేస్‌లను మద్యం దుకాణాలు కొనుగోలు చేశాయి. 30వ తేదీన 26,304 ఐఎంఎల్ కేస్‌లు, 5,596 బీరు కేస్‌లను వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ కొనుగోళ్లు, అమ్మకాల్లో ఎన్టీఆర్ జిల్లా టాప్‌లో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లాలో మద్యం దుకాణాలు మంగళవారం డిపోల నుంచి 8,294 ఐఎంఎల్ కేస్‌లు, 2,936 బీరు కేస్‌లు కొనుగోలు చేశాయి. వాటి ద్వారా మొత్తం రూ.7.7 కోట్ల ఆదాయం ఎక్సైజ్ శాఖకు వచ్చింది. దీనికి ముందు 30వ తేదీన 15,247 ఐఎంఎల్ కేస్‌లు, 2,880 బీరు కేస్‌లను మద్యం వ్యాపారులు డిపోల నుంచి కొనుగోలు చేశారు. వాటి ద్వారా రూ.13.03 కోట్ల ఆదాయం వచ్చింది. కృష్ణాజిల్లాలో 31వ తేదీన 4,877 ఐఎంఎల్ కేస్‌లు, 1,466 బీరు కేస్‌లను కొనుగోలు చేశారు. వాటి ద్వారా రూ.3.9 కోట్ల ఆదాయం వచ్చింది. 30వ తేదీన 11,057 ఐఎంఎల్ కేస్‌లు, 2,716 బీరు కేస్‌లను డిపోల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు. వారి ద్వారా రూ.8.50 లక్షల ఆదాయం ఎక్సైజ్ శాఖకు చేకూరింది. సంవత్సరం ముగింపు రెండు రోజుల్లో జిల్లాలోని మద్యం ప్రియులు ఈ కేస్‌లను ఖాళీ చేశారు. ఏడాది ముగింపు రోజున జిల్లాలో విస్తృతంగా విందులు చేసుకున్నారు. అటు బార్లు, ఇటు మద్యం దుకాణాలు కిటకిటలాడాయి. కొన్నిచోట్ల గ్రూపులుగా పార్టీలు చేసుకున్నారు. ఈ లిక్కర్ కిక్ నూతన సంవత్సరం తొలి రోజున సాగింది.

ఐఎంఎల్‌కు అధిక ప్రాధాన్యం

సాధారణంగా మద్యం అమ్మకాల్లో బీరుల వాటా అధికంగా ఉంటుంది. వేసవిలో చల్లదనం కోసం బీరులను విపరీతంగా తీసుకుంటారు. అయితే ప్రస్తుతం వాతావరణం చల్లగా ఉండడంతో మద్యం ప్రియులు బీరుల మోతాదును తగ్గించుకున్నారు. లిక్కర్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. చల్లని రోజుల్లో వెచ్చదనం కోసం లిక్కర్‌ను ఎంచుకున్నారు. రెండు రోజులపాటు డిపోల నుంచి కొనుగోలు చేసిన కేసులో ఐఎంఎల్ కేస్‌లే ఎక్కువ ఉన్నాయి. రెండు రోజుల్లో డిపోల నుంచి మద్యం వ్యాపారులు 39,475 ఐఎంఎల్ కేస్‌లు కొనుగోలు చేయడం గమనార్హం.

వైసీపీ శ్రేణుల హడావిడి



బందరు తాలూకా పోలీస్‌స్టేషన్ వద్ద వైసీపీ కార్యకర్తలు

మేయర్ కారులో విచారణకు హాజరైన పేర్ని జయసుధ


రెండున్నర గంటలపాటు సాగిన విచారణ ● అంతా మేనేజర్‌కే తెలుసు... నాకేమీ తెలియదని వెల్లడి

ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం : పీడీఎస్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి పేర్ని జయసుధ పోలీసుల విచారణకు హాజరైన సమయంలో వైసీపీ కార్యకర్తలు హడావిడి చేశారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్‌కు ప్రభుత్వం కేటాయించిన కారులో పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఏ1గా ఉన్న పేర్ని జయసుధ పోలీస్ స్టేషన్‌కు రావడం వివాదాస్పదమైంది. ప్రభుత్వ కారులో ఏ1ను ఎలా తీసుకువస్తారనే విషయమై విమర్శలు వి నిపించాయి. విచారణ వచ్చిన పేర్ని జయసుధతోపాటు మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ మాడపాటి వి జయలక్ష్మి తదితరులు ఆమెతోపాటు స్టేషన్‌లోనే ఉన్నారు. పేర్ని జయసుధ విచారణ నిమిత్తం తాలూకా పోలీస్‌స్టేషన్‌కు రావడంతో వైసీపీ శ్రేణులు పోలీస్‌స్టేషన్ వద్దకు తరలివచ్చారు. రెండున్నర గంటలపాటు వి చారణ కొనసాగడంతో అనారోగ్యంతో ఉన్న మహిళను ఎంతసేపు విచారణ చేస్తారంటూ వైసీపీ నాయకులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. విచారణ జరిగే సమయంలో ఆమె ఏమైనా ఇబ్బందులు పడుతున్నారనే అంశంపై వైసీపీ నాయకులు పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు తలుపులు తెరచి పేర్ని జయసుధతో తానేమీ ఇబ్బంది పడటంలేదని చెప్పించాల్సి వచ్చింది. ఎస్సై సత్యనారాయణ ఆమె బాగానే ఉన్నారని, ఎవరూ కంగారుపడవద్దని చెప్పారు. అయినా వారు సమాధానపడకుండా 'మీకేమీ కంగారు ఉండదని, మా క్లయింట్ విషయంలో మాకు కంగారు ఉంటుందని' లాయర్ అంకబాబు వ్యాఖ్యానించారు.పెద్దఎత్తున వైసీపీ నాయకులు పోలీస్‌స్టేషన్ వద్దకురావడంతో వారందరిని దూరంగా పంపే ప్రయత్నం పోలీసులు చేశారు. పేర్ని జయసుధ విచారణ సుమారు రెండున్నర గంటలపాటు సాగింది. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆమె పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. సాయంత్రం 4.30 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉన్నారు. రాబర్ట్‌సన్‌పేట పోలీస్‌స్టేషన్ సీఐ ఏసుబాబు, మచిలీపట్నం తాలూకా స్టేషన్ ఎస్సై సత్యనారాయణ ఆమెను విచారించారు. ఈ సమయంలో పేర్ని జయసుధ తరఫు న్యాయవాదులు వరదరాజులు, అంకబాబు అక్కడే ఉన్నారు. గోడౌన్ వివరాలు, ఎవరి పేరున ఉంది, నగదు లావాదేవీలు ఎవరు చూసేవారు, తదితర అంశాలపై పోలీస్ అధికారులు వివరాలు రాబట్టారు. గోడౌన్ వ్యవహారాలు తాను చూడలేదని, కేవలం గోడౌన్ యజమానిగా మాత్రమే తాను ఉన్నానని, గోడౌన్ మేనేజర్ మానస్ తేజ మొత్తం వ్యవహారాలు చూసేవారని, తనకేమీ తెలియదని పేర్ని జయసుధ పోలీస్ అధికారులకు చెప్పినట్టు సమచారం. ఈ కేసు విచారణ నిమిత్తం అవసరమైతే మళ్లీ పోలీస్ స్టేషన్‌కు రావాల్సి ఉంటుందని పోలీస్ అధికారులు పేర్ని జయసుధకు తెలిపారు.

11 రోజులు.. 294 స్టాళ్లు

నేడు విజయవాడ పుస్తక మహోత్సవం ప్రారంభం

- ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా ఏర్పాటు
- ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్



పుస్తక మహోత్సవ బుక్ స్టాల్‌లో పుస్తకాలను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 35వ వి జయవాడ పుస్తక మహోత్సవం గురువారం నుంచి ప్రారంభం కానుంది. 12వ తేదీ వరకు పుస్తకాల ప్రదర్శనలు జరుగనున్నాయి. ప్రచురణకర్తల కోసం వి జయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ 294 స్టాల్స్‌ను ఏర్పాటు చేసింది. దేశంలో ప్రఖ్యాతిగాంచిన ఇంగ్లీష ప్రచురణకర్తలు ఈసారి అధిక సంఖ్యలో రాబోతున్నారు. పుస్తక ఆవిష్కరణల కోసం ఒక వేదికను, బాలల ప్రతిభను కనబరిచే కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు మరో వేదికను సిద్ధం చేశారు. ప్రధాన వేదికకు చెరుకూరి రామోజీరావు వేదిక అని నామకరణం చేయగా, బాలల ప్రతిభ వేదికకు రతన్ టాటా పేరును పెట్టారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో ప్రముఖ కవులు, రచయితల జయంతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. దీనితో పాటు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాలు జరగనున్నాయి.





కృష్ణానది నీరుపారే దేవరపల్లి ఇసుక పాయలో సొసైటీ భూములుగా సర్వే చేసి హద్దులు పాతారని చూపుతున్న రైతు బాబూరావు

దేవరపల్లి సొసైటీలో బుసక, రెల్లి దుబ్బులతో నిరుపయోగంగా ఉన్న సొసైటీ భూములు

గండ్ర ఇసుకను కొల్లగొట్టేందుకే..

- దేవరపల్లి ఎస్సీ సొసైటీ భూముల్లోని బుస క వ్యవహారంలో కుట్రకోణం
- మూడు మీటర్ల లోతు ఇసుకపైనే వారి గురి

- సొసైటీ సభ్యుల మేలు కోరితే రెల్లి తొలగించి బుసక తవ్వాలి
- అలా కాకుండా నదీపాయలో ఇసుకలో సర్వే చేయటమేంటి?
- తెరవెనుక ఉండి కథ నడిపిస్తున్న పెద్ద తలకాయలు

(తోట్లవల్లూరు-ఆంధ్రజ్యోతి): దేవరపల్లి ఎస్సీ సొసైటీ భూముల్లోని బుసక వ్యవహారంలో పెద్ద కుట్రే దాగి ఉంది. దీని వెనుక పెద్దపెద్ద తలకాయలు ఉన్నట్టు స్పష్టమవుతోంది. ప్రజాప్రతినిధులు తెరవె నుక ఉండి వైసీపీకి చెందిన ఓ హంతకుడితో కథ నడిపిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సొసైటీ కింద 42 ఎకరాల భూములుంటే అందులో సగ భాగం పంటల సాగులో ఉండగా, మిగిలిన సగ భాగం మీటరు ఎత్తున బుసక వేసి దట్టంగా రెల్లి దుబ్బులు పెరిగి ఉన్నాయి. సొసైటీ సభ్యుడు దేవర పల్లి బాబూరావు విలేకరులను తీసుకెళ్లి స్పష్టంగా వి వరించి చెప్పాడు. ఈ బుసక, రెల్లి తొలగించి భూవి ని చదును చేస్తే పంటలు పండించుకునే అవకాశం సభ్యులకు కలుగుతుందన్నారు. బుసక తవ్వకాలకు మొదటగా 40 ఎకరాలకు దరఖాస్తు చేయగా ఇద్దరు సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటం జరిగింది. దాంతో తాము సొసైటీ భూముల జోలికి రావటం లేదని, మీకు నష్టం కలి గించబోమని చెప్పి 12 ఎకరాలకు తగ్గించి ప్రక్కనే ఉన్న నదీపాయలోని గండ్ర ఇసుకను కొల్లగొట్టేందుకు వ్యూహాన్ని రచించారనే విమర్శలు వచ్చాయి.

సొసైటీ భూముల కిందకు రాదంటూనే..

సొసైటీ భూములు సర్వే నంబరు 190లో ఉన్నాయి. ఇసుక పాయకూడా ఆ సర్వే నంబరులోనే ఉందని చెప్పి ఈ నెల 17న అధికారులు సర్వే నిర్వ హించి హద్దులు వేశారు. ఇది 190 సర్వే నంబరులో ఉన్నా దళితులకిచ్చిన సొసైటీ భూముల కిందకు రా దని చెబుతున్నారు. కృష్ణానదీపాయలోనే సరిహ ద్దులు వేశారని, ఇక్కడ ఇసుక మూడు మీటర్ల వరకు తీస్తే వరదల సమయంలో పక్కనే ఉన్న సొసైటీ భూములు కోతకు గురవుతాయని బాబూరావు ఆందోళన వ్యక్తం చేశారు.

అక్కడ తవ్వితే ఇక్కడి భూములు సాగులోకి ఎలా వస్తాయి?

అయితే ఒకరిద్దరు మాత్రమే వ్యతిరేకిస్తున్నారని, సొసైటీ సభ్యులందరు వెంకటస్వామిని మిగతా 6లో

ఎన్‌హెచ్ 'ధన'కార్యం

పశ్చిమ బైపాస్ వ్యవహారంలో డెమరేజ్ చార్జీల కింద రూ.14 కోట్లు చెల్లింపు

జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) ఆర్‌వో కార్యాలయం వెలగబెట్టిన 'ధన' కార్యం తాజాగా హైకోర్టు సాక్షిగా మరోసారి బయటపడింది. విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల అలైన్‌మెంట్ మార్పునకు సంబంధించిన వి వాదంలో విద్యుత్ అంతరాయం కారణంగా తలెత్తిన లైన్‌లాస్ నష్టానికి డెమరేజ్ చార్జీల కింద జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) ఆర్‌వో కార్యాలయం రూ.14 కోట్లు చెల్లించింది. ఎవరికి చెల్లించిందన్నది బయటకు రాలేదు. ల్యాంకో తానే యజమానినని వాదిస్తుంటే, మరోవైపు దీనిలో ఒక యూనిట్‌ను కొన్న రాధా టీఎంటీ సంస్థ కూడా తానే యాజమానినని వాదిస్తోంది. ఇరువర్గాల లాయర్లు న్యాయ స్థానంలో యాజమాన్య హక్కులపై వాదులాటకు దిగటం ఉమ్మడి కృష్ణాజిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది.

నగదు తీసుకున్న సంస్థ పేరు బయటపెట్టకుండా ఆర్‌వో కార్యాలయం నాటకం

- దీనిపై ఇటీవల హైకోర్టును ఆశ్రయించిన రైతులు
- అక్కడ ల్యాంకో, రాధా టీఎంటీల యాజమాన్య వి వాదం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు, ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల అలైన్‌మెంట్ మార్పునకు సంబంధించిన వివాదంపై హైకోర్టులో రైతులు వేసిన రిట్ పిటిషన్ తాజాగా విచారణకు వచ్చింది. ల్యాంకో తరఫున లిక్విడేటర్ లాయర్‌తో పాటు, మూతపడిన ల్యాంకో పవర్ ప్లాంట్‌లో ఒక యూనిట్‌ను కొనుగోలు చేసిన రాధా టీఎంటీ తరఫున లాయర్ కూడా వాదనలు వినిపించారు. రైతుల కేసుకు సంబంధించిన అంశంలో ఆయా సంస్థల న్యాయవాదుల వాదనలకు హైకోర్టు న్యాయమూర్తి సైతం విసుగు చెందారు. లాయర్ల వాదనలు చూస్తే వాటి యాజమాన్య హక్కులకు సంబంధించిన వివాదంగా మారిపోయింది. దీంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. ఇది మీ యాజమాన్య వివాదం కాదని, రైతుల అంశమని న్యాయమూర్తి స్టే విధించారు. మూతపడిన ల్యాంకో పవర్ ప్లాంట్ ద్వారా విద్యుదుత్పత్తే జరగనపుడు కోట్ల రూపాయలను ఎలా చెల్లించింది? ఎందుకు చెల్లించాల్సి వచ్చింది ? ఎవరికి చెల్లింపులు చేసింది ? వంటివి ఈ సందర్భంగా హైకోర్టు దృష్టికి వచ్చాయి.

రహస్యంగా నగదు చెల్లింపు విషయం

ల్యాంకో పవర్ ప్రాజెక్టు మూతపడక ముందు ట్రాన్స్‌మిషన్ టవర్ల అలైన్‌మెంట్ మార్పుకు ఆ సంస్థ ఇచ్చిన ప్రతిపాదన ఆధారంగా రూ.32.58 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్ అధికారులు టెండర్లు పిలిచారు. ల్యాంకో మూతపడిన తర్వాత డెమరేజ్ చార్జీల కింద ఎన్‌హెచ్ ఆర్‌వో కార్యాలయం రూ.14 కోట్ల మేర చెల్లింపులు చేసింది. ఎవరికి చెల్లించిందన్నది మాత్రం ఎన్‌హెచ్ ఆర్‌వో కార్యాలయం రహస్యంగా ఉంచింది. రైతులు అనేక మార్లు సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరినా ఎన్‌హెచ్ ఆర్‌వో కార్యాలయం ఇవ్వలేదు. ఆ తర్వాత రైతుల పిల్‌కు సమాధానంగా ల్యాంకో పేరుతో చెల్లించినట్టుగా సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది.

యాజమాన్య హక్కులు తమవేనంటూ వాదనలు

ల్యాంకో పవర్ ప్లాంట్ మూతపడ్డాక ఆ సంస్థ తమ ప్లాంట్‌ను ఆక్షన్ వేసింది. పవర్ ప్లాంట్‌ను నాలుగు భాగాలుగా విభజించి ఆక్షన్ వేసినట్టుగా హైకోర్టులో ల్యాంకో లిక్విడేటర్ తరఫున న్యాయవాది చెప్పారు. ఆయన ఇంకో ముఖ్యమైన విషయం కూడా వెల్లడించారు. ట్రాన్స్‌మిషన్ టవర్ల లైన్‌ను మయన్మార్ దేశానికి చెందిన సంస్థకు విక్రయించినా ఆ సంస్థ పూర్తిగా డబ్బులు చెల్లించలేదని, దీనిపై తాము నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు వెళ్లామని కేసు మిగతా 6లో..

గడ్డం గ్యాంగ్ కాళీకి రిమాండ్

- మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుపై హత్యాయత్నం కేసులో అరెస్టు
- నెల్లూరు జైలుకు తరలింపు
- అదే జైల్లో ఈ కేసులోని మరో 13 మంది నిందితులు
- పరారీలో మరో నిందితుడు కూచిపూడి శ్రీను

6లో

భూముల ధరలపై రివిజన్ షెడ్యూల్!

- 10 నుంచి రీ వెరిఫికేషన్
- సబ్ రిజిస్ట్రార్లపై పనిభారం

6లో

దుర్గగుడికి పోటెత్తిన భక్తులు

- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు

6లో





కుటుంబసభ్యులతో దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.సి.డి. శేఖర్, బి.కృష్ణమోహన్, జస్టిస్ రవినాథ్ తిల్హారిలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాస్ శాస్త్రి, ఆలయ ఉద్యోగులు

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

వన్‌టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో బుధవారం కనకదుర్గమ్మను పలువురు హైకోర్టు న్యాయమూర్తులు కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకస్వాములు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో వీరికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. ఆలయ అధికారులు, అర్చకస్వాములు వారికి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టిసిడి శేఖర్, జస్టిస్ బి.కృష్ణమోహన్ దంపతులు, జస్టిస్ రవినాథ్ తిల్హారి, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి డి.వెంకటరమణ, తదితరులు ఉన్నారు.



మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకట రమణకు చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గగుడికి భక్తుల తాకిడి..

వన్‌టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకోవటానికి బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, కొండదిగువన భక్తుల తాకిడితో కిటకిటలాడింది. బుధవారం తెల్లవారు జామునుంచే ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావటంతో క్యూలు, ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. మరో



దుర్గగుడిలో భక్త జన సందోహం

వైపు వీఐపీలతో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేశారు. భక్తుల తాకిడితో దుర్గగుడి, ఘాట్‌రోడ్డు వాహన రాకపోకలకు నిలిపివేసి కేవలం వీఐపీ వాహనాలను అనుమతించారు. దీంతో కొండ దిగువన కనకదుర్గానగర్, బొడ్డుబొమ్మ సెంటర్, హెడ్ వాటర్ వర్క్స్ ఎదురుగా జాతీయ రహదారి ఇరువైపుల వాహనాలతో రద్దీ ఏర్పడింది. దీంతో భక్తుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కనకదుర్గానగర్ ద్విచక్ర వాహనాలతో పూర్తిగా నిండిపోయింది. దుకాణాలు, వివిధ కౌంటర్ల వద్ద భక్తులు కిటకిటలాడారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో రామచంద్రమోహన్, తాజా మాజీ ఈవో కె.ఎస్.రామారావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు.

దర్గా వద్ద ట్రాఫిక్ జామ్

రథం సెంటర్ దర్గా సమీపంలో వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ స్తంభించింది. రథం సెంటర్ వైపు.. కనకదుర్గానగర్‌కు వచ్చే వాహనాలు ఎదురు రావటంతో ట్రాఫిక్ స్తంభించింది. అదే ప్రాంతంలో ఆటో స్టాండ్ ఉండటం వల్ల ఆటో డ్రైవర్లు రోడ్డుమీద వాహనాలు నిలిపి భక్తులను ఆటోల్లో ఎక్కించడంతో ట్రాఫిక్ స్తంభించింది.

పెదఅవుటపల్లి తంబి పుణ్యక్షేత్రంలో..

ఉంగుటూరు : నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు, చర్చిలు, ప్రార్థనా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్త ఏడాదిలో సుఖసంతోషాలతో, అన్నీ శుభాలు కలగాలని భగవంతుని వేడుకుంటూ ప్రజలు



దివ్యపూజను సమర్పిస్తున్న రెవ. ఫాదర్ మరియదాసు

ఆయా ఆలయాలు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. పెదఅవుటపల్లిలోని సుప్రసిద్ధ కతోలికా క్షేత్రమైన బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేరీమాత కపూచియన్ ప్రొవిన్స్(ఎనికేపాడు)ప్రొవెన్షియల్ రెవ.ఫాదర్ ప్రత్తిపాటి మరియదాసు దివ్యపూజలు సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.



కామధేనువు విగ్రహావిష్కరణలో యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు తదితరులు

కామధేనువుతో సకల శుభాలు

» కృష్ణామిల్క్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

» ఆవు, దూడ కామధేనువు విగ్రహావిష్కరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : సనాతన సాంప్రదాయాన్ని అనుసరించి కామధేనువు ఉన్న చోట సకల శుభాలు కలుగుతాయని అదే విధంగా ప్రాజెక్ట్ కామధేను(విజయ పాల ఫ్యాక్టరీ)తో పాడిరైతులకు సకల శుభాలతో పాటు ఆర్థికాభివృద్ధి జరగాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆకాంక్షించారు. వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేను(కృష్ణామిల్క్ యూనియన్)పాల ఫ్యాక్టరీలో బుధవారం ఆవు, దూడ(కామధేనువు) విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులకు పశుపోషణతో పాడి ద్వారా నిరంతర ఆదాయం అంది ఆర్థిక చేయూత కలుగుతోందని, అందుకే 1.50లక్షల పాడి రైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధికి చేయూత నందించే యూనియన్ గుర్తుగా కామధేనువును ఏర్పాటు చేశారన్నారు. అనంతరం ఆశాజ్యోతి దివ్యాంగ సొసైటీలో దివ్యాంగులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. దివ్యాంగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, ఆపరేషనల్ జీఎం లక్ష్మణరావు, ప్లాంట్ మేనేజర్ సరిత, జిల్లా బోర్డు డైరెక్టర్ శనగల వెంకట శివజ్యోతి, ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిన్నమనేని లక్ష్మీప్రసాద్, గుండపనేని ఉమావరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు, కొల్లి వెంకట్రావు, పలువురు సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు, సిబ్బంది, ఆశాజ్యోతి నిర్వాహకులు మాధవి తదితరులు పాల్గొన్నారు.

మామిడి ఎగుమతులు ప్రారంభం

విస్సన్నపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : విస్సన్నపేట మండలం నుంచి ముంబైకు మామిడి ఎగుమతులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. విస్సన్నపేట చిట్టూ మ్యాంగో మార్కెట్ నుంచి తోతాపురి 20 టన్నులు ముంబై మార్కెట్‌కు ఎగుమతి చేసినట్టు మార్కెట్ నిర్వాహకులు రాయల సత్యనారాయణ(కిట్టు) తెలిపారు. టన్ను తోతాపురి రూ.70వేలు ధర పలుకుతుందన్నారు. ప్రస్తుతం మామిడి ధర ఆశాజనకంగా ఉందన్నారు.

నేడు డయల్ యువర్ ఎస్ఈ

విజయవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడానికి గురువారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీపీడీసీఎల్ ఎస్ఈ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వినియోగదారులు 0866 2575620 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

భూముల ధరలపై రివిజన్ షెడ్యూల్!

» 10 నుంచి రీ వెరిఫికేషన్

» సబ్ రిజిస్ట్రార్లపై పనిభారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

భూముల ధరల సవరణకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్లకు మరోమారు రివిజన్ షెడ్యూల్ విడుదలైంది. తాజా షెడ్యూల్ ప్రకారం జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 1 వరకు చేయాల్సిన విధులను రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఈ రివిజన్ షెడ్యూల్ ప్రకారం రీ వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది. జనవరి 10వ తేదీ నుంచి పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో రెవెన్యూ, మునిసిపల్, పంచాయతీ అధికారులతో కలిసి ఏవైతే భూములు పెంచాలని అనుమతి ఇచ్చారో వాటిని రీ వెరిఫికేషన్



చేయాల్సి ఉంటుంది. జనవరి 17 నాటికి సవరించిన రేట్లకు సంబంధించి అనుమతించిన వాటిని కమిటీ ముందుకు తీసుకురావాలి. జనవరి 18న వెబ్‌సైట్‌లో వాటి రేట్లను ఉంచి ప్రజల నుంచి అభ్యంతరాలను తీసుకోవాల్సి ఉంటుంది. జనవరి 24న అభ్యంతరాలకు సంబంధించిన గ్రీవెన్స్ నిర్వహించాల్సి ఉంది. జనవరి 25న కమిటీ నేతృత్వంలో పెంచిన రేట్లను ఆమోదించాల్సి ఉంటుంది. జనవరి 27నాటికి డేటా ఎంట్రీని పూర్తి చేయాలి. ఫిబ్రవరి 1 నుంచి పెంచిన రేట్లను అమల్లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే చేసిన పనే మళ్లీ చేయాల్సి వస్తోందని, సంక్రాంతి పండగ కూడా చేసుకోనివ్వరా అంటూ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే భూముల రేట్ల సవరింపుకు సంబంధించి రెండు దఫాలుగా కసరత్తులు చేశామని, గ్యాప్ వచ్చిన ప్రతిసారీ రివిజన్ షెడ్యూల్ పేరుతో పనిభారాన్ని మోపుతున్నారని అల్లాడిపోతున్నారు. ఇప్పటికే షెడ్యూల్‌ను సవరించటం, అభ్యంతరాలను కూడా తీసుకోవటం జరిగిందని మళ్లీ అభ్యంతరాల స్వీకరణకు షెడ్యూల్‌ను నిర్ణయించటం ఏమిటని వాపోతున్నారు.

రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా జాస్తి సత్యనారాయణ

కృష్ణలంక, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా శాఖ చైర్మన్‌గా జాస్తి సత్యనారాయణ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శాఖ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. డిసెంబరు 31వ తేదీన రెడ్‌క్రాస్ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో జిల్లా రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీకి పదిమంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు తెలిపింది. జాస్తి సత్యనారాయణ చౌదరి, డాక్టర్ వి.నారాయణరావు, కొల్లి నాగేశ్వరరావు, పి.సాయిబాబా, అట్లూరి సుమబిందు, మన్యం



కలెక్టర్ లక్ష్మీశతో సమావేశమైన రెడ్‌క్రాస్ సభ్యులు

వెంకట జగన్నాథ్, డాక్టర్ ఇళ్ల రవి, బి.అనిల్‌కుమార్, డాక్టర్ బి.శివహరిప్రసాద్, శీతల్ జైన్‌లు నూతన సభ్యులుగా ఎన్నికకాగా, బుధవారం రెడ్‌క్రాస్ కార్యాలయంలో సమావేశమై జాస్తి సత్యనారాయణ చౌదరిని చైర్మన్‌గా, డాక్టర్ వి.నారాయణరావును వైస్ చైర్మన్‌గా, డాక్టర్ ఇళ్ల రవిని ట్రెజరర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు తెలిపింది. కొత్తగా ఎన్నికైన సభ్యులకు రెడ్‌క్రాస్ అధ్యక్షులు, కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు.

బ్యాంకర్లు బెదిరిస్తున్నారు!

» టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ

గుడివాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో కాలనీ లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి బ్యాంకర్లు తాళాలు వేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారి నుంచి తమను కాపాడాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ కోరారు. బుధవారం గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీ సీ-41బ్లాక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకర్లు లబ్ధిదారులను బెదిరించి నోటీసులిస్తున్నారని, రోజు 10 సార్లు ఫోన్లు చేసి దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. వారి ప్రయత్నాలు తిప్పికొడతామని, ఐక్యతతో పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో కమిటీ ఉపాధ్యక్షుడు సంబంగి రంగమ్మ, సభ్యులు రంగారావు, రాంబాబు, ఆదినారాయణ, మేరమ్మ, మాధవి, శైలజ, గణేష్, కాలనీవాసులు లక్ష్మీ, వరలక్ష్మీ, సామ్రాజ్యం, ధనలక్ష్మీ, నాగలక్ష్మీ, రత్నకుమారి, అప్పారావు, విజయలక్ష్మీ పాల్గొన్నారు.



టిడ్కో కాలనీలో ధర్నా చేస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే వెనిగండ్లకు వినతి

టిడ్కో కాలనీ లబ్ధిదారులను రుణవిముక్తుల్ని చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ కోరారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల స్వగృహంలో ఆయన్ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి టిడ్కో గృహాల విషయంలో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయించాలని ఎమ్మెల్యే వెనిగండ్లకు విజ్ఞప్తి చేశారు. కమిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ నూరున్నీసా, సభ్యులు రంగారావు, గణేష్, రాంబాబు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ ధనకార్యం

(5వ పేజీ తరువాయి)

నడుస్తోందని చెప్పారు. ఈ అలైన్‌మెంట్‌కు తామే యజమానులమని హైకోర్టుకు తెలియజేశారు. మరోవైపు రాధా టీఎంటీ సంస్థ కూడా ఈ లైన్‌కు తామే యజమానులమన్న వాదనలు వినిపించింది. మయన్మార్ కంపెనీ, రాధా టీఎంటీలు అంతర్గతంగా చేసుకున్న ఒప్పందం మేరకు ఈ వాదనలు తీసుకువచ్చిందా అన్నది తెలియాల్సి ఉంది. ల్యాంకో లిక్విడేటర్, రాధా టీఎంటీ లాయర్ల వాదనల నేపథ్యంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుని ఎవరికీ లైసెన్స్ లేదు.. యజమాని ఎవరో తెలియదు అని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో రైతుల తరఫున న్యాయవాదులు మెదమల్లి బాలాజీ, సాయి సూర్యతేజలు బలంగా వాదనలు వినిపించడంతో దాదాపుగా 12 కేసులకు స్టే లభించింది. ఇక ఒకే ఒక్క కేసు మాత్రమే మిగిలి ఉంది. ఈ కేసుల తుది విచారణలో జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) ఆర్వో కార్యాలయం ఉన్నతాధికారుల బండారం బయట పడే అవకాశం ఉంది. హైకోర్టు అభిప్రాయపడినట్టుగా లైసెన్స్ లేని సంస్థ, యజమాని ఎవరో తెలియని సంస్థలకు రూ. 14 కోట్ల ప్రజా ధనాన్ని సంతర్పణ చేశారన్నది అర్థమవుతోంది. ఎన్‌హెచ్ ఆర్వో కార్యాలయం ఉన్నతాధికారుల తీరుపై ఇప్పటికే రైతులు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ రంగంలోకి దిగింది. మరోవైపు కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ కార్యాలయం, ప్రధాన మంత్రి కార్యాలయం కూడా ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న నేపథ్యంలో ఏ ఉద్దేశంతో ఈ చెల్లింపులు చేశారు? ఎవరి ప్రయోజనాల కోసం చేశారు? ఈ వ్యవహారంలో ఎవరి వాటాలు ఎంత? అన్నది మరికొద్ది రోజుల్లో తేలనుంది.



విజేతలను ప్రకటిస్తున్న సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి, హాజరైన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

సోనోవిజన్ లక్కీడ్రా విజేతలు వీరే..

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత ఎలక్ట్రానిక్ షోరూం సోనోవిజన్ లక్కీడ్రా ద్వారకా నగర్‌లోని డైమండ్ పార్కు వద్ద గల సంస్థ షోరూంలో బుధవారం జరిగింది. సాయంత్రం 7.00 గంటలకు జరిగిన కార్యక్రమంలో హోండా అమేజ్ కారు, రెండు 55 ఇంచెస్ ఎల్ఈడీ టీవీలు, రిఫ్రిజిరేటర్ విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్‌లు హాజరయ్యారు. వందలాది కొనుగోలుదారుల సమక్షంలో లక్కీడ్రా విజేతలను ఎంపిక చేశారు. లక్కీడ్రాలో హోండా అమేజ్ కారును కూపన్ నెం. 015641 గాజువాకకు చెందిన సీహెచ్ వి రమణ దక్కించుకోగా, 55 ఇన్‌చెస్ ఎల్ఈడీ టీవీలను (కూపన్ నెం. 26709) మద్దెలపాలెంకు చెందిన ఎం.గుణసుందరి, (కూపన్ నెం.40939) తాటిచెట్లపాలెంకు చెందిన సతీష్ కుమార్‌లు గెలుచుకున్నారు. రిఫ్రిజిరేటర్‌కు (కూపన్ నెం. 91463) సీతమ్మపేటకు చెందిన సీహెచ్ రమేష్ కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ భాస్కరమూర్తి మాట్లాడుతూ, అత్యంత తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌ను సోనోవిజన్‌లో అందిస్తున్నట్టు తెలిపారు. ఏపీలో అతి పెద్ద ఎలక్ట్రానిక్ చైన్ స్టోర్ సోనోవిజన్‌లో అని, తమ వద్ద అన్ని పెద్ద కంపెనీల ఎల్ఈడీ, మొబైల్స్, ల్యాప్‌టాప్స్, రిఫ్రిజిరేటర్స్, వాషింగ్ మెషిన్స్, ఏసీ, ఇంకా కిచెన్ అప్లయెన్సెస్ అధిక డిస్కౌంట్‌తో లభిస్తున్నాయన్నారు. 22.5% వరకు క్యాష్ బ్యాక్ ఈసారి ప్రత్యేకత అని, ఒక ఈఎంఐ రిఫండ్ ఇంకా అనేక ఆఫర్స్ అందిస్తున్నామన్నారు.

విభిన్న పాత్రలతో హీరోగా నిరూపించుకుంటా

» యువ నటుడు ధర్మ మహేశ్

హనుమాన్‌జంక్షన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : విభిన్న కథాంశాలతో కథానాయకుడుగా నటనలో నిరూపించుకోవాలన్నదే తన కోరిక అని హనుమాన్‌జంక్షన్‌కు చెందిన వర్ధమాన నటుడు, డ్రింకర్ సాయి చిత్ర కథానాయకుడు కాకాని ధర్మమహేశ్ అన్నారు. గతేడాది డిసెంబరు 27న విడుదలైన 'డ్రింకర్ సాయి' చిత్రం విజయోత్సాహాన్ని నూతన సంవత్సరం సంద



తల్లిదండ్రులతో యువ కథానాయకుడు ధర్మ మహేశ్

ర్భంగా బుధవారం కుటుంబసభ్యులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, తన రెండో సినిమా 'డ్రింక్ సాయి' అనుకున్నట్టే ప్రేక్షకాదరణ లభిస్తున్నదన్నారు. తనకు అవకాశం ఇచ్చిన నిర్మాత, దర్శకులు, సాంకేతిక నిపుణులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనపేరు ధర్మ మహేశ్ అయినప్పటికీ సినిమాలో పాత్ర పేరు సాయిగా పిలవడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ప్రేక్షక అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ధర్మమహేశ్‌ను హీరోగా ఆశీర్వదించిన అభిమానులు, హనుమాన్‌జంక్షన్ ప్రజానీకానికి ఆయన తల్లిదండ్రులు కాకాని బాబు, అరుణ కృతజ్ఞతలు తెలియజేశారు.

న్యూ ఇయర్ జోష్‌లో అపశృతి

» రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



తోట్లవల్లూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : న్యూ ఇయర్ జోష్ కోసం మద్యం సేవించిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన యాకమూరు సమీపంలో జరిగింది. పమిడిముక్కల మండలం మంటాడ బీసీ కాలనీకి చెందిన బోయ వీరబాబు(18) స్నేహితుడితో కలిసి డిసెంబర్ 31 రాత్రి తోట్లవల్లూరు మండలంలోని గరికపర్రు వద్ద ఖాళీ ప్రదేశంలో మద్యం సేవించారు. అనంతరం బైక్‌పై ఉయ్యూరు వైపు వస్తుండగా యాకమూరు వద్ద మలుపులో దూళిపూడిపాలెంకు చెందిన శివ భాస్కర్, సుజన దంపతులు ఎదురుగా బైక్‌పై వస్తున్నారు. మద్యం మత్తులో ఉన్న వీరబాబు బైక్‌తో అతివేగంగా దంపతుల బైక్‌ను ఢీకొట్టగా తలకు బలమైన గాయమైంది. వెంటనే వీరబాబును ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. చికిత్స పొందుతు బుధవారం మృతిచెందాడని ఎస్సై ఎం.అర్జునరాజు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో కాళీకి రిమాండ్

గుడివాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్య అనుచరుడు, గడ్డం గ్యాంగ్ లీడర్, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు మెరుగుమాల కాళీ కటకటాల పాలయ్యారు. 2022 డిసెంబర్ 25వ తేదీ క్రిస్మస్ రోజున మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుపై కాళీ అతని గడ్డం గ్యాంగ్ పెట్రోసంచులు, కర్రలు, రాడ్‌లతో హత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. ఈ కేసులో



కాళీని వైద్య పరీక్షలకు తీసుకువెళుతున్న పోలీసు సిబ్బంది

13మంది గడ్డం గ్యాంగ్ బ్యాచ్ నెల్లూరు జైలులో ఉన్నారు. మంగళవారం అస్సాం రాష్ట్రంలో కాళీని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసారు. బుధవారం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఏ.జె.ఎఫ్.సి.ఎం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 10రోజులు రిమాండ్ విధించారు. కాళీని నెల్లూరు జైలుకు తరలించారు. మరో నిందితుడు కూచిపూడి శ్రీను అలియాస్ జిమ్ శ్రీనులు పరారీలో ఉన్నారు. త్వరలోనే శ్రీను కూడా అరెస్టు చేస్తామని వన్‌టౌన్ సి.ఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

గండ్ర ఇసుక కొల్లగొట్టేందుకే..

(5వ పేజీ తరువాయి)

బుసక తవ్వమని కోరామని కొందరు సభ్యులు మీడియా సమావేశంలో చెప్పటం గమనార్హం. మా భూములు సాగులోకి రావాలన్నతదే తమ తపన అని సభ్యులైన దేవరపల్లి చంద్రశేఖర్, దేవరపల్లి నాగరాజు చెప్పుకొచ్చారు. వారి వాదన ప్రకారం నదీపాయలో ఇసుక తవ్వితే సొసైటీ భూముల్లో బుసక, రెల్లి ఎలా తొలగిపోతుందని, భూములు సాగులోకి ఎలా వస్తాయని బాబూరావు ప్రశ్నిస్తున్నాడు.

అధికార పార్టీ నేతల హస్తం!

రెండు రోజులుగా ఇక్కడి పరిణామాలను గమనిస్తే అధికారపార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి నేతృత్వంలోనే కథ, స్క్రీన్‌ప్లే నడుస్తున్నాయనేది తేటతెల్లమవుతోంది. ఈ అధికార పార్టీ ప్రజాప్రతినిధి మొదటిగా వైసీపీకి చెందిన నేరచరిత్ర గల నాయకుడిని ముందు పెట్టగా వ్యతిరేక విమర్శలు రావటంతో మచిలీపట్నంకు చెందిన మరొక వ్యక్తితో దరఖాస్తు చేయించడం జరిగిందంటున్నారు. మొత్తంగా బుసక పేరుతో ఇసుకను తవ్వి సొమ్ము చేసుకోవాలనే తపన మాత్రమే వీరిలో కనపడుతుండగా, అధికారులు సైతం అడ్డగోలుగా సర్వే చేసి సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కలెక్టరేట్ ప్రాంగణంలో మొక్క నాటుతున్న కలెక్టర్ బాలాజీ

కొత్త ఏడాది.. సందడి

మచిలీపట్నం టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రి కొల్లు రవీంద్రను టీడీపీ, జనసేన నేతలు పుష్పగుచ్ఛాలు, శాలువాలు, కేకులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావుతో పాటు ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక అధికారి షాహెద్‌బాబు, కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యామ్‌మనోహర్, డీఎస్పీ అబ్దుల్ సుబాన్, ఆర్డీవో, తహసీల్దార్లు, వివిధ నియోజకవర్గాల కూటమి నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి రవీంద్రకు శుభాకాంక్షలు చెబుతున్న ఎస్పీ గంగాధరరావు

అనాధ శవానికి అంతిమ సంస్కారం

జగ్గయ్యపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండ్‌లో యాచకురాలు అనారోగ్యంతో మృతిచెందగా జగ్గయ్యపేట ఎస్సై రాజు మానవత్వంతో స్పందించి అంతిమసంస్కారాలు జరిపించారు. మంగళవారం బస్టాండ్‌లో 45-50 సం.ల మధ్య వయస్సు మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. బస్టాండ్‌లో స్వీపర్ల ద్వారా సమాచారం అందుకున్న సామాజిక కార్యకర్తలు కిరణ్, వెంకట్‌లు జగ్గయ్యపేట ఎస్సై జి.రాజుకు విషయం



మహిళ భౌతికకాయాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజు, ఖననం చేస్తున్న కార్యకర్తలు

తెలిపారు. వారి విచారణలో సంవత్సరం క్రితం తెలంగాణ ప్రాంతం నుంచి ఓ మహిళ కుమార్తెతో కలసి వచ్చిందని, బస్టాండ్‌లోనే యాచన చేస్తూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. మృతురాలి కుమార్తె అమాయకంగా ఉంటుందని, లోకజ్ఞానం లేదని చెప్పారు. ఎస్సై చొరవతో సామాజిక కార్యకర్తలు కిరణ్, వెంకట్‌లు పారామౌంట్ సంస్థ ఉచిత వాహనంలో స్మశానానికి చేర్చి అంతిమ కార్యక్రమాలు పూర్తిచేశారు. మానవత్వంతో స్పందించిన ఎస్సై రాజును, చొరవ తీసుకున్న కిరణ్, వెంకట్‌లను స్థానికులు అభినందించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114,122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

రైతుబజారులో పది దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతుబజారులో పది దుకాణాలకు తూర్పు పరిధిలో అర్హత గల డ్వాక్రా /డ్వాక్వా గ్రూపులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన డ్వాక్రా / డ్వాక్వా గ్రూపులు ఈ ప్రకటన వెలువడిన వారం రోజుల్లోగా దరఖాస్తులను ఎస్టేట్ ఆఫీసర్, రైతుబజారు లేదా జిల్లా అగ్రి టేడ్, మార్కెటింగ్ అధికారి, మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ మార్కెట్ యార్డు గొల్లపూడిలో సమర్పించాలని జేసీ కోరారు.

టీటీడీ క్యాలెండర్, డైరీలకు డిమాండ్

- టీటీడీ కల్యాణ మండపంలో నవంబరు నుంచి కొనసాగుతున్న విక్రయాలు
- అందుబాటులో లేని క్యాలెండర్లు
- సరఫరా లేక చేతులెత్తేసిన సిబ్బంది
- నిరాశతో వెనుతిరిగిన భక్తులు

లబ్బీపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ లకు భక్తుల నుంచి విపరీతమైన డిమాండ్ నెలకొంది. టీటీడీ కల్యాణ మండపంలో గత నవంబరు నుంచి వీటి విక్రయాలు కొనసాగుతున్నాయి. గతంలో కంటే 3వేలు అధికంగా వీటిని విక్రయించినా డిమాండ్ ఉండడంతో, తగినంత సరఫరా లేక టీటీడీ సిబ్బంది చేతులెత్తేశారు. గత ఏడాది 20వేలు డైరీలు, 20వేలు క్యాలెండర్లు నగరంలోని విక్రయించగా ఈ ఏడాది అదనంగా మరో 3వేలు పెంచి 23వే డైరీలు, 23వేలు క్యాలెండర్ అమ్మకాలు చేశారు. గతంలో టీటీడీ కల్యాణ మండపాల్లో అన్ని చోట్లా వీటి విక్రయాలు సాగించేవారు, అయితే ఒంగోలు నుంచి ఇటు ఏలూరు వరకు ఉన్న నాన్ ఏసీ టీటీడీ కల్యాణ మండపాలు లీజుకు ఇవ్వడంతో అక్కడ వీటి విక్రయాలు లేవని, విజయవాడ నగరంలో మాత్రమే డైరీలు, క్యాలెండర్లు విక్రయాలు సాగించడంతో ఆయా ప్రాంతాల నుంచి వీటి కోసం భక్తులు రావడంతో డిమాండ్ విపరీతంగా ఉంది. క్యాలెండర్లు రెండు రోజుల ముందు నుంచే అందుబాటులో లేకపోవడంతో వీటికోసం వచ్చిన వారిలో కొందరు నిరాశగా వెనుదిరగగా మరికొందరు ఇక్కడ విక్రయదారులపై వివాదానికి దిగుతున్నారు. దీంతో టీటీడీ సిబ్బంది తలలు పట్టుకుం టున్నారు. డైరీలు కూడా బుధవారం అయిపో వడంతో చాలా మంది భక్తులు వెనుదిరిగారు. ఇక డైరీలు, క్యాలెండర్లు తిరుమల నుంచి వచ్చే అవకాశం ఉంటుందో లేదో తెలియదని చెబుతున్నారు. అయితే డిమాండ్‌ను బట్టి వీటిని మరికొన్ని రోజులు అందుబాటులోఉంచాలని భక్తులు కోరుతున్నారు.


టీటీడీ కల్యాణ మండపంలో డైరీలు విక్రయిస్తున్న సిబ్బంది


భక్తులతో కిటకిటలాడుతున్న టీటీడీలోని శ్రీవారి ఆలయం

శ్రీవారి ఆలయం కిటకిట

నూతన సంవత్సరం మొదటి రోజు శ్రీవారి ఆలయం భక్తలతో కిటకిటలాడింది. నూతన సంవత్సరం మొదటి రోజు దైవదర్శనం చేసుకుంటే సంవత్సరం అంతా మంచి జరుగుతుందనే నమ్మకంతో ప్రజలు ఆలయాలకు క్యూ కట్టారు. దీంతో ఆలయాలు బుదవారం ఉదయం నుంచేచ భక్తులతో కిక్కిరిశాయి. భక్తుల రద్దీకి తగినట్లు ఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశారు.

పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రణాళికలు

టీడీపీ తూర్పు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో గద్దె

పటమట, జనవరి 1(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేదరికాన్ని దూరం చేయడంతో పాటు కుటుంబాల్లో ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి ప్రణాళికలు రూపొందిస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. టీడీపీ 14వ డివిజన్ అధ్యక్షుడు నర్రా కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కట్ చేశారు. దూళిపాళ్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో 500 మంది నిరుపేదల మహిళలకు గద్దె రామ్మోహన్ కూరగాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చేపట్టిన అన్ని ప్రాజెక్టులు నూతన సంవత్సరంలో విజయవంతం కావాలని కోరుకుంటు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొప్పన భవకుమార్, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి కాంతి శ్రీ పాల్గొన్నారు. ఎమ్మెల్యే అభిమానులు, నాయకులు గద్దెకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన 'గద్దె'

తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అభిమానులు చలసాని రమణ, పొట్లూరి ప్రసాద్, పొట్లూరి రవీంద్రలు ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను అశోక్‌నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గద్దె రామ్మోహన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, దూళిపాళ్ల రమేష్‌లు పాల్గొన్నారు.

'గద్దె'ను కలిసిన నేతలు

కృష్ణలంక: స్థానిక 21వ డివిజన్‌కు చెందిన టీడీపీ, జనసేన నాయకులు బుధవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, కేశనం భావన్నారాయణ, కొర్రా అప్పన్న, జనసేన నాయకులు కొవ్వూరి కిరణ్‌బాబు, పోతిరెడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుండు శ్రీనివాసరావు ఎమ్మెల్యే గద్దెను ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గద్దెకు పుష్పగుచ్చాలు సమర్పించి దుశ్శాలువాతో సత్కరించారు. టీడీపీ నాయకులు పులవోలు లక్ష్మి, శేషు, రాధాకృష్ణ పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గద్దె రామ్మోహన్ తదితరులు


టీడీపీ డివిజన్ అధ్యక్షుడు రంగారావుకు కేక్ తినిపిస్తున్న జనసేన డివిజన్ అధ్యక్షుడు కిరణ్‌బాబు

టీడీపీ డివిజన్ కార్యాలయంలో ...

కృష్ణలంక 21వ డివిజన్‌లోని టీడీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ డివిజన్ అధ్యక్షుడు వేములపల్లి రంగారావు, జనసేన డివిజన్ అధ్యక్షుడు కొవ్వూరి కిరణ్‌బాబు, గొరిపర్తి నామేశ్వరరావు, వల్లూరి మధు తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. జనసేన నాయకుడు కొవ్వూరి కిరణ్‌బాబు కేకును టీడీపీ డివిజన్ అధ్యక్షుడు వేములపల్లి రంగారావుకు తినిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూర్యదేవర నాగేశ్వరరావు, కేశనం భావన్నారాయణ, ఆర్.రమాదేవి, తుర్లపాటి మల్లేశ్వరరావు, వేములపల్లి జీవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లయోలా వాకర్స్ ఆధ్వర్యంలో ...

భారతీనగర్: ఆంధ్రా లయోలా కళాశాల యాజమాన్యం మొండివైఖరిని వ్యతిరేకిస్తూ, కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్‌కు అనుమతిని కోరుతూ లయోలా వాకర్స్ అమరావతి వాకర్స్ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం 15వ రోజుకు చేరుకుంది. బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా కళాశాల మెయిన్ గేట్ దగ్గర కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వాకర్లు కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయోలా వాకర్స్ , అమరావతి వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

మాచవరం వాకర్స్ ఆధ్వర్యంలో..

మాచవరం లోని ఎస్ఆర్ఆర్అండ్ సీవీఆర్ ప్రభుత్వం కళాశాల క్రీడా మైదానంలో మాచవరం వాకర్స్ మహిళ సభ్యుల సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో సీనియర్ వాకర్స్‌తో కేక్ కట్ చేయించారు.అనంతరం మహిళా వాకర్స్ చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పి.సుబ్బారావు, కార్యదర్శులు పి.ఆర్.కె.రెడ్డి, నాగరాజు, కోశాధికారి వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

మెస్సియ ఫెలోషిప్‌లో ...

ఆటోనగర్: ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సియ ఫెలోషిప్ చర్చిలో బుధవారం నూతన సంవత్సర ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సజ్జా రత్నకుమార్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో దేశ, రాష్ట్ర ప్రజలను దేవుడు దీవించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రవి కిషోర్, విజయ, నీలయ్య, సూర్య ప్రకాష్, సజ్జా జ్యోతి పాల్గొన్నారు.


లయోలా కాలేజీ ఎదుట కేక్ కట్ చేస్తున్న లయోలా వాకర్స్, అమరావతి వాకర్స్ సభ్యులు


నృత్యాలు చేస్తున్న మహిళ వాకర్స్


సర్వీస్ రోడ్లో సమరం హాస్పిటల్ వద్ద నిలిపిన వాహనాలు

సర్వీస్‌రోడ్డులో అక్రమ పార్కింగ్

పటమట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : బెంజిసర్కిల్ నుంచి కుడివైపు సర్వీసు రోడ్డు సమరం హాస్పిటల్, నిర్మలా చర్చి మీదుగా సాయిబాబా గుడి వైపు వెళ్లే మార్గంలో వాహనదారులు రోడ్డుమీద తమ వాహనాలను నిలిపి ఉంచడంతో నిరంతరం ఈ సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఏలూరురోడ్డులో ట్రాఫిక్ స్తంభించినప్పుడు, వీఐపీలు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నప్పుడు ప్రత్యామ్నాయంగా ఈ సర్వీస్ రోడ్డును ఉపయోగిస్తుంటారు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్డులో వాహనాల అక్రమ పార్కింగ్‌ను నిలుపుదల చే యాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డు పక్కనే పడవేసిన విద్యుత్ స్తంభాలు

విద్యుత్ స్తంభాలను తొలగించండి

పటమట, జనవరి 1(ఆంధ్రజ్యోతి) : 12వ డివిజన్ ధనేకుల పున్నయ్య వీధి సమీపంలో సర్వీస్ నుంచి తొలగించిన విద్యుత్ స్తంభాలను రోడ్డు వెంబడి పడవేశారు. కొన్ని నెలలు నుంచి వీటిని ఇక్కడే వదిలేశారు. విష కీటకాలకు, దోమలు, పాములకు ఆ ప్రాంతం ఆవాసం కాకముందే ఈ విద్యుత్ స్తంభాలను తొలగించాలని 12వ డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

ఎంబీవీకేలో రేపటి నుంచి విశిష్ట కార్యక్రమాలు

విజయవాడ కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : భాష, సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షించేందుకు అజో-విభ-కందాళం ఫౌండేషన్ విజయవాడలో 3, 4, 5 తేదీల్లో విశిష్ట కార్యక్రమాలను జాషువా సాంస్కృతిక వేదిక సహకారంతో నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ (యూఎస్ఏ) తెలిపారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటికల పోటీలు, సాహిత్య సదస్సులు, పురస్కారాల ప్రదానోత్సవాలుంటాయన్నారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కేవీ రామానుజాచార్యులు భాషా, సాంస్కృతిక రంగానికి ఫౌండేషన్ చేస్తున్న సేవలను వివరించారు. జాషువా సాంస్కృతిక వేదిక కన్వీనర్ గుండు నారాయణరావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే) వేదికగా జరిగే ఈ కార్యక్రమాలకు ప్రవేశం ఉచితమన్నారు.

చెన్నైకు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ టీటీ జట్టు

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై అమిత్ యూనివర్సిటీలో ఈ నెల 3 నుంచి 5 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ మహిళా చాంపియన్‌షిప్‌లో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ జట్టు బయలుదేరిందని స్పోర్ట్స్ వర్సిటీ బోర్డు సెక్రటరీ ఇత్రిమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జట్టులో కె.మేఘన, వీ శ్రీకరి(శ్రీకాకుళం గ్రేటర్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్), యు.రుషిత, వి.శ్రీనవ్య తేజస్వి(విశాఖపట్నం గాయత్రి విద్యాపరిషత్ ఇన్‌స్టిట్యూట్ హెల్త్‌కేర్ మెడికల్ టెక్నాలజీ), బి.జయశ్రీ(రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ)లో ఉన్నారు. వీరిని వైస్ చాన్సలర్ డాక్టర్ డీవీఎస్ఎల్ నర్సింహం, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, కంట్రోలర్ ఎగ్జామినేషన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు అభినందించారు.


ఎంపికైన టీటీ జట్టుతో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ నర్సింహం

జాతీయస్థాయి జూడోలో సిద్ధార్థ విద్యార్థినులు విజేతలు


విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ

విజయవాడ కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల జూనియర్ ఇంటర్ విద్యార్థినులు బి.భావన గ్రూప్ ప్రవల్లిక 2024-25 రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో విశేష విజయాలు సాధించారు. డిసెంబరు 27 నుంచి 29 వరకు గుంటూరు జేఎన్‌టీయూలో జరిగిన ఈ పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్, సబ్-జూనియర్ విభాగాల్లో బి.భావన గోల్డ్‌మెడల్ గెలుచుకొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. భవిష్యత్ పోటీల్లో మరింత స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

దుర్గమ్మ సన్నిధిలో నాట్యప్రదర్శన

వన్‌టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి కళావేదికపై కొత్తపేటకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయం గురువు రాయన శ్రీనివాసరావు బృందంచే బుధవారం ఆంధ్రనాట్య ప్రదర్శన నిర్వహించారు. 30 మంది కళాకారులు నాట్య ప్రదర్శన చేశారు. డిప్యూటీ ఈవో రత్నరాజు కళకారుల బృందాన్ని అభినందించి, సర్టిఫికెట్లు, ప్రసాదం అందజేశారు.

వీధి విక్రయదారుల కమిటీ ఏర్పాటుకు చర్యలు

అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

చిట్టినగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ (యూబీఎస్)డిపార్ట్‌మెంట్ మార్గదర్శకాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో విక్రయదారుల కమిటీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోనన్నట్టు నగర కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిటీలో ఏడుగురు సభ్యులు వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్న విక్రయదారులు, ఒక నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ (ఎన్‌జీవో), ఒక కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ (సీబీవో)లను సభ్యులుగా ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీధి విక్రయదారులు, ఎన్‌జీవో, సీబీవోలు నగర పాలక సంస్థ యూసీపీ విభాగంలో 30 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని, 30 రోజుల తరువాత అనుకున్న సంఖ్య కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ పద్ధతిలో సభ్యులను ఎంపిక చేస్తామని కమిషనర్ తెలిపారు. వివరాలకు యూసీడీ విభాగం టెక్నికల్ ఎక్స్‌పర్ట్ రవిశంకర్ ఫోన్ నంబరు 7901610071లో సంప్రదించాలన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, వీధి విక్రయదారు ఐడీ. వీధి విక్రయదారు సర్టిఫికెట్ నకళ్లు జతపర్చాలన్నారు.

ఆర్టీసీ ఈడీ, డీపీటీవోలకు శుభాకాంక్షలు

వన్‌టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా ప్రజా రవాణా సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు బుధవారం ఆర్టీసీ హౌస్‌లో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (పరిపాలన) జి.వి.రవివర్మ, జిల్లా డీపీటీవో ఎంవై దానంలకు శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.పి.శేష గిరి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఈతాకుల కృష్ణా రావు, జిల్లా నాయకులు జెల్లా రాజా, టి.సూరిబాబు, జానకిరామ్, పి.వెంకటేశ్వరరావు కలిసి పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ఆర్టీసీ అభివృద్ధి బాటలో నడవటానికి ఉద్యోగులు తమ వంతు సహకారం అందించాలని, సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలని కోరారు.


విద్యాసాగర్‌కు అభినందనలు తెలుపుతున్న విజయసారథి

మర్యాదపూర్వక కలయిక

భారతీనగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన ఏ.విద్యాసాగర్‌ను బుధవారం గాంధీనగర్‌లోని ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నగర ఉపాధ్యక్షుడు సిహెచ్. మధుసూదన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ తీగలే.. పానుపుగా!

పాలకొండ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూస్తే కరెంటు తీగలపై ఓ వ్యక్తి చనిపోయినట్టు ఉంది కదూ..! అయితే అతను చనిపోలేదు.. కరెంటు తీగలపై పడుకున్నాడంతే.. అసలేం జరిగిందంటే.. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం ఎం.సింగుపురంలో యజ్జల వెంకన్న అనే యువకుడు డిసెంబరు 31 రాత్రి ఫుల్లుగా మందు తాగి, గ్రామస్థులను హడలెత్తించాడు. వీధుల్లో కనిపించినవారిని ఇష్టమొచ్చినట్టు మాట్లాడాడు. వీధిలో ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కేందుకు ప్రయత్నించాడు. దీంతో స్థానికులు ఏబీ స్విచ్‌ను ఆపేసి విద్యుత్ సరఫరా నిలిపేశారు. అయినా.. ఆ యువకుడు ఓ డాబాపై ఎక్కి, అక్కడి నుంచి విద్యుత్ స్తంభం మీదకు చేరాడు. విద్యుత్ తీగలపై విన్యాసాలు చేస్తూ, అక్కడే పడుకున్నాడు. స్థానికులు వెంకన్నను వారించి కిందకు దించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆతర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

200 కోట్లు తాగేశారు!

(మొదటి పేజీ తరువాయి)

ఒకటిన్నర రెట్లు ఎక్కువగా ఒక్కరోజులోనే మద్యం విక్రయాలు జరిగాయి. న్యూఇయర్ ట్రెండ్ బుధవారం కూడా కొనసాగింది. నూతన సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని మద్యం షాపులు, బార్ల లైసెన్సీలు ముందుగానే పెద్దమొత్తంలో మద్యం కొనుగోలు చేశారు. డిసెంబరు 26 నుంచి మూడు రోజులపాటు రోజుకు రూ.130 కోట్ల మద్యం డిపోల (గోడౌన్లు) నుంచి దిగుమతి చేసుకున్నారు. ఆదివారం సెలవు మినహాయిస్తే 30న ఏకంగా రూ.219.43 కోట్ల విలువైన మద్యం కొనుగోలు చేశారు. 31న రూ.112.42 కోట్ల మద్యం కొన్నారు. ఈ రెండు రోజుల్లోనే లైసెన్సీలు ప్రభుత్వం నుంచి 4.08లక్షల కేసుల లిక్కర్, 1.61లక్షల కేసుల బీరు తీసుకున్నారు. ఇందులో 31వ తేదీన 2.5లక్షల కేసుల లిక్కర్, 70వేల కేసుల బీరు అమ్మినట్లు అంచనా. పక్క రాష్ట్రాల నుంచి ఎన్‌డీపీఎల్, రాష్ట్రంలో నాటుసారాపై నియంత్రణ చర్యలు చేపట్టడం కూడా మద్యం అమ్మకాలు పెరగడానికి కారణమయ్యాయి. గతంలో మంచి బ్రాండ్లు దొరకడం లేదని, ధర తక్కువకు వస్తుందని తెలంగాణ, కర్ణాటక నుంచి నూతన సంవత్సర వేడుకలకు భారీగా ఎన్‌డీపీఎల్ తీసుకొచ్చేవారు. కొత్త మద్యం పాలసీలో ధరలు తగ్గడం వల్ల ఎన్‌డీపీఎల్ ప్రభావం కొంతమేర తగ్గింది. ఎక్సైజ్ శాఖ 24గంటల తనిఖీలు చేపట్టడంతో గత రెండు రోజుల్లో ఎన్‌డీపీఎల్ ఇంకా తగ్గింది. ఫలితంగా రాష్ట్రంలో మద్యం అమ్మకాలు పెరిగాయి.

'పుష్ప' నిర్మాతలను అరెస్టు చేయొద్దు

- తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటకు సంబంధించిన కేసులో సదరు చిత్ర నిర్మాతలను అరెస్టు చెయ్యవద్దని తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసుతో తమకు సంబంధం లేదని, చిక్కడపల్లి పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని ఆదేశించమని కోరుతూ పుష్ప నిర్మాణ సంస్థ.. మైత్రీ మూవీస్ యజమానులు యలమంచిలి రవిశంకర్, యెర్నేని నవీన్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ కే సుజన ధర్మాసనం ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టింది. తాము అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ సంధ్య థియేటర్ వద్ద దురదృష్టకర ఘటన జరుగుతుందని తాము ఊహించలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది న్యాయస్థానానికి విన్నవించారు. అలాంటి ఘటన జరగాలనే ఉద్దేశం తమకు లేదని, ఘటన జరగడానికి తాము కారకులం కాదని పేర్కొన్నారు. ఆ నేరాన్ని తమకు ఆపాదించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రీమియర్ షో ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరగడానికి అన్ని చర్యలు తీసుకున్నామని, ప్రభుత్వ అనుమతి కూడా పొందామని తెలిపారు. సినిమా నిర్మాణం వరకే తాము పరిమితమయ్యామని, జరిగిన ఘటనకు తమకు ఎలాంటి సంబంధం లేదని వివరించారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్లను అరెస్టు చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులు, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఎండీసీకి మస్కా

భారీగా రాయితీలు, ప్రోత్సాహకాలు మింగేశారు

- కానీ, ఎండీసీకి పైసా వాటా ఇవ్వని కడప నేత కంపెనీ
- బెరైటీస్ బెనిఫిసియేషన్‌లో గోల్‌మాల్
- కడప నాయకుడి చీకటి మంత్రాంగం
- ఎండీసీతో 2008లో జాయింట్ వెంచర్
- కానీ, సొంతంగా వ్యాపారం
- 16 ఏళ్లుగా 11 శాతం వాటా ఇవ్వని కంపెనీ
- మరో కంపెనీని ఏర్పాటుచేసి వ్యాపారం
- కాగ్ తప్పుపట్టినా మొద్దునిద్రలో గనులశాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బెరైటీస్ దందాలో ఇదో కొత్త కోణం. జాయింట్ వెంచర్ పేరిట సాగుతున్న నయా దోపిడి. ప్రభుత్వ సంస్థను భాగస్వామిగా చేసుకోవడం ద్వారా వచ్చే ప్రత్యేక రాయితీలు, ప్రయోజనాలు పొందుతూ, తిరిగి రూపాయి ఇవ్వకుండా నిలువునా ముంచేస్తున్న దందా ఇది. ఈ విషయాన్ని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గుర్తించి ప్రభుత్వాన్ని హెచ్చరించింది. బెరైటీస్ బెనిఫిసియేషన్‌లో చీకటి దందా సాగుతోందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. అయినా గనులశాఖ ఏ చర్యలూ తీసుకోలేదు. ఎందుకంటే ఆయన నాటి గనుల మంత్రికి సన్నిహితుడు. కడప జిల్లా వైసీపీ నేత. జగన్ జమానాలో సహజ వనరుల దోపిడికి పాల్పడిన అనేకమందిపై కూటమిప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కానీ, ఈ కడప నేత దోపిడి గురించి తెలిసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వాన్ని నిలువునా ముంచుతున్న ఈ నేత వ్యవహారం తెలిసినా అధికారులు మౌనంగా ఉంటున్నారు. ఇందుకు కారణం ఏమయి ఉంటుంది? వివరాల్లోకి వెళితే..కడప జిల్లాకు చెందిన వైసీపీ నేత ఒకరు బెరైటీస్ వ్యాపారం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థతో (ఏపీఎండీసీ) ఉమ్మడి భాగస్వామి గా (జాయింట్ వెంచర్) 2008లో ప్లాంటు ఏర్పాటు చేశారు. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రానికి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ నేత ప్లాంట్‌లో ఎండీసీకి 11 శాతం వాటా ఉంది. జాయింట్ వెంచర్ వల్ల ఎండీసీ ఆ కంపెనీకి తక్కువ ధరకే బెరైటీస్‌ను సరఫరా చేస్తోంది. ఇంకా ఇతర సబ్సిడీలు ఆ కంపెనీకి దక్కుతున్నాయి. బెరైటీస్ సరఫరాలో ఈ కంపెనీకి ప్రాధాన్యత కూడా ఉంది. నిబంధనల ప్రకారం ఏటా నిర్దేశించిన వాటా డబ్బు ఎండీసీకి ఆ నేత కంపెనీ జమచేయాలి. కానీ, కంపెనీ ఏర్పాటయిన 2008 నుంచి నేటివరకు ఎండీసీకి వాటా సొమ్ము రూపాయి కూడా రాలేదు. కానీ, ఏటేటా ఆ కంపెనీకి ఎండీసీ నుంచి సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలు ఠంచనుగా వెళ్తున్నాయి. ప్రతి నెల సగటున 5-10వేల టన్నుల బెరైటీస్‌ను ఆ ప్లాంటులో బెనిఫిసియేషన్ చేస్తున్నారు.

చీకటి వ్యాపారం

కాగ్ నివేదిక తర్వాత కడప నేత రూటు మార్చారు. సొంతంగా మరో మినరల్ కంపెనీని ఏర్పాటు చేశారు. ఈ కంపెనీ పేరిట నేరుగా మిల్లుల నుంచి బెరైటీస్ కొనుగోలు చేస్తున్నారు. వాటి ఎండీసీతో భాగస్వామ్యం ఉన్న కంపెనీలో బెనిఫిసియేషన్ చేస్తున్నారు. దీనివల్ల ఎండీసీకి 11 శాతం వాటా ఇవ్వాల్సిన అవసరం లేదన్నది ఆయన వాదన. కానీ, జాయింట్ వెంచర్ ఒప్పందం ప్రకారం, ఆ ప్లాంటు ద్వారా జరిగే ప్రతీ వ్యాపారంలో ఎండీసీకి వాటా ఇచ్చితీరాల్సిందే. ఈ చీకటి వ్యాపారం గురించి గనులశాఖ అధికారులకు తెలిసినా మిన్నకుండిపోయారు. ప్రభుత్వ సంస్థను నిలువునా ముంచేస్తున్నా గనుల శాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదు? కూటమి ప్రభుత్వంలో కూడా ఆ నేత కంపెనీకి ఎందుకు నోటీసులు ఇవ్వలేకపోతున్నారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కాగ్ ప్రశ్నలతో కదలిక

ఎండీసీ ప్రాజెక్టులు, ఆదాయ వ్యయాలు, అప్పులపై జగన్ ప్రభుత్వంలో కాగ్ పరిశీలన చేసినప్పుడు...కీలక విషయాలు వెలుగుచూశాయి. జాయింట్ వెంచర్ వ్యాపారంలో 11 శాతం వాటాగా ఎండీసీకి ఎంత డబ్బు జమ అవుతోంది? గత 16 ఏళ్లలో ఇప్పటిదాకా వచ్చిన మొత్తం ఆదాయం ఎంత? ప్రయోజనాలు, సబ్సిడీల రూపంలో ఆ కంపెనీకి ఎండీసీ ఇచ్చినదెంత? అన్న కీలక ప్రశ్నలపై కాగ్ పరిశీలన జరిపింది. పేరుకే జాయింట్ వెంచర్ ఒప్పందం జరిగిందని, ఇప్పటివరకు ఎండీసీకి 11 శాతం వాటా కింద రూపాయి దక్కలేదని కాగ్ తేల్చింది. అయితే, వాటా సొమ్ము ఇవ్వని అంశాన్ని ఇప్పటి వరకు బోర్డు సమావేశంలో ఎందుకు చర్చించలేదు? ఆ సంస్థకు ఎందుకు నోటీసులు ఇవ్వలేదు? ఇప్పటి వరకు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని ఎందుకు సమీక్షించలేదు? అని కాగ్ ప్రశ్నలు సంధించింది. గనుల శాఖ వద్ద దీనిపై ఒక్క సమాధానమూ లేదు. ఆ కంపెనీ యజమాని వైసీపీ నేత అని, నాటి గనుల మంత్రికి అత్యంత సన్నిహితుడన్న సమాచారం తప్ప మరే వివరణ అధికారులు ఇవ్వలేదు. నాటి మంత్రికి సన్నిహితుడనే కారణంతో అధికారులు ఆ కంపెనీకి ఎలాంటి నోటీసు ఇవ్వలేకపోయారన్నది స్పష్టమవుతోంది.

ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదు?

జగన్ జమానాలో గనులశాఖ కేంద్రంగా సాగిన దందాలపై కాగ్ దృష్టి సారించింది. ఇసుక, క్వార్ట్జ్, ఇతర ఖనిజాల దోపిడిపై విచారణ చేస్తోంది. గతంలో జరిగిన తప్పులను నివేదించడంతోపాటు వాటికి పరిష్కారాలు కోరుతోంది. కానీ గనుల శాఖ ఈ విషయాన్ని దాచిపెట్టింది. జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు చేసిన నేత 16 ఏళ్లుగా వాటా సొమ్ము ఇవ్వడం లేదన్న అంశాన్నే సర్కారుకు నివేదించలేదు. దీంతో ఈ విషయం ప్రభుత్వ పరిశీలనకు రాకుండాపోయింది. అధికారులు ఈ విషయాన్ని అంత తీవ్రమైనదిగా తీసుకోకపోవడానికి ప్రధాన కారణం ఏమై ఉంటుంది?



ఏపీజేఏసీ అమరావతి డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, ఆ సంఘం నేతలు

పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించండి

- సీఎంకు ఏపీఎన్‌జీజీవో, ఏపీజేఏసీ అమరావతి నేతల విజ్ఞప్తి



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి మాట్లాడుతున్న ఏపీఎన్‌జీజీవో నేతలు శివారెడ్డి, విద్యాసాగర్

విజయవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలో కూటమి ప్రభుత్వం నూతన ఉత్సాహాన్ని, ఆశలను నింపిందని ఏపీ నాన్ గజిటెడ్, గజిటెడ్ ఉద్యోగుల సంఘం(ఏపీఎన్‌జీజీవో) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శివారెడ్డి, ఎ. విద్యాసాగర్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర కార్యవర్గం చంద్రబాబును కలిసింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎంపికైన సాగర్‌ను చంద్రబాబు అభినందించారు. ఆ తర్వాత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఉద్యోగుల పెండింగ్ డీఏలతో పాటు జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండ్ లీవ్ బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ ఉద్యోగుల పదవీ విరమణ వయసును కూడా 60 నుంచి 62 ఏళ్లకు పొడిగించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, 2004, సెప్టెంబరు 1కి ముందు నోటిఫికేషన్ మేరకు నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో ఏపీఎన్‌జీజీవో నాయకులు కేఎస్ఎస్ ప్రసాద్, ఎన్. వెంకటేశ్వర్లు, సీహెచ్ మంజుల, అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

పలు డైరీల ఆవిష్కరణ

ఏపీజేఏసీ అమరావతి భాగస్వామ్య సంఘాలైన రెవెన్యూ, కో ఆపరేటివ్, ఆర్టీసీ, రిటైర్డ్ హెడ్మాస్టర్ల సంఘాల డైరీలను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలోని వివిధ భాగస్వామ్య సంఘాల నేతలు బుధవారం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్యమంత్రికి అందజేశారు. 11వ పీఆర్సీలో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని, 12వ పీఆర్సీ కమిషనర్‌ను వీలైనంత త్వరగా నియమించాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో టీవీ ఫణి పేర్రాజు, దామోదరరావు, కె. సంగీతరావు, వీవీ రమణ, జనకుల శ్రీనివాసరావు, వీవీ మురళీకృష్ణ నాయుడు, నాగరాజు, పాలెలక్ష్మీ, పొన్నూరు విజయలక్ష్మి తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఏపీపీటీడీ ఎన్ఎంయూ సంఘం క్యాలండర్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. బుధవారం ఏపీపీటీడీ అగ్రనేతలు పీవీ రమణారెడ్డి, కోశాధికారి పీవీవీ మోహన్‌లు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.


పాత పింఛను ఇవ్వండి: సీపీఎస్‌ఈఏ

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 4 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులలో భరోసా నింపేలా పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం(ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావులు బుధవారం ఓ ప్రకటనలో ముఖ్యమంత్రిని కోరారు. గత పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల హెల్త్‌కార్డు కంటే కూడా ఆరోగ్య శ్రీ కార్డులు బాగా పనిచేస్తున్నాయని, తక్షణం నగదు రహిత హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు.

చిత్రజ్యోతి

SINCE 1965

నేడే షూటింగ్ ప్రారంభం





మహేశ్‌బాబు కథానాయకుడిగా దర్శక దిగ్గజం ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. వర్కింగ్ టైటిల్ 'ఎస్ఎస్ఎమ్‌బీ29'. దుర్గాఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్‌గా భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతుందా అని సినీ అభిమానులంతా ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు వారి నిరీక్షణకు తెరపడేలా ఉంది. నేడే ఈ సినిమాను హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభించనున్నట్లు తెలిసింది. కాగా, ఈ సినిమాకు 'గరుడ' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు టాక్. దాదాపు రూ.వెయ్యి కోట్లతో రెండు భాగాలుగా తెరకెక్కించే ఈ చిత్రంలో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రాని ఎంపిక చేసినట్లు వార్తలొచ్చాయి. మొదటి భాగాన్ని 2027లో.. రెండవ భాగాన్ని 2029లో విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

కేన్సర్ నుంచి కోలుకున్నా..



కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్ తన ఆరోగ్యం గురించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. ప్రస్తుతం అమెరికాలో చికిత్స తీసుకుంటున్న ఆయన.. కేన్సర్ నుంచి కోలుకున్నట్లు ఓ వీడియో విడుదల చేశారు. "కేన్సర్ సోకిందని తెలిస్తే ఎవరికైనా భయం సహజం. ఆ భయం నా నుంచి దూరం చేసేందుకు నా భార్య గీత, అభిమానులు అందించిన సహకారం మరువలేనిది. వారందరికీ రుణపడి ఉంటాను. చేతిలో ఉన్న సినిమాలు పూర్తిచేయడానికి చాలా కష్టపడ్డాను. ఓ వైపు కీమోథెరపీ చేయించుకుంటూనే '45' సినిమా షూటింగ్‌ను పూర్తి చేశాను. నా ఆరోగ్యం విషయంలో వైద్యులు అందించిన సహకారం మరువలేనిది. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. శివన్న భార్య గీత మాట్లాడుతూ "నా భర్త కేన్సర్‌ను జయించడం ఎంతో సంతోషాన్నిస్తోంది. ఆయన్ని అభిమానించే వారందరికీ ఇది తీపి కబురులాంటిది. త్వరలోనే కర్ణాటకకు తిరిగి వస్తాం" అని అన్నారు.





న్యూ ఇయర్.. న్యూ లుక్స్!



కొత్త సంవత్సరం ఆరంభమైంది. తెలుగు చిత్ర పరిశ్రమలో కొత్త ఆశలు, అంచనాలు కూడా మొదలయ్యాయి. ఇక సంవత్సరం తొలి రోజున కొత్త పోస్టర్లు, కొత్త లుక్స్ సందడి చేశాయి. చాలా రోజుల తర్వాత మళ్లీ పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు' చిత్రం కోసం 'మాట వినాలి' అంటూ ఓ పాట పాడారు. ఈ పాటను ఈ నెల 6న విడుదల చేస్తామంటూ చిత్ర నిర్మాణ సంస్థ ప్రత్యేక పోస్టర్ విడుదల చేసింది. అలాగే 'గేమ్ ఛేంజర్' సినిమాలో రామ్‌చరణ్, కియారా ఉన్న కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. రామ్ పోతినేని, భాగ్యశ్రీ కలసి నటిస్తున్న చిత్రంలోని హీరో హీరోయిన్ల ఫస్ట్ లుక్‌ను మైత్రీ మూవీస్ రిలీజ్ చేసింది. అలాగే నితిన్ నటిస్తున్న 'రాబిన్‌హుడ్', నాని నటిస్తున్న 'హిట్ 3', సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న 'జాక్' సినిమాల కొత్త స్టిల్స్ విడుదలయ్యాయి.







కీరవాణి గీతం.. ఇళయరాజా సంగీతం



రూపేష్ హీరోగా, రాజేంద్రప్రసాద్, అర్చన జంటగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'షష్టిపూర్తి'. ఇందులో ఆకాంక్ష సింగ్ కథానాయిక. ఈ సినిమా కోసం సంగీత దర్శకుడు కీరవాణి 'ఏదో ఏ జన్మలోదో ఈ పరిచయం' అంటూ ఓ పాటను రాయడం ఒక విశేషమైతే, ఇళయరాజా ఈ పాటకు స్వరపరచడం మరో విశేషం. ఇప్పటివరకూ 60కి పైగా పాటలను కీరవాణి రాసినా, ఇళయరాజా బాణీకి ఆయన పాట రాయడం ఇదే ప్రథమమని చిత్ర దర్శకుడు పవన్ ప్రభ చెప్పారు. చిత్రం షూటింగ్ పూర్తయి, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని, త్వరలో సినిమాను విడుదల చేస్తామనీ నిర్మాత రూపేశ్ చౌదరి చెప్పారు.

ఆసక్తి రేకెత్తించేలా...



రాజ్‌తరుణ్, రాశి సింగ్ నటిస్తున్న చిత్రం 'పాంచ్ మినార్'. బ్రహ్మాజీ, అజయ్ ఘోష్, శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రామ్ కడుముల దర్శకత్వంలో మాధవి, ఎమ్.ఎస్.ఎమ్.రెడ్డి నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. కార్ టాప్‌పై రిలాక్స్ అవుతున్నట్లు ఉన్న రాజ్‌తరుణ్ ట్రెండీ లుక్.. సూట్ కేస్‌లోని డబ్బులు గాల్లోకి ఎగరడం సినిమాపై ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నాయి.

గాంధీ బాటలో నడిచే బాలిక కథ



దర్శకుడు సుకుమార్ బండ్రెడ్డి తనయురాలు సుకృతి వేణి నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించారు. సుకుమార్ సతీమణి సబితా సమర్పకురాలిగా నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, శేష సింధూరావు నిర్మించారు. ఈ నెల 24న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకురాలు పద్మావతి మాట్లాడుతూ "గాంధీ సిద్ధాంతాల్ని ఆదర్శంగా తీసుకుని.. ఆయన బాటలో నడిచే ఓ పదమూడేళ్ల బాలిక కథ ఈ చిత్రం. తన పుట్టిన ఊరిని కాపాడుకోవడం కోసం ఈ బాలిక ఏం చేసిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సందేశాత్మక చిత్రం అందరి హృదయాలను కదిలిస్తుంది" అని చెప్పారు. కాగా, ఈ సినిమా ఇప్పటికే పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో పురస్కారాలు కైవసం చేసుకుంది. అలాగే, బాల నటిగా సుకృతి వేణి అవార్డు దక్కించుకోవడం విశేషం.

తెరపైకి ఒగ్గు కళ



తెలంగాణ జానపద కళా రూపం ఒగ్గు కళాకారుల జీవితాలు, వారి సంస్కృతి నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'బ్రహ్మాండ'. ఆమని, బలగం జయరాం, కొమరక్క, బన్నీ ప్రధాన తారాగణం. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేశ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తయిందని, ఈనెల చివరి వారంలో 'బ్రహ్మాండ' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని దర్శక నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి

ముత్యాల ముగ్గు

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్,
జూబ్లీ హిల్స్,
హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com



7 చుక్కలు
4 వచ్చేవరకు
సందుచుక్కలు



కె. రాములమ్మ, ఆత్మకూరు

కుండీలో కలబంద ఇలా...

కలబంద పలు అనారోగ్య సమస్యలకు ఔషధంలా పనిచేస్తుంది. సౌందర్య సాధనంగా కూడా కలబంద గుజ్జును వాడుతుంటాం. చర్మ వ్యాధులకు, కాలిన గాయాలకు, చుండ్రు నివారణకు, శిరోజాల పెరుగుదలకు, బరువు తగ్గడానికి ఈ మొక్కనే ఆశ్రయిస్తాం. ఇలా మనకు ఎన్నో రకాలుగా ఉపయోగపడే కలబంద మొక్కను ఇంట్లోనే సులభంగా పెంచుకోవచ్చు.



- కుండీలో మట్టి మరీ మెత్తగా కాకుండా మిశ్రమంగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే వేర్లు లోపలికి చొచ్చుకొని పోవడానికి వీలుగా ఉంటుంది. తోటమట్టిలో కొబ్బరి పీచు పొడి. తేలికపాటి సేంద్రీయ ఎరువు కలిపితే చాలు. ఈ రకం మట్టిలో కలబంద మొక్క తొందరగా నాటుకుంటుంది. అరటి పండు తొక్కను చిన్న ముక్కలు లేదంటే గుజ్జుగా చేసి మొక్క మొదట్లో వేస్తే పొటాషియం తదితర పోషకాలు అంది ఆకులు ఏపుగా పెరుగుతాయి. మట్టి కూడా సారవంతమవుతుంది. వెడల్పాటి కుండీలు మొక్క పెరుగుదలకు అనువుగా ఉంటాయి.
- కలబంద మొక్కకు ఎండ తగిలితే వేగంగా పెరుగుతుంది. కుండీలను బాల్కనీలో లేదంటే కిటికీ దగ్గర ఏర్పాటు చేసుకుంటే మొక్క గుబురుగా తయారవుతుంది. స్టడీ రూమ్ లేదా లివింగ్ రూమ్‌లో కుండీని ఉంచితే ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. కానీ అంత వేగంగా మొక్క పెరగదు. ఎక్కువ కాలం జీవించి ఉంటుంది.
- కలబంద మొక్కకు పక్క నుంచి పిలకలు వస్తుంటాయి. వీటిని వేరు చేసి వేరే కుండీల్లో నాటుకుంటే మొక్కలు బాగా పెరుగుతాయి.
- దీనికి ఎక్కువ నీరు అవసరం ఉండదు. కుండీలో నీళ్లు నిల్వ ఉండకుండా అడుగు భాగంలో రంధ్రం చేయండి. లేదంటే మొక్క చనిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ మొక్కకు నీళ్లు ఎక్కువగా పోస్తే ఆకులు పసుపు రంగులోకి మారతాయి. వాటిపై మచ్చలు కూడా వస్తాయి. మొక్క వాలిపోతుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే కుండీని ఎండలో ఉంచండి. కొన్ని రోజులు నీళ్లు పోయకండి. ఆకులు ముదురు గోధుమ రంగులోకి మారితే మాత్రం మొక్కకు నీళ్లు అవసరమని గుర్తుంచుకోండి.
- మందంగా ముదురు ఆకుపచ్చ రంగులో ఉన్న ఆకులను మాత్రమే అవసరానికి కోసుకోండి. లేతగా ఉన్న ఆకులను కోస్తే మొక్క పెరుగుదల ఆగిపోతుంది.

తాటిబెల్లం తింటే...

తాటిచెట్టు నుంచి లభించే నీరాను ఉడికించి తాటి బెల్లాన్ని తయారు చేస్తారు. ఇది తేనె రంగులో లేదా నల్లగా ఉంటుంది. మనం రోజూ ఉపయోగించే బెల్లం, పంచదారల్లో కంటే తాటి బెల్లంలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. దీనిలో కొవ్వులు, ప్రొటీన్లు అత్యల్పంగాను తేమ, సుక్రోజ్, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, పాస్పరస్, జింక్ లాంటివి అత్యధికంగాను ఉంటాయి. చలికాలంలో ప్రతిరోజూ ఒక చెంచా తాటిబెల్లం తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

శీతాకాల సమస్యలకు



- తాటిబెల్లం తిన్న వెంటనే శరీరంలో వేడి పెరుగుతుంది. దీని వల్ల చలికాలంలో వచ్చే కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. జలుబు, దగ్గు, ఆస్తమా, మైగ్రేన్ సమస్యలకు మంచి ఔషధంలా పనిచేస్తుంది. ఒక కప్పు గోరువెచ్చని పాలలో ఒక చెంచా తాటి బెల్లం పొడి, పావు చెంచా మిరియాల పొడి కలుపుకొని తాగితే ముక్కులోని శ్లేష్మం తొలగిపోతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఊపిరితిత్తుల పనితీరు మెరుగవుతుంది. తాటిబెల్లంలోని కాల్షియం, పొటాషియం, భాస్వరం ఎముకలను బలోపేతం చేస్తాయి.
- మహిళలు నెలసరి సమయంలో తాటిబెల్లం తింటే శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి పొత్తి కడుపు నొప్పి, కాళ్ల తిమ్మిర్లు, కడుపులో వికారం, నీరసం నుంచి ఉపశమనం కలిగిస్తాయి. తాటిబెల్లంలోని ఐరన్ రక్తహీనత రాకుండా కాపాడుతుంది. రక్తంలో హెమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది.

బరువు తగ్గడానికి

- తాటిబెల్లాన్ని తరచూ తింటూ ఉంటే శరీరంలో చేరే వ్యర్థ పదార్థాలన్నీ బయటికి వెళతాయి. శ్వాసకోశం, పేవులు, ఆహారనాళం, జీర్ణాశయం, కాలేయం, రక్తం పరిశుభ్రమవుతాయి. శరీరంలోని అదనపు నీటిని తొలగించి ఎలక్ట్రొలైట్లను సమతుల్యం చేస్తుంది. జీవక్రియలను వేగవంతం చేసి శరీర బరువును నియంత్రణలో ఉంచుతుంది.

జీర్ణక్రియకి

- తాటిబెల్లంలో పీచుపదార్థం అధికంగా ఉంటుంది. దీనివల్ల పేగు కదలికలు సజావుగా జరిగి మలబద్ధకం రాకుండా ఉంటుంది. భోజనం తరవాత చిన్న ముక్క తాటిబెల్లం తింటే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. తిన్న ఆహారపదార్థాలన్నీ తేలికగా జీర్ణమయ్యేలా చేస్తుంది. కడుపులో ఆమ్ల తత్వాన్ని నివారిస్తుంది.

చర్మానికి

- చలికాలంలో తాటిబెల్లం తినడం వల్ల చర్మం పొడిబారకుండా తేమతో నిండి ఆరోగ్యంగా కనిపిస్తుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచడంవల్ల ముఖంపై మొటిమలు, మచ్చలు, ముడతలు రావు. తాటిబెల్లంలోని గ్లైకోలిక్ యాసిడ్ చర్మానికి మంచి కాంతిని, నునుపుదనాన్ని అందిస్తుంది. దీనిలోని సి, బి విటమిన్లు చర్మానికి పోషణను అందిస్తాయి.

సంకల్పం



నాలుగు పదులు దాటిన వయసులో ఈత మొదలుపెట్టారు. కానీ నేడు గజ ఈతగాళ్లను మించిపోయారు. అలలకు ఎదురెళ్లి రికార్డులెన్నో బద్దలు కొట్టారు. యాభై ఒక్క ఏళ్ల వయసులో తాజాగా విశాఖ నుంచి కాకినాడకు బంగాళాఖాతంలో ఈత ప్రారంభించారు... గోలి శ్యామల. విరామ సమయంలో ఈ యాత్ర గురించి... ఒకప్పటి సాధారణ గృహిణి... ఇప్పుడు సాహసనారిగా మారిన ప్రస్థానం గురించి ఆమె 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

సప్తసాగరాలే లక్ష్యంగా..!

"ఈత కొలనులో నా ప్రయాణం చాలా విచిత్రంగా ప్రారంభమైంది. ఒకప్పుడు నాకు నీళ్లంటే చచ్చేంత భయం. అలాంటిది నేడు మహాసముద్రాల్లో ఈదేస్తున్నానంటే ఒక్కోసారి నాకే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. హార్మోన్ల అసమతుల్యత, వ్యాపారంలో నష్టంతో మానసిక ఒత్తిడుల నేపథ్యంలో తీవ్ర అనారోగ్యం పాలయ్యాను. కోమాలోకి వెళ్లాను. ఆసుపత్రి మంచం మీద గట్టి నిర్ణయం తీసుకున్నాను... తిరిగి హాస్పిటల్ గడప తొక్కకూడదని. అదే సమయంలో వేసవి శిబిరం జరుగుతుంటే వెళ్లాను. ఆరోగ్యకరమైన జీవనయానం కోసం ఈత ప్రారంభించాను. అలా అనూహ్యంగా మొదలైన ఈత నేడు నా జీవితంలో భాగమైపోయింది. ఎన్నో మైలు రాళ్లను దాటి... నాకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. మాది తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట అయినా రెండున్నర దశాబ్దాల కిందటే హైదరాబాద్‌లో స్థిరపడ్డాం.

అలా మొదలైంది...

మాకు ఒక యానిమేషన్ స్టూడియో ఉండేది. ఇంటి పనులతో పాటు స్టూడియో కూడా చూసుకొనేదాన్ని. ప్రొడ్యూసర్‌గా, క్రియేటివ్ డైరెక్టర్‌గా, రైటర్‌గా సొంతంగా చాలా యానిమేషన్ చిత్రాలు చేశాను. అందులో నష్టాలు రావడంతో స్టూడియో మూసేయాల్సివచ్చింది. అది నన్ను తీవ్ర మానసిక ఒత్తిడిలోకి నెట్టింది. దాంతోపాటు ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. వీటన్నిటి నుంచి బయటపడటానికి నేను ఎంచుకున్న మార్గమే స్విమ్మింగ్. ఈత కొలనులోకి దిగాక స్విమ్మింగ్‌పై ఇష్టం పెరిగింది. దీంతో పోటీల వైపు దృష్టి పెట్టి, సాధన మొదలుపెట్టాను. మూడు నెలలకే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. కాంస్య పతకం నెగ్గాను. అది నాలో ఆత్మవిశ్వాసం నింపింది. ఆ తరువాత నుంచి వెళ్లిన ప్రతి పోటీలో పతకాలు గెలుస్తూనే ఉన్నాను.

నిరుత్సాహపరిచినా...

ఈతలో మంచి నైపుణ్యం సాధించాక సాహస క్రీడలపై దృష్టి పెట్టాను. అందులో భాగంగానే 'ఓపెన్ వాటర్' ఈవెంట్‌లో పాల్గొన్నాను. ఇది జాతీయ స్థాయి పోటీ. 1.5 కిలోమీటర్లు. 2019లో విజయవాడ కృష్ణా నదిలో జరిగిన ఆ ఈవెంట్‌లో స్వర్ణ పతకం నెగ్గాను. ఆ తరువాత రెండేళ్లు కూడా తొలి స్థానం నాదే. ఓ ఆంగ్ల పత్రికలో ఇంగ్లిష్ చానల్ ఈదిన వ్యక్తి కథనం నాలో స్ఫూర్తి నింపింది. సప్త సముద్రాల్లో ఈత కొట్టాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. నా లక్ష్యం గురించి చెబితే సహచరులు తీవ్రంగా నిరుత్సాహపరిచారు. నా వయసుకు అంతటి సాహసం తగదని కొందరు సలహాలు ఇచ్చారు. అవేవీ పట్టించుకోలేదు. ఆత్మవిశ్వాసంతో అడుగులు వేశాను. అదే ఉత్సాహంతో అత్యంత క్లిష్టమైన బంగాళాఖాతంలోని పాక్ జలసంధిని ఈదాను.



ఘనతలు ఎన్నో...

నా ఈ ప్రస్థానంలో ఎన్నో అవార్డులు అందుకున్నాను. రికార్డులు అధిగమించాను. 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్సు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు, అబ్దుల్ కలాం వరల్డ్ రికార్డ్సు, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్సు'లో నా పేరు నమోదయింది. తెలంగాణా ప్రభుత్వం నుంచి 'అవుట్‌స్టాండింగ్ అచీవ్‌మెంట్' అవార్డు, 'వండర్ ఉమన్' అవార్డులు అందుకున్నాను. గత ఏడాది భారత్ ఒలింపిక్ సంఘం నుంచి కూడా పలు పురస్కారాలు నన్ను వరించాయి. ఇవన్నీ నాలో స్ఫూర్తి రగిలిస్తాయి.

శ్రీలంకలోని తలైమన్నారు నుంచి తమిళనాడులోని ధనుష్కోటి వరకు 30 కిలోమీటర్ల దూరం ఇది. ఈ ఘనత సాధించిన తొలి తెలుగు మహిళను నేనే. అది నాలో ఎనలేని స్ఫూర్తి నింపింది. అదే ఏడాది అమెరికాలోని 36 కిలోమీటర్ల కాటలినా చానల్‌ను ఈదాను.

ఆ స్ఫూర్తితో...

లక్షద్వీప్‌లో పర్యాటక అభివృద్ధికి ప్రధాని మోదీ ప్రచారం నాకు ప్రేరణనిచ్చాయి. దానికి నావంతు ప్రయత్నంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో లక్ష ద్వీప్‌లో కిల్తాన్ ద్వీపం నుంచి అరేబియా మహాసముద్రంలో 38 కిలోమీటర్ల దూరంలో ఉన్న కద్మత్ ద్వీపానికి ఈత కొట్టాను. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిని నేనే. లక్షద్వీప్ పర్యాటక శాఖ, ఇతరుల మద్దతుతో దీన్ని పూర్తి చేశాను. అంతకుముందు కోల్‌కతా భగీరథ నదిలో 81 కిలోమీటర్లు, బిహార్‌లోని గంగా నదిలో 13 కిలోమీటర్లు ఈదాను.

విశాఖ నుంచి కాకినాడకు...

ప్రస్తుతం విశాఖ నుంచి కాకినాడకు బంగాళాఖాతంలో 150 కిలోమీటర్లు ఈదడానికి సిద్ధమయ్యాను. దానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు తీసుకున్నాను. గత నెల 28న విశాఖ రామకృష్ణా బీచ్ వద్ద ఈ సాహస యాత్ర ప్రారంభమైంది. బుధవారానికి వంద కిలోమీటర్లు పూర్తయింది. వాతావరణం అనుకూలిస్తే ఈ నెల 4న పూర్తికావచ్చని అనుకొంటున్నాను. సముద్రంలో ఈతకు ప్రతికూల పరిస్థితులు ఎదురవడంవల్ల కాస్త ఆలస్యమైంది. ప్రతిరోజూ సూర్యోదయానికి ఈత ప్రారంభిస్తాను. సూర్యాస్తమయానికి ఆపేసి, రాత్రి విశ్రాంతి తీసుకొంటాను. నాకు సహకారంగా నేవీ బోటు వెంట వస్తోంది. గతంలో ఈ దారిలో ఈదినవారు ఎవరూ లేరు. నదులు ఈదేవారు కనిపిస్తుంటారు కానీ... మహాసముద్రాల్లో ఈదేవారు చాలా అరుదు. అదీ మహిళలు ఎవరూ లేరనే చెప్పాలి."

● ఆర్వీ రమణమూర్తి, సామర్లకోట

నేస్తాల అక్షర యజ్ఞం



"ఒకసారి సంపాదిస్తే మనతోనే ఉండేది, ఎవరూ తీసుకోలేనిదీ, ఎంత పంచినా తరగనిది విద్య మాత్రమే. ఎన్నో కారణాలతో విద్యకు దూరమవుతున్న వారిలో భరోసా కల్పించాలనే చిన్న ప్రయత్నం మాది" అంటారు అదితి శ్రీవత్సన్, నేహా గోవిందరాజన్. ఈ చెన్నై అమ్మాయిలు ఏర్పాటు చేసిన 'బ్లూ లిలాక్ ఫౌండేషన్'... పుస్తక విరాళాలు, ఇతర కార్యక్రమాలతో సర్కారు బడుల్లో చదివే అట్టడుగు వర్గాల పిల్లల వికాసానికి దోహదం చేస్తోంది.

"పుస్తకాలను విరాళంగా సేకరించి, పేద పిల్లలకు పంచాలనే ఆలోచనను నా స్నేహితురాలు అదితి శ్రీవత్సన్ చెప్పినప్పుడు... నేను సంకోచించాను. ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాలను చేపట్టడానికి తగినంత వయసు మాకు లేదనేది నా అభిప్రాయం. అప్పుడు అదితి "సమాజానికి ఏదైనా సేవ చెయ్యాలంటే ముప్పయ్యేళ్లో, నలభయ్యేళ్లో రానవసరం లేదు. మనస్ఫూర్తిగా చేసినప్పుడు ఎలాంటి అనుమానాలు అవసరం లేదు" అంది. 'నిజమే కదా!' అనిపించింది. ఆలస్యం చెయ్యకుండా మా 'బ్లూ లిలాక్ ఫౌండేషన్'కు శ్రీకారం చుట్టాం" అని గుర్తు చేసుకుంది నేహ గోవిందరాజన్. చెన్నైలో పుట్టి, పెరిగిన ఈ పదిహేడేళ్ల అమ్మాయిలిద్దరూ మంచి స్నేహితులు. ప్లస్ వన్ విద్యార్థులు. పుస్తకాలంటే ఇష్టం. కనీస చదువులకు నోచుకోని పేద పిల్లలను చూసి ఇద్దరూ బాధపడేవారు. ఎలాంటి సాయమైనా విద్యకు సంబంధించినదే చెయ్యాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. కిందటి ఏడాది వేసవి సెలవుల్లో... తమ ఆలోచనలకు ఒక రూపం ఇచ్చారు.

తాతయ్య స్ఫూర్తితో...

"చదువుకొనే స్తోమత లేనివారికి ఏదైనా సాయం చేయాలనేది ఒక్కరోజులో నాకు కలిగిన ఆలోచన కాదు. సామాజిక ఒత్తిడుల కారణంగా మా అమ్మమ్మ అయిదో తరగతితోనే చదువు ఆపేయాల్సి వచ్చింది. ఈ సంగతి నాతో ఎన్నోసార్లు చెప్పి బాధపడింది. బాగా చదువుకోవాలనే కోరిక ఉన్నా... కుటుంబ, ఆర్థిక పరిస్థితుల వల్ల, మౌలిక వనరులు లేకపోవడం వల్లా ఎందరో తమ కలను నెరవేర్చుకోలేకపోతున్నారనే వాస్తవం నన్ను కలవరపెట్టేది. అయితే నా వంతుగా ఏదో చెయ్యాలనే స్ఫూర్తి... రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ అధికారి అయిన మా తాతయ్య ఎ.ఆర్.శ్రీధర్ నుంచి పొందాను. "మనకు ఉన్నదాన్ని పదిమందితో పంచుకోవడం మన బాధ్యత" అని ఆయన చెప్పిన మాటలు నాలో నాటుకుపోయాయి. ఒక రోజు మా ఇంట్లో పాత పుస్తకాలను సర్దుతున్నప్పుడు... దాదాపు వందకు పైగా నా పాత తరగతుల పుస్తకాలు కనిపించాయి. అవన్నీ దుమ్ము కొట్టుకుపోయాయి. వాటిని అవసరం ఉన్నవారికి ఇస్తే ప్రయోజనం ఉంటుందనిపించింది" అంటోంది అదితి. నేహతో కలిసి ఆ పుస్తకాలను ఒక అనాథాశ్రమానికి తీసుకువెళ్ళింది. అక్కడ అట్టడుగువర్గాల అమ్మాయిలు కూడా ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఈ పుస్తకాలను స్నేహితులిద్దరూ పంచిపెట్టారు. ఆ పిల్లల్లో ఉత్సాహాన్ని, ఆనందాన్ని చూసిన తరువాత... ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళాలనుకున్నారు.



మొదట్లో భయపడినా...

తొలి ప్రయత్నంగా.. షోలింగనల్లూర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌కు వెళ్ళారు. పుస్తకాలు విరాళాలుగా ఇవ్వాలని కోరుతూ వాటి సేకరణ వెనుక ఉద్దేశాన్ని వివరించారు. ఎలాంటి స్పందన వస్తుందోనని మొదట భయపడ్డారు. కానీ అక్కడ నివసిస్తున్నవారు ఉత్సాహంగా స్పందించారు. తమ దగ్గర ఉన్న పాత పుస్తకాలు, తమకు అవసరం లేదనుకున్న పుస్తకాలు ఇచ్చారు. "కొద్ది రోజుల్లోనే 350 పుస్తకాలు వచ్చాయి. వాటిలో పాఠ్య పుస్తకాల నుంచి కాల్పనిక సాహిత్యం వరకూ ఉన్నాయి. వాటిని ఒక బాలికల పాఠశాలకు అందజేశాం. మా గురించి విన్న వారు పిలిచి మరీ పుస్తకాలు ఇవ్వడం ఆరంభించారు" అని చెప్పారు అదితి, నేహ.. క్రమంగా స్థానికంగా పనిచేసే సంస్థలు, ఇంటి యజమానుల సంఘాల్లో వారు భాగస్వాములయ్యారు. ఏడాది కాలంలో దాదాపు 4,700కు పైగా పుస్తకాలను పాఠశాలలకు అందజేశారు. వీటివల్ల 3,000 మందికి పైగా పిల్లలు ప్రయోజనం పొందుతున్నారు. అంతేకాదు, ఆరు లైబ్రరీల ఏర్పాటుకు కూడా ఈ స్నేహితులు దోహదం చేశారు.

ఆంగ్లం... ఆర్థికం

"ఇప్పుడు ఫౌండేషన్ కార్యకలాపాల పరిధిని విస్తరించాం. ప్రధానంగా రెండు అంశాల మీద దృష్టి పెట్టాం. అవి ఆంగ్ల భాషలో నైపుణ్యం, ఆర్థిక అక్షరాస్యత. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎంతోమంది పిల్లలు ఇంగ్లీష్ విషయంలో ఇబ్బంది పడుతున్నారు. తప్పులు మాట్లాడతామనే భయంతో మాట్లాడడానికి సందేహిస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచడం కోసం కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆంగ్ల సంభాషణా నైపుణ్యాలను పెంచడం కోసం విద్యావేత్తలతో కలిసి ఒక పాఠ్య ప్రణాళిక రూపొందించాం" అంటోంది అదితి. అలాగే "జీవితం సక్రమంగా సాగాలన్నా, సురక్షితమైన భవిష్యత్తు కావాలన్నా ఆర్థిక విషయాల్లో నైపుణ్యం ఎంతో ముఖ్యం. అందుకే ఇంటి బడ్జెట్, ఆదా చేసుకోవడం, ఆర్థిక మోసాల బారిన పడకుండా ఉండడం లాంటి అంశాలను బోధిస్తున్నాం" అని చెబుతోంది నేహ. 'బ్లూ లిలాక్ ఫౌండేషన్' చేపడుతున్న కార్యక్రమాలు పలువురు విద్యార్థులను ఆకర్షించాయి. వారు తమ పాఠశాలల్లో 'బుక్‌డ్రైవ్'లను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా మరింతమందికి పుస్తకాలు ఉచితంగా అందించడానికి వీలవుతోంది. "మా స్నేహితురాలు తనుశ్రీ... ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఫౌండేషన్ వ్యవహారాల్లో మాకు తోడుగా ఉంది. ఏడాది క్రితం ఫౌండేషన్‌ను ప్రారంభించినప్పుడు ఇంత స్పందన వస్తుందని మేమనుకోలేదు. ఇప్పుడు ఇదొక పూర్తిస్థాయి ఉద్యమంగా రూపుదిద్దుకుంది. అవసరం ఉన్న ప్రతి విద్యార్థికి సాయం అందించాలన్నది మా లక్ష్యం. దాని కోసం కృషి చేస్తాం" అని చెబుతున్నారు అదితి, నేహ.

కౌన్సెలింగ్

చలి కాలం పిల్లల రక్షణ

డాక్టర్! మా బాబుకు ఏడాది వయసు. చలి కాలంలో శ్వాసకోశ సమస్యలకు గురి కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఈ కాలంలో చల్లని వాతావరణం నుంచి ఎలా కాపాడుకోవాలి?

- ఓ సోదరి, హైదరాబాద్

చల్లని వాతావరణంలో వైరస్, బ్యాక్టీరియాలు విస్తృతంగా విస్తరించి ఉంటాయి. పైగా పసికందుల్లో వ్యాధినిరోధకశక్తి తక్కువ కాబట్టి తేలికగా ఇన్‌ఫెక్షన్లకు గురవుతూ ఉంటారు. శ్వాసకోశ సమస్యలతో పాటు, చెవికి సంబంధించిన ఇన్‌ఫెక్షన్లు, స్టమక్ ఫ్లూలు పసికందుల్లో సహజం.

ఆవిరి, సెలైన్ డ్రాప్స్ కీలకం

ఈ కాలంలో రాత్రుళ్లు గాలిలో తేమ పెరిగిపోతుంది కాబట్టి ముక్కులు మూసుకుపోయి, శ్వాస తీసుకోడానికి కష్టపడుతూ ఉంటారు. పాలు తాగడానికి కూడా ఇబ్బంది పడుతూ ఉంటారు. వేడినీటి ఆవిరితో ఈ సమస్య సులభంగానే తగ్గిపోతుంది. కాబట్టి ఆవిరి పట్టే డబ్బాను ఉపయోగించి, చేత్తో ఆ ఆవిరి బిడ్డ ముక్కు వైపు వెళ్లేలా చేయాలి. అలాగే నాసికా రంధ్రాల్లో ఒకట్రెండు చుక్కల సెలైన్ డ్రాప్స్ వేసి, ముక్కును సున్నితంగా మర్దన చేయాలి. ఇలా చేస్తే, ద్రవాలు గొంతులోకి జారి, పసికందులు వాటిని మింగేస్తారు కాబట్టి ముక్కు దిబ్బెడ వదిలి సునాయాసంగా ఊపిరి పీల్చుకోగలుగుతారు. చాలా మంది తల్లితండ్రులు యాంటీ హిస్టమిన్ మందులు, యాంటీబయాటిక్స్ స్వయంగా కొనేసి, పిల్లలకు వాడడం మొదలుపెట్టేస్తూ ఉంటారు. ఇలా వైద్యులను సంప్రతించకుండా సొంతగా యాంటీబయాటిక్స్ వాడడం వల్ల సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లను పెంచిన వాళ్లవుతారు. అలర్జీ తత్వం కలిగిన పిల్లల్లో ఈ కాలంలో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు పదే పదే వేధిస్తూ ఉంటాయి. ఇలాంటి పిల్లలకు పీడియాట్రిషియన్లు సూచించిన మందులనే వాడుకుంటూ, అలర్జీలను పెంచే అంశాలను గుర్తించి వాటి నుంచి రక్షణ కల్పించాలి. ఉదయాన్నే సమస్యలు పెరుగుతూ ఉంటే, వెంటనే మందుల వాడకం మొదలుపెట్టి, ఇన్‌ఫెక్షన్ తీవ్రతరం కాకుండా నియంత్రించాలి.



హీటర్లు వాడకూడదు

చలికాలం పసికందులకు వెచ్చదనం కోసం మందపాటి స్వెటర్లు, దుప్పట్లు వాడుకోవాలి. చాలామంది పడగ్గదుల్లో హీటర్లను వాడుతూ ఉంటారు. కానీ విపరీతమైన చలితో కూడా ఢిల్లీ, కాశ్మీరు లాంటి ప్రాంతాల్లోనే వీటిని వాడుకోవాలి. చలి మధ్యస్తంగా ఉండే దక్షిణ భారతదేశంలో ప్రత్యేకించి పసికందుల కోసం హీటర్లను వాడుకోవలసిన అవసరం లేదు. వీటిని వాడడం వల్ల గాల్లోని తేమ మొత్తం మాయమైపోయి, పిల్లల ముక్కులోని స్రావాలు పొడిబారి, ముక్కు దిబ్బెడ మరింత పెరిగిపోతుంది. శ్వాస తీసుకోవడం కూడా మరింత సమస్యగా మారుతుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- ఐదేళ్ల కంటే చిన్న వయసు పిల్లలకు ఏడాదికోసారి ఇన్‌ఫ్లూయెంజా వ్యాక్సిన్ వేయించాలి
- తరచూ దగ్గు, జలుబుకు గురయ్యే పిల్లల్లో చెవి ఇన్‌ఫెక్షన్లు కూడా పెరుగుతాయి. ఆవిరి పట్టడం, యాంటీ హిస్టమిన్లతో ఈ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కాబట్టి యాంటీబయాటిక్స్ వాడకూడదు.
- చలికాలంలో పిల్లలకు ఫుడ్ పాయిజనింగ్ అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి బయటి పదార్థాలు తినకుండా పిల్లలను కట్టడి చేయాలి
- చర్మం తేమగా ఉండడం కోసం స్నానానికి ఒకటి రెండు గంటల ముందు స్వచ్ఛమైన కొబ్బరినూనెతో మర్దన చేయించాలి
- పసికందులకు రోజుకు ఒక్కసారి స్నానం చేయిస్తే సరిపోతుంది
- పసికందుల స్నానానికి ఆల్కలైన్ పిహెచ్‌కు బదులుగా న్యూట్రల్ పిహెచ్ కలిగిన సబ్బులు వాడుకోవాలి.

డాక్టర్ సి.వి.ఎస్ లక్ష్మి,
సీనియర్ నియోనటాలజిస్ట్ అండ్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్, క్లౌడ్ నైన్ హాస్పిటల్స్, కొంపల్లి, హైదరాబాద్

స్పోర్ట్స్

పంత్‌పై వేటు.. గిల్‌కు చోటు?



సిడ్నీ: భారత్.. కొత్త ఏడాదిని విజయంతో ఆరంభించాలనుకొంటోంది. సిడ్నీలో జరిగే ఆఖరి టెస్టులో నెగ్గితే భారత్ 2-2తో సిరీస్‌ను సమం చేసే అవకాశం ఉంది. ఐదో మ్యాచ్ శుక్రవారం మొదలు కానుండగా.. చివరి రెండు రోజులు వర్షం కురవవచ్చని వాతావరణ శాఖ చెబుతోంది. ఇక నాలుగో టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్‌కు అవకాశం కల్పించాలని మేనేజ్‌మెంట్ భావిస్తోందట. అదే జరిగితే రోహిత్ లేదా కోహ్లీలో ఒకరు బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి. మరోవైపు నిర్లక్ష్యమైన షాట్లతో వికెట్ పారేసుకొంటున్న రిషభ్ పంత్, రాణించలేక పోతున్న పేసర్ సిరాజ్‌ను హెచ్చరించే విధంగా బెంచ్‌కే పరిమితం చేస్తారనే ఊహాగానాలు వెలువడుతున్నాయి.

వైశాలి..కాంస్య పతకధారి

వరల్డ్ బ్లిట్జ్ చెస్‌లో మూడోస్థానం

ఓపెన్ సంయుక్త విజేతలు కార్ల్‌సన్, నెపోమ్నియాచి



న్యూయార్క్ : ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌ను భారత్ ఘనంగా ముగించింది. బ్లిట్జ్ విభాగంలో మరో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.వైశాలి కాంస్య పతకంతో మురిసింది. తెలుగు తేజం కోనేరు హంపి ర్యాపిడ్ విభాగంలో స్వర్ణ పతకంతో అదరగొట్టిన విషయం విదితమే. ఇక పురుషుల విభాగంలో ప్రపంచ నెంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్, రష్యా గ్రాండ్‌మాస్టర్ ఇయాన్ నెపోమ్నియాచి సంయుక్త విజేతలుగా నిలిచారు. మహిళల కేటగిరీ..క్వార్టర్‌ఫైనల్లో చైనా క్రీడాకారిణి జు జినెర్‌ను 2.5-1.5తో ఓడించిన వైశాలి సెమీస్‌లో అదే స్థాయిలో రాణించలేకపోయింది. చైనాకే చెందిన జు వెన్‌జున్ చేతిలో 0.5-2.5తో వైశాలి సెమీఫైనల్లో ఓటమి చవిచూసింది. ఆమె కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వెన్‌జున్ బ్లిట్జ్ టైటిల్ కైవసం చేసుకుంది. ఫైనల్లో సహచరి లీ టింగ్‌జీపై 3.-5-2.5తో నెగ్గిన జున్ స్వర్ణం దక్కించుకుంది. లీ టింగ్‌జీ రజతానికి పరిమితమైంది. కాగా వైశాలి తమ్ముడు ప్రజ్ఞానంద కూడా ఈ పోటీల్లో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. కాంస్య పతకం చేజిక్కించుకున్న తమిళనాడు అమ్మాయి వైశాలిని ఐదుసార్లు ప్రపంచ చాంపియన్, అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఉపాధ్యక్షుడు విశ్వనాథన్ ఆనంద్ అభినందించాడు.

మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పాల్పడ్డారా ?



కార్ల్‌సన్, నెపోమ్నియాచి సంయుక్త విజేతలుగా నిలవడం దుమారం రేపుతోంది. వీరిద్దరూ మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఫైనల్ సందర్భంగా వేదిక వెనుక.. మాగ్నస్-ఇయాన్ మాట్లాడుకున్న వీడియో ఒకటి ఆ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. 'ఇద్దరినీ సంయుక్త విజేతలుగా ఫిడే ప్రకటించేలా చిన్నపాటి డ్రాలతో గేమ్‌లను ముగిద్దాం' అని నెపోమ్నియాచితో కార్ల్‌సన్ అనడం ఆ వీడియోలో స్పష్టంగా వినిపించింది.

కార్ల్‌సన్-నెపోమ్నియాచికి స్వర్ణం..

బ్లిట్జ్ ఓపెన్ విభాగం స్వర్ణ పతకాన్ని కార్ల్‌సన్, ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ ఇయాన్ నెపోమ్నియాచి సంయుక్తంగా అందుకున్నారు. ఫైనల్లో తొలి రెండు గేమ్‌లను కార్ల్‌సన్ గెలిచాడు. దాంతో మరో గేమ్‌ను అతడు డ్రా చేసుకుంటే టైటిల్ సొంతమయ్యేది. కానీ పుంజుకున్న నెపోమ్నియాచి తదుపరి రెండు గేమ్‌లలో గెలుపొందాడు. దాంతో 2-2తో స్కోరు సమమైంది. ఈనేపథ్యంలో మూడు గేమ్‌ల సడన్ డెత్‌ను నిర్వహించారు. అవి కూడా డ్రా కావడంతో సంయుక్త టైటిల్‌కోసం కార్ల్‌సన్ ప్రతిపాదించాడు. దానికి నెపోమ్నియాచి కూడా అంగీకరించాడు. ఫలితంగా..వారిద్దరిని సంయుక్త విజేతలుగా ప్రకటించారు. బ్లిట్జ్ టైటిల్ ఇలా ఇద్దరికీ కలిపి ఇవ్వడం టోర్నీ చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. కార్ల్‌సన్ ఎనిమిదోసారి బ్లిట్జ్ చాంపియన్‌గా నిలవగా, నెపోమ్నియాచికి ఇదే మొదటి టైటిల్.

మాగ్నస్ మరో వివాదం..

కార్ల్‌సన్ మరోసారి వివాదానికి కేంద్ర బిందువయ్యాడు. బ్లిట్జ్ విభాగం తొలి రౌండ్‌లో గ్రాండ్‌మాస్టర్ మైకేల్ బెజోల్డ్ (జర్మనీ)తో కార్ల్‌సన్ తలపడ్డాడు. మూడు నిమిషాల ఆ గేమ్‌కు మాగ్నస్ ఒక నిమిషం 11 సెకన్లు ఆలస్యంగా వచ్చి వివాదాస్పదుడయ్యాడు. కొత్త జీన్స్ కొనుక్కోవడంలో ఆలస్యమైందని మాగ్నస్ చెప్పాడు. కాగా టోర్నమెంట్ ర్యాపిడ్ విభాగం పోటీలకు డ్రెస్ కోడ్‌ను ఉల్లంఘించి జీన్స్ వేసుకొని రావడంతో కార్ల్‌సన్‌ను నిర్వాహకులు బహిష్కరించిన విషయం విదితమే.

గంభీర్‌కు గండం



కొందరు ఆటగాళ్ల అసంతృప్తి

నిశితంగా పరిశీలిస్తున్న భారత బోర్డు

సిడ్నీ: కొన్నేళ్లుగా భారత క్రికెట్‌కు మూలస్తంభాలుగా ఉన్న రోహిత్ శర్మ, కోహ్లీ త్వరలో రిటైర్మెంట్ ప్రకటిస్తారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. భారత జట్టు సంధి దశలో ఉన్న కీలక సమయంలో కోచ్ గౌతమ్ గంభీర్, సహాయ సిబ్బంది భవిష్యత్ సవాళ్లకు తగినట్టుగా టీమిండియాను ఎలా నడిపిస్తారనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గామారింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో సమతుల్యమైన జట్టును ఎంపిక చేయడం సంక్లిష్టంగా మారింది. సిరీస్ చేజారకుండా ఉండాలంటే సిడ్నీలో జరిగే ఐదో టెస్ట్‌లో భారత్ నెగ్గి తీరాల్సిందే. కాగా, వరుస వైఫల్యాల నేపథ్యంలో టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో అనిశ్చితి నెలకొందనే టాక్ రోజురోజుకూ పెరుగుతోంది. జట్టులోకి ఎక్కువ మంది ప్లేయర్లతో గంభీర్‌కు శ్రుతి కుదరడం లేదనే ప్రచారం సాగుతోంది. రవిశాస్త్రి, ద్రవిడ్ తరహాలో ఆటగాళ్లతో సమాచార మార్పిడి సజావుగా జరగడం లేదనేది ప్రముఖంగా వినిపిస్తున్న ఆరోపణ. సీనియర్లు కాకుండా.. ఈ మధ్య కాలంలో జట్టులో చోటును సుస్థిరం చేసుకొన్న కొందరు క్రికెటర్లు గౌతీ తీరుపై అసంతృప్తిగా ఉన్నారని సమాచారం.

అలా జరిగితే.. ఉద్వాసనే?

'మరో టెస్ట్ ఆడాల్సి ఉంది. ఆ తర్వాత చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్. టీమిండియా ప్రదర్శన మెరుగుపడకపోతే మాత్రం కోచ్‌గా గంభీర్ పోస్టు ప్రమాదంలో పడినట్టే'నని బోర్డు అధికారి ఒకరు చెప్పారు. మరోవైపు ప్రయోగాలు చేస్తుండడంతో జట్టులోని ఆటగాళ్లు కూడా అభద్రతా భావానికి లోనవుతున్నారని తెలుస్తోంది. బీసీసీఐలో ఖాళీ అయిన పదవులు భర్తీ అయిన తర్వాత.. భారత జట్టుపై కొన్ని నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉంది. చాంపియన్స్ ట్రోఫీలో జట్టు ప్రదర్శన మెరుగుపడకపోతే మాత్రం గంభీర్‌కు ఉద్వాసన తప్పదని అంటున్నారు. 'గౌతీ ఎప్పుడూ మా మొదటి ప్రాధాన్యం కాదు. ఆ లిస్ట్‌లో వీవీఎస్ లక్ష్మణ్ ముందున్నాడు. దీంతో కొంత రాజీపడి, తప్పని పరిస్థితుల్లో అతడి నియామకం చేయాల్సి వచ్చింద'ని ఆ అధికారి చెప్పారు. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైనప్పుడే గౌతీని నిలదీశారు. ఇక ఈ సిరీస్‌లో కోహ్లీ వరుస వైఫల్యాలకు గౌతీ ఏదైనా సమాధానం వెతకగలడా? అనే ప్రశ్న అన్ని వర్గాల నుంచి ఎదురవుతోంది. అంతేకాకుండా ఓ సహాయ కోచ్‌కు చెందిన సహాయకుడు ఫ్రాంచైజీ జెర్సీలో మ్యాచ్ ముగిసిన తర్వాత ప్లే ఏరియాలోకి రావడంతోపాటు బీసీసీఐకు కేటాయించిన బాక్స్‌లో కనిపించడంపై కూడా బోర్డు పెద్దలు ఆరాతీస్తున్నట్టు సమాచారం.

ప్రశ్నించనున్న బీసీసీఐ

సిరీస్ మధ్యలో అశ్విన్ హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించడంపై రోహిత్, గౌతీని బీసీసీఐ ప్రశ్నించే అవకాశం ఉన్నట్టు సమాచారం. అవమానాలు తట్టుకోలేకే అశ్విన్ వెళ్లిపోయాడన్న ఊహాగానాలు ఉన్నాయి.

చేసింది ఇక చాలు..

నాలుగో టెస్ట్ ఓడిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌కు వచ్చిన ఆటగాళ్లపై గంభీర్ ఫైర్ అయినట్టు వార్తలు వస్తున్నాయి. 'ఇక..చేసింది చాలు' అని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు ఓ చానెల్ తెలిపింది. పరిస్థితులకు తగ్గట్టుగా ఆడకుండా.. తమ సహజ శైలిలో ఆడితే ఎలా? అని కూడా ప్రశ్నించినట్టు తెలుస్తోంది. మొత్తంగా గౌతీ వ్యూహాలకు.. మైదానంలో వారు ఆడే తీరుకు పొంతన లేదని అంటున్నారు. ఒకరకంగా అందరినీ గౌతీ ఘాటుగానే హెచ్చరించాడని సమాచారం. చటేశ్వర్ పుజారను జట్టులోకి తీసుకోవాలని కూడా గంభీర్ ప్రతిపాదించినా.. సెలెక్టర్లు ఒప్పుకోలేదట.

నితీష్...ఓ జీనియస్

» ఆసీస్ మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్



మెల్‌బోర్న్: తెలుగు కుర్రాడు నితీష్ కుమార్‌ను ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ పొగడ్తలతో ముంచెత్తాడు. 'నితీష్ ఓ జీనియస్. 21 ఏళ్ల వయసులోనే ఈ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలవడాన్ని నమ్మలేకపోతున్నా. సిరీస్ మొత్తం ఏమ్రాతం అంచనాలు లేకున్నా అదరగొట్టి, అందరినీ ఆకట్టుకున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో అతడికి ఎవరన్నా భయం లేదు. టెయిలెండర్లతో కలిసి అద్భుతంగా ఆడాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో తానేంటో నిరూపించుకున్నాడు. నితీష్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపించాలి. ఆరో స్థానం అతడికి సరిపోతుంది' అని క్లార్క్ అభిప్రాయపడ్డాడు.

జస్‌ప్రీత్ కెరీర్ ఉత్తమ రేటింగ్

దుబాయ్: ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా కెరీర్ ఉత్తమ రేటింగ్ పాయింట్లను సొంతం చేసుకున్నాడు. బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లోని మెల్‌బోర్న్ టెస్టులో తొమ్మిది వికెట్లు తీసిన అనంతరం బుమ్రా 907 పాయింట్లతో బౌలర్ల ర్యాంకింగ్స్‌లో తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. భారత బౌలర్లలో ఇప్పటి వరకు అత్యుత్తమ రేటింగ్ జాబితాలో ముందు ఉన్న మాజీ స్పిన్నర్ అశ్విన్‌ను బుమ్రా తాజాగా అధిగమించాడు. ప్రస్తుత ర్యాంకింగ్స్‌లో బుమ్రా టాప్‌లో నిలవగా, ఆసీస్ బౌలర్లు హాజెల్‌వుడ్, పాట్ కమిన్స్ చెరో స్థానం మెరుగై వరసగా రెండు, మూడు ర్యాంక్‌లను దక్కించుకున్నారు. బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో యశస్వి జైస్వాల్ ఒక స్థానం ఎగబాకి నాలుగో ర్యాంక్‌కు చేరుకున్నాడు. నితీష్ 20 స్థానాలు మెరుగై 53వ ర్యాంక్‌లో నిలిచాడు.

బుమ్రాను నిరోధించేలా చట్టం

ఆసీస్ ప్రధాని అల్బనీస్ సరదా వ్యాఖ్య





సిడ్నీ : ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్..నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆసీస్, భారత జట్లకు ఇక్కడి తన అధికారిక నివాసంలో బుధవారం విందు ఇచ్చారు. సిరీస్ నాలుగు టెస్ట్‌ల్లో ఇప్పటికే 30 వికెట్లతో 'కంగారె'త్తిస్తున్న బుమ్రా ప్రదర్శనను ఆయన తెగ మెచ్చుకున్నారు. 'అతడు ఎడమ చేతితో బౌలింగ్ చేయాలని లేదా ఒక అడుగు వెనక్కు వేయాలని చట్టం చేస్తాం' అని ఆస్ట్రేలియా క్రికెటర్లతో అల్బనీస్ సరదాగా అన్నారు. భారత కోచ్ గంభీర్ మాట్లాడుతూ..'ఆస్ట్రేలియా అందమైన దేశం. అయితే ఆ దేశంతో ఆడడం కష్టం. చివరి టెస్ట్‌లో మెరుగైన ప్రదర్శన చేసి రంజింపజేస్తాం' అని అన్నాడు.

చాలెంజర్ ట్రోఫీకి తెలుగమ్మాయిలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బీసీసీఐ సీనియర్ మహిళల వన్డే చాలెంజర్ ట్రోఫీకి ఆరుగురు తెలుగు క్రికెటర్లు ఎంపికయ్యారు. ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు ఈ టోర్నీ చెన్నై వేదికగా జరగనుంది. ఆంధ్ర నుంచి వికెట్‌కీపర్ ఎం.దుర్గ (ఇండియా-ఎ), జి.శరణ్య (ఇండియా-బి), హెన్రీటా (ఇండియా-సి), ఎ.వాసవీ పావని (ఇండియా-ఈ), తెలంగాణ నుంచి వికెట్‌కీపర్ మమత (ఇండియా-ఎ), యశశ్రీ (ఇండియా-సి)లకు చోటు లభించింది.

వినోద్ కాంబ్లీ డిశ్చార్జ్



ముంబై: అనారోగ్య సమస్యలతో ఆస్పత్రి పాలైన భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ కోలుకుని ఇంటికి తిరిగొచ్చాడు. గత నెల 21వ తేదీన ఆస్పత్రిలో చేరిన కాంబ్లీ బుధవారం డిశ్చార్జ్ అయ్యాడు. మద్యానికి దూరంగా ఉండాలని యువతను కోరాడు.

బిజినెస్

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.77 లక్షల కోట్లు

డిసెంబరులో 7.3% పెరుగుదల

» తెలంగాణలో రూ.5,224 కోట్లు..

» ఏపీలో రూ.3,315 కోట్ల రాబడి



న్యూఢిల్లీ: డిసెంబరు నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు రూ.1.77 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2023 డిసెంబరు నెలలో వసూలైన రూ.1.65 లక్షల కోట్లతో పోలిస్తే రాబడి 7.3 శాతం పెరిగింది. బుధవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. జీఎస్‌టీ వసూళ్లలో సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.32,836 కోట్లుండగా.. స్టేట్ జీఎస్‌టీ రూ.40,499 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.47,783 కోట్లు, సెస్సు రూ.11,471 కోట్లుగా ఉన్నాయి. గత నెలలో దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్‌టీ ఆదాయం 8.4 శాతం పెరిగి రూ.1.32 లక్షల కోట్లకు చేరుకుంది. దిగుమతులపై విధించిన పన్ను ద్వారా సమకూరిన రాబడి దాదాపు 4 శాతం పెరిగి రూ.44,268 కోట్లకు చేరింది. ఇక నవంబరులో జీఎస్‌టీ వసూళ్లు 8.5 శాతం వార్షిక వృద్ధితో రూ.1.82 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2024 ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.2.10 లక్షల కోట్లకు పైగా ఆదాయం నమోదైంది. కాగా, గతనెలలో రూ.22,490 కోట్ల రిఫండ్స్‌ను జారీ చేశారు. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇందులో 31 శాతం వృద్ధి నమోదైంది. రిఫండ్స్‌ను సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 3.3 శాతం వృద్ధితో రూ.1.54 లక్షల కోట్లకు చేరాయి. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, గతనెల తెలంగాణలో జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపతికన 10 శాతం వృద్ధి చెంది రూ.5,224 కోట్లకు పెరగగా.. ఆంధ్రప్రదేశ్‌లో వసూళ్లు 6 శాతం తగ్గి రూ.3,315 కోట్లకు పరిమితమయ్యాయి.

సరకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు సరకు రవాణాలో సరికొత్త రికార్డు సృష్టించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి 60.28 మిలియన్ టన్నులు సరకు రవాణా చేసింది. పోర్టు ఏర్పాటైన తొమ్మిది దశాబ్దాలలో ఇదే అత్యధికం. పోర్టులో సరకు రవాణాను వేగవంతం చేయడానికి అత్యాధునిక సాంకేతిక పరికరాలు సమకూర్చారు. అందులో భాగంగా 100 ఎంటీ క్రేన్, రియల్ టైమ్ కార్గో మానిటరింగ్ వ్యవస్థతో అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. దాంతోనే ఇది సాధ్యమైందని పోర్టు చైర్మన్ అంగముత్తు వెల్లడించారు. పోర్టులో మరింత మెకనైజేషన్ కోసం టెర్మినళ్లను ఆధునికీకరిస్తున్నారు. రహదారులను పది వరుసలకు విస్తరించనున్నామని, అంతర్గత ఫ్లైఓవర్ల నిర్మాణం చేపడతామని సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు.

ఇక దేశీయ యూజర్లందరికీ 'వాట్సాప్ పే' సేవలు!

10 కోట్ల యూజర్ల పరిమితి ఎత్తివేత

న్యూఢిల్లీ: ప్రముఖ సామాజిక మాధ్యమం వాట్సాప్‌కు చెందిన వాట్సాప్ పే కొత్త యూజర్ల చేరికపై పరిమితిని తక్షణమే ఎత్తివేస్తున్నట్లు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది. తద్వారా వాట్సాప్ తన భారత యూజర్లందరికీ యూపీఐ సేవలందించేందుకు వీలు కలుగనుంది. గతంలో ఎన్‌పీసీఐ వాట్సాప్ పే యూపీఐ సేవలను దశలవారీగా విస్తరించేందుకు, గరిష్ఠంగా 10 కోట్ల మందిని మాత్రమే చేర్చుకునేందుకు అనుమతిచ్చింది. తాజాగా ఆ పరిమితిని ఎత్తివేసింది. వాట్సాప్‌కు భారత్‌లో 50 కోట్లకు పైగా వినియోగదారులున్నారు. కాగా, డిజిటల్ చెల్లింపుల సేవల్లో గుత్తాధిపత్యాన్ని నిరోధించేందుకు థర్డ్ పార్టీ యూపీఐ యాప్స్‌కు 30 శాతం మార్కెట్ వాటా పరిమితి విధించాలని ఎన్‌పీసీఐ గతంలోనే నిర్ణయించింది. దీన్ని అమలు చేసేందుకు గడువును 2026 డిసెంబరు 31 వరకు పొడిగించింది.

టాప్‌గేర్‌లో ఆటో

2024లో 43 లక్షల కార్ల విక్రయం

ప్రయాణికుల వాహన రంగం కొత్త రికార్డు



న్యూఢిల్లీ: గత ఏడాది (2024) దేశంలో ప్రయాణికుల వాహనాల టోకు విక్రయాలు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 43 లక్షల యూనిట్లకు పెరిగాయి. మార్కెట్ దిగ్గజం మారుతి సుజుకీతో పాటు హ్యుండయ్, టాటా మోటార్స్, టయోటా కిర్లోస్కర్ మోటార్స్ (టీకేఎం), కియా అత్యుత్తమ వార్షిక అమ్మకాలను నమోదు చేశాయి. ఎస్‌యూవీలకు డిమాండ్ క్రమంగా పెరుగుతుండటంతో పాటు గ్రామీణ మార్కెట్లో పుంజుకుంటున్న గిరాకీ విక్రయాల జోరుకు దోహదపడ్డాయి. 2023లో వాహనాల టోకు అమ్మకాలు 41.1 లక్షల యూనిట్ల స్థాయిలో ఉన్నాయి. 2023తో పోలిస్తే 2024లో అమ్మకాలు 4.5-4.7 శాతం స్థాయిలో పెరిగాయని మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు. మారుతి సుజుకీ సైతం 2024లో ఆల్‌టైం గరిష్ఠ టోకు, రిటైల్ విక్రయాలను నమోదు చేసిందన్నారు. వార్షిక టోకు విక్రయాల రికార్డును మారుతి ఆరేళ్ల తర్వాత బద్దలు కొట్టిందని ఆయన చెప్పారు. 2024లో కంపెనీ టోకు విక్రయాలు 17,90,977 యూనిట్లకు చేరుకున్నాయని, దాంతో 2018లో నమోదైన 17,51,919 యూనిట్ల గత రికార్డును అధిగమించామని ఆయన తెలిపారు. రిటైల్ అమ్మకాల విషయానికొస్తే, 2024లో 17,88,405 యూనిట్ల విక్రయాలతో కంపెనీ సరికొత్త రికార్డు సృష్టించిందని చెప్పారు. 2023లో నమోదైన 17,26,661 యూనిట్ల విక్రయాల గత రికార్డును తుడిచిపెట్టింది. కాగా, డిసెంబరులో మారుతి సుజుకీ దేశీయ విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 24.18 శాతం వృద్ధితో 1,30,117 యూనిట్లుగా నమోదయ్యాయి.

ఎస్‌యూవీల్లో హ్యుండయ్ హవా

దేశంలో రెండో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ విక్రయాలు సైతం 2024లో సరికొత్త జీవనకాల గరిష్ఠం 6,05,433 యూనిట్లకు పెరిగాయి. 2023లో కంపెనీ 6,02,111 కార్లు విక్రయించింది. గత ఏడాది వాహన మార్కెట్లో అమ్ముడైన మొత్తం ఎస్‌యూవీల్లో 67.6 శాతం తమ కంపెనీవేనని హ్యుండయ్ వెల్లడించింది. గతనెలలో మాత్రం హ్యుండయ్ అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన 1.3 శాతం తగ్గి 42,208 యూనిట్లకు పరిమితమయ్యాయి.

- 2024లో టాటా మోటార్స్ టోకు విక్రయాలు సరికొత్త రికార్డు స్థాయి 5.65 లక్షల యూనిట్లకు ఎగబాకాయి. టాటా మోటార్స్ రికార్డు వార్షిక విక్రయాలను నమోదు చేయడం వరుసగా ఇది నాలుగోసారి. గత నెలలో కంపెనీ సేల్స్ 1 శాతం వృద్ధితో 44,289 యూనిట్లుగా నమోదయ్యాయి.
- టయోటా సైతం గత ఏడాదిలో అత్యుత్తమ వార్షిక విక్రయాల రికార్డును నమోదు చేసింది. 2023లో నమోదైన 2,33,346 యూనిట్లతో పోలిస్తే, 2024లో 40 శాతం వృద్ధితో 3,26,329 యూనిట్ల అమ్మకాలు జరిపింది. ఎస్‌యూవీ, ఎంపీవీ విభాగాలు ఇందుకు ప్రధానంగా దోహదపడ్డాయని టయోటా సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ల విభాగ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు.
- గత ఏడాది కియా ఇండియా సేల్స్ 6 శాతం పెరిగి 2,55,038 యూనిట్లకు చేరాయి. 2023లో కంపెనీ 2,40,919 యూనిట్ల అమ్మకాలు జరిపింది.
- మహీంద్రా అండ్ మహీంద్రా టోకు అమ్మకాలు గతనెలలో 18 శాతం వృద్ధితో 41,424 యూనిట్లకు చేరగా.. జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా సేల్స్ 55 శాతం పెరిగి 7,516 యూనిట్లుగా నమోదయ్యాయి. గతనెలలో కంపెనీ రికార్డు ఈవీ విక్రయాలను నమోదు చేసిందని, మొత్తం సేల్స్‌లో 70 శాతం వాటా వీటిదేనని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ తెలిపింది. కాగా, గతనెలలో నిస్సాన్ మోటార్ హోల్ సేల్స్ 51.42 శాతం పెరిగి 11,676 యూనిట్లకు చేరాయి.
- గత ఏడాది దేశీయ విక్రయాలు 18.55 శాతం వృద్ధితో 68,650 యూనిట్లకు పెరిగాయని హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ తెలిపింది. ఎగుమతులు మాత్రం రెండింతలకు పైగా పెరిగి 63,221 యూనిట్లకు చేరాయంది.
- లగ్జరీ కార్ల కంపెనీ ఆడీ గత ఏడాదిలో 5,816 యూనిట్లను విక్రయించింది. 2023లో నమోదైన 7,931 యూనిట్లతో పోలిస్తే, 2024లో సేల్స్ 26.6 శాతం తగ్గాయి. సరఫరా సమస్యలు ఇందుకు కారణమని కంపెనీ పేర్కొంది.

కొత్త ఏడాదికి శుభారంభం

సెన్సెక్స్ 368 పాయింట్లు అప్

ముంబై: స్టాక్ మార్కెట్ కొత్త ఏడాది తొలి రోజే లాభాల బాట పట్టింది. బుధవారం ఉదయం నష్టాలతో ప్రారంభమైన సూచీలు కొద్ది సేపటికే లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ 368.40 పాయింట్ల లాభంతో 78,507.41 వద్ద, నిఫ్టీ 98.10 పాయింట్ల లాభంతో 23,742.90 వద్ద ముగిశాయి. దీంతో రెండు రోజుల వరుస నష్టాలకు బుధవారం బ్రేక్ పడింది. ఇంట్రా డేలో సెన్సెక్స్ 617.48 పాయింట్ల లాభంతో 78,756.49 గరిష్ఠ స్థాయిని తాకింది. డిసెంబరు నెల కార్ల అమ్మకాలు బాగుండడంతో బుధవారం ఆటోమొబైల్ కంపెనీల షేర్లు మంచి లాభాలతో క్లోజయ్యాయి. ఆటో ప్యాక్‌లో మారుతీ సుజుకీ కంపెనీ షేర్లు అత్యధికంగా 3.26 శాతం, ఎం అండ్ ఎం కంపెనీ షేర్లు 2.45 శాతం లాభాలతో ముగిశాయి. ఎల్ అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఏసియన్ పెయింట్స్, పవర్‌గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాక్సిస్ బ్యాంక్ షేర్లూ లాభాల బాట పట్టాయి. టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, జొమాటో, హెచ్‌సీఎల్ టెక్, ఎస్‌బీఐ, హెచ్‌యూఎల్, టెక్ మహీంద్ర కంపెనీల షేర్లు మాత్రం నష్టాలతో ముగిశాయి. జనవరి నుంచి మార్చి మధ్య ప్రభుత్వ పెట్టుబడులు ఊపందుకుంటాయన్న వార్తలు కూడా బుధవారం మార్కెట్‌ను లాభాల బాట పట్టించాయి. నిఫ్టీకి 24,000 వద్ద గట్టి రెసిస్టెన్స్ ఎదురయ్యే అవకాశం ఉందని టెక్నికల్ విశ్లేషకుల అంచనా.

ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ అదుర్స్: మంగళవారం ప్రారంభమైన ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్ ఐపీఓకు మదుపరుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. రెండో రోజు 54.50 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

రూ.440 పెరిగిన పసిడి ధర: బులియన్ మార్కెట్ కూడా కొత్త ఏడాది లాభాల్లో ప్రారంభమైంది. ఢిల్లీలో 10 గ్రాముల 24 కేరట్ల (మేలిమి) బంగారం రూ.440 లాభంతో రూ.79,390 వద్ద, కిలో వెండి రూ.800 లాభంతో రూ.90,500 వద్ద ముగిశాయి. ఎంసీఎక్స్‌లో మాత్రం ఫిబ్రవరిలో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి బంగారం ఎదుగూ బొదుగూ లేకుండా రూ.76,893 వద్ద ముగిసింది.

టై హైదరాబాద్ కొత్త అధ్యక్షుడు రాజేశ్ పగడాల

ఉపాధ్యక్షుడుగా మురళి కాకర్ల ఎన్నిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంత్రపెన్యూర్ల నెట్‌వర్క్ 'ది ఇండస్ ఆంత్రప్రెన్యూర్స్' (టై) హైదరాబాద్ చాప్టర్ కొత్త అధ్యక్షుడుగా పగడాల కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాజేశ్ పగడాల, ఉపాధ్యక్షుడుగా ఇన్నోబాక్స్ వ్యవస్థాపకులు, సీఈఓ మురళి కాకర్ల ఎన్నికయ్యారు.

రిలయన్స్ అధీనంలోకి 'వయాకామ్18 మీడియా'

న్యూఢిల్లీ: వయాకామ్ 18 మీడియా, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) ప్రత్యక్ష అనుబంధ కంపెనీగా మారింది. ఈ కంపెనీ ఈక్విటీలో తనకు కేటాయించిన 24.61 కోట్ల కంపల్సరీ కన్వర్టబుల్ కన్వర్టిబుల్ ప్రిఫరెన్స్ షేర్లను ఆర్‌ఐఎల్ పూర్తి ఈక్విటీ షేర్లుగా మార్చుకోవడంతో ఇది సాధ్యమైంది. వయాకామ్ 18 ఇప్పటి వరకు ఆర్‌ఐఎల్ అనుబంధ సంస్థ అయిన నెట్‌వర్క్ 18 మీడియా అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థగా ఉండేది.

సోలార్ మాడ్యూల్స్ తయారీలోకి పెన్నార్

హైదరాబాద్: స్థానిక పెన్నార్ ఇండస్ట్రీస్ సోలార్ మాడ్యూల్స్ తయారీలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం బెంగళూరుకు చెందిన జెట్‌వర్క్ మాన్యుఫాక్చరింగ్ బిజినెస్ ప్రైవేట్ లిమిటెడ్ (జడ్‌ఎంబీపీఎల్) కంపెనీతో కలిసి ఒక జాయింట్ వెంచర్ (జేవీ) ఏర్పాటు చేస్తోంది. దీనికి సంబంధించి జడ్‌ఎంబీపీఎల్ కంపెనీతో బుధవారం ఒక ఒప్పందం కుదుర్చుకున్నట్టు పెన్నార్ ఇండస్ట్రీస్ తెలిపింది. ఈ జేవీ ఈక్విటీలో జడ్‌ఎంబీపీఎల్ కంపెనీకి 50.1 శాతం, పెన్నార్ ఇండస్ట్రీస్‌కు 45 శాతం, ఇతరులకు 4.9 శాతం వాటా ఉంటుంది. తన 45 శాతం వాటా కోసం కంపెనీ ఈ జేవీకి రూ.18.75 కోట్లు సమకూర్చనుంది. ఈ జేవీ ద్వారా దేశ, అంతర్జాతీయ మార్కెట్లకు అవసరమైన సోలార్ మాడ్యూల్స్ తయారీ, అమ్మకం కోసం ప్రత్యేక ప్లాంటు ఏర్పాటు చేస్తారు. అయితే ఈ జేవీ ప్లాంటును ఎక్కడ ఏర్పాటు చేసేదీ పెన్నార్ ఇండస్ట్రీస్ వెల్లడించలేదు. ఈ వార్తలతో బుధవారం కంపెనీ షేర్లు బీఎస్ఈలో 5.09 శాతం లాభంతో రూ.203.40 వద్ద ముగిశాయి.

పవర్ మెక్‌కు రూ.294 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే పవర్ మెక్ ప్రాజెక్ట్స్ కంపెనీకి అదానీ పవర్ నుంచి రూ.294 కోట్ల భారీ ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ ద్వారా చత్తీస్‌గఢ్‌లోని అదానీ పవర్ కంపెనీకి చెందిన 1,320 మెగావాట్ల కోర్బా థర్మల్ పవర్ ప్రాజెక్టుకు వివిధ సేవలు అందజేయనున్నట్టు పవర్ మెక్ ప్రాజెక్ట్స్ తెలిపిది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



జనవరి 2			
హైదరాబాద్	525	విజయవాడ	550
వరంగల్	527	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	101	విజయవాడ	108
వరంగల్	101	గుంటూరు	108
కరీంనగర్	101	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	85
కర్నూలు	101	నెల్లూరు	90
విశాఖపట్నం	105	అనంతపురం	90
గోదావరి	108		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,000 ▲	71,500 ▲	98,000 ▼
విజయవాడ	79,000 ▲	74,000 ▲	90,000 ▲
విశాఖపట్నం	77,100 ▲	70,680 ▲	87,580 ▲
రాజమండ్రి	78,000 ▲	71,500 ▲	88,400 ▼
ప్రొద్దుటూరు	78,600 ▲	72,780 ▲	88,400 ▲
ముంబై	76,580	70,150	86,055



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న నందమూరి బాలకృష్ణ

త్వరలో బసవ తారకం ఆస్పత్రి విస్తరణ

- ఏపీలోని తుళ్లూరు వద్ద క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం
- ఆస్పత్రి చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

హైదరాబాద్ సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిని త్వరలో విస్తరిస్తామని, అలాగే ఏపీలోని తుళ్లూరు ప్రాంతంలోనూ నిర్మాణాన్ని చేపడతామని ఆస్పత్రి చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రకటించారు. బుధవారం ఆస్పత్రిలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులతో కలసి బాలకృష్ణ కేక్‌ను కట్ చేసి తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు వైద్యం చేయాలి, సేవ చేయాలన్న ఆశయంతోనే ఆస్పత్రి నడుస్తోందని చెప్పారు. సినిమాల్లో, అన్ స్టాపబుల్ కార్యక్రమాల్లో వినోదాన్ని పంచుతూ ఆస్పత్రి వ్యవహారాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లే విషయంలో తనను ఏదో శక్తి నడిపిస్తోందన్నారు. ఆస్పత్రి వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని చెప్పారు. ఆస్పత్రి పురోగతికి దోహదపడిన దాతలు, గత పాలకమండలి సభ్యులు, పని చేసిన వైద్యులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిన్నారులకు ప్రత్యేకమైన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీఈవో డాక్టర్ కె.కృష్ణయ్య, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టీఎస్ రావు, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కల్పన రఘునాథ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఫణి కోటేశ్వరరావు, పలువురు వైద్య విభాగాధిపతులు పాల్గొన్నారు.

అమరావతికి సం'క్రాంతి' జోష్!



- పండుగ తర్వాత నుంచి పనులు పరుగులు
- ఒక్కరోజే రూ.2,323.25 కోట్లతో టెండర్లు
- పోటాపోటీగా పిలుస్తున్న సీఆర్డీఏ, ఏడీసీ
- 22 వరకూ బిడ్లు దాఖలు చేసే అవకాశం

విజయవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ తర్వాత నుంచి రాజధాని అమరావతి పనులు పరుగులు పెట్టనున్నాయి. ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టే పనులకు సంబంధించి సీఆర్డీఏ, అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) పోటాపోటీగా టెండర్లు పిలుస్తున్నాయి. బుధవారం సీఆర్డీఏ రూ.1,470.68 కోట్లతో, ఏడీసీ రూ.852.57 కోట్లతో కలిపి మొత్తం రూ.2,323.25 కోట్ల పనులకు టెండర్లు పిలిచాయి.

సీఆర్డీఏ టెండర్ల వివరాలివీ..

- రాజధానిలో అత్యంత కీలకమైన ట్రంక్ ఇన్ఫ్రా పనుల్లో భాగంగా రూ.1,036.36 కోట్ల వ్యయంతో రెండు టెండర్లు పిలిచారు. అమరావతి కేపిటల్ సిటీ పరిధిలో జోన్-1ఏలోని నెక్కల్లు (పార్ట్) గ్రామంలో రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సరఫరా, సీవరేజి, పవర్-ఐసీటీ యుటిలిటీ డక్ట్స్, రీయూజ్ వాటర్ లైన్స్, అవెన్యూ ప్లాంటేషన్ వంటి పనులు చేపట్టడానికి రూ.448.32 కోట్ల వ్యయంతో మొదటి టెండర్ పిలిచింది.
- జోన్-1బీలోని నెక్కల్లు(పార్ట్), శాఖమూరు గ్రామాల్లో రూ.588.04 కోట్లతో పై పనులకే టెండర్లు పిలిచింది. రానున్న రోజుల్లో మిగిలిన జోన్ల పరిధిలో కూడా పెద్దఎత్తున ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులకు టెండర్లు పిలవనుంది.
- నేలపాడు గ్రామంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అఖిల భారత సర్వీసు(ఐఏఎస్) అధికారులకు సంబంధించి 432 క్వార్టర్లతో కూడిన మొత్తం 18 స్టిల్ట్ ప్లస్ 12 అంతస్తులతో కూడిన మల్టీస్టోర్డ్ టవర్లలో ఎలక్ట్రికల్, ప్లంబింగ్, శానిటరీ, అగ్నిమాపక పరికరాల బిగింపు, లిఫ్టులు, డీజీ, హెచ్‌వీఏసీ, సెక్యూరిటీ సిస్టమ్‌లు, ల్యాండ్ స్కేపింగ్ వంటి పనులకు సంబంధించి రూ.434.32 కోట్లతో టెండర్లు పిలిచింది.
- ఈ పనులన్నింటికీ సంబంధించి జనవరి 22న మధ్యాహ్నం 3 గంటల వరకు బిడ్లను సమర్పించవచ్చు. అదేరోజు సాయంత్రం 4గంటలకు సాంకేతిక బిడ్లను తెరుస్తారు.

ఏడీసీ నేతృత్వంలో ఇలా..

అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) నేతృత్వంలో రూ.852.57 కోట్ల వ్యయంతో రెండు టెండర్లు పిలిచారు. నీరుకొండ రిజర్వాయర్‌కు సంబంధించి బాలెన్స్ ఫ్లడ్ మిటిగేషన్ నిర్మాణ పనులను ప్యాకేజీ-3లో భాగంగా రూ.470.75 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచింది. జనవరి 22న మధ్యాహ్నం 3గంటల వరకు కాంట్రాక్టు సంస్థలు బిడ్లను సమర్పించవచ్చు. అదేరోజు సాయంత్రం 5గంటలకు టెక్నికల్ బిడ్లను తెరుస్తారు.

- అమరావతి కేపిటల్ సిటీ ఏరియాలోని ఎన్-9 రోడ్డు పరిధిలో రోడ్లు, డ్రెయిన్లు, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు (వరద నీటి మళ్లింపు కాల్వలు), మంచినీటి సరఫరా వ్యవస్థ, సీవరేజి నెట్‌వర్క్, విద్యుత్తు-ఐసీటీ యుటిలిటీ డక్ట్స్, అవెన్యూ ప్లాంటేషన్లకు సంబంధించి రూ.381.82కోట్లతో టెండర్లు పిలిచింది. జనవరి 22న మధ్యాహ్నం 3.30గంటల వరకు బిడ్లు సమర్పించవచ్చు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు టెక్నికల్ బిడ్లు తెరుస్తారు.

2024 .. సెగ పుట్టించింది

శతాబ్ద కాలంలో అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు



విశాఖపట్నం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గత శతాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా 2024 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు సృష్టించింది. భారత వాతావరణ శాఖ వివరాల ప్రకారం 1901 నుంచి 2020 వరకూ నమోదైన వార్షిక సగటు కంటే గడచిన ఏడాది గరిష్ఠ ఉష్ణోగ్రత 0.65 డిగ్రీలు అధికంగా నమోదైంది. గతంలో అత్యంత వేడి సంవత్సరంగా 2016 రికార్డయ్యింది. ఆ ఏడాది భూ ఉపరితల ఉష్ణోగ్రతలు వార్షిక సగటు కంటే 0.54 డిగ్రీలు అధికంగా నమోదు కాగా, 2024 సంవత్సరం ఆ రికార్డును అధిగమించింది. వరల్డ్ వెదర్ ఎట్రిబ్యూషన్, క్లైమేట్ సెంట్రల్ సంస్థలు 2024 సంవత్సరంపై అధ్యయనం చేశాయి. వాటితో పాటు భారత వాతావరణ శాఖ వద్ద ఉన్న వివరాలను పరిగణనలోకి తీసుకుంటే 2024 అత్యంత వేడి సంవత్సరంగా నిలుస్తోందని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్రా వెల్లడించారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలకు సంబంధించి 1901 నుంచి 2020 వరకు నమోదైన దీర్ఘకాలిక వార్షిక సగటు కంటే 0.90 డిగ్రీలు ఎక్కువగా నమోదైంది. వాతావరణపరంగా దేశంలో 2024లో ఎక్కువ రోజులు వేడిగాలులు వీయడం, అస్థిరమైన వర్షపాతం, విపరీతమైన వాతావరణ అనిశ్చితి నెలకొంది.

ప్రపంచ వ్యాప్తంగా అదే పరిస్థితి..

ప్రపంచవ్యాప్తంగా 2024 అత్యంత వేడి సంవత్సరమని యూరోపియన్ క్లైమేట్ ఏజెన్సీ శాస్త్రవేత్తలు కూడా ప్రకటించారు. పారిశ్రామిక విప్లవానికి ముందు నమోదైన సగటు వార్షిక ఉష్ణోగ్రతల కంటే 2024లో తొలిసారిగా 1.5 డిగ్రీలు ఎక్కువ నమోదైనట్టు వెల్లడించారు. ఇంకా 41 రోజులు ప్రమాదకరమైన వేడిని ప్రపంచ ప్రజలు అనుభవించారని పేర్కొన్నారు. ఈ పరిణామం అసాధారణమని, ఇందుకు 2024 జూన్ వరకు కొనసాగిన ఎల్‌నినో, వాతావరణంలో అనూహ్య మార్పులు, విపరీతంగా పెరుగుతున్న పట్టణీకరణ కారణాలుగా విశ్లేషించారు.

జనవరిలో చలి వణికించదు..

ఈ ఏడాది జనవరిలో చలి పెద్దగా ఉండదని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. రాష్ట్రంలో ఈ నెలలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. ఉత్తరాంధ్ర తప్ప రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇక, ఈశాన్య రుతుపవనాల సీజన్ (అక్టోబరు నుంచి డిసెంబరు)లో దక్షిణ భారతంలోని తమిళనాడు, పుదుచ్చేరి, రాయలసీమ, కోస్తా, కేరళ, దక్షిణ కర్ణాటకల్లో అసాధారణ వర్షపాతం నమోదైంది. 1901 నుంచి ఇప్పటివరకూ ఉన్న వివరాలు పరిశీలిస్తే 2024 మూడో అత్యధిక వర్షపాతం నమోదైన సంవత్సరం (ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో మాత్రమే)గా నిలిచింది.

అంతా ఒక టీమ్‌గా పని చేద్దాం!

- పేదల జీవన ప్రమాణాలు పెంచేలా సంస్కరణలు
- 2025.. ప్రజల సంతృప్తి పెంచడానికి వేదిక కావాలి: సీఎం చంద్రబాబు
- కొత్త ఏడాది సచివాలయంలో అధికారులతో మాటామంతీ

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): 'మనమంతా ఒక టీమ్. అందరం కలిసి పని చేద్దాం. ప్రజల జీవితాలు మారుద్దాం' అని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా సంస్కరణలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మార్పు తేవాలనే సంకల్పానికి నూతనత్వం, సాంకేతికత జోడిస్తే శాఖల్లో అద్భుతంగా ఫలితాలు సాధించవచ్చని అధికారులకు ఉద్బోధించారు. రాష్ట్ర ప్రభుత్వంలోని ఆయా శాఖల కీలక అధికారులతో కొత్త సంవత్సరం సందర్భంగా సీఎం కొద్దిసేపు ముచ్చటించారు. రోజువారీ సమీక్షలకు భిన్నంగా మాటామంతీ జరిపారు. తన ఆలోచనలు, ప్రాధాన్యాలు, లక్ష్యాలు అధికారులకు వివరించారు. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అధికారులు సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం 2025లో లక్ష్యాలు ఏమిటి? పనితీరు ఎలా ఉండాలనేది వివరించారు. దీనికి అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలని, ప్రతిశాఖలో ఒక రిజల్ట్ ఓరియంటెడ్‌గా పని జరగాలని స్పష్టం చేశారు. 'విభజన వల్ల ఏపీలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. 2019లో మా ప్రభుత్వం కొనసాగి ఉంటే రాష్ట్రం ఎంతో పురోగతి సాధించేది. రాష్ట్రాల అభివృద్ధిలో సుస్థిర ప్రభుత్వం అనేది కూడా ముఖ్యం. అప్పుడే అనుకున్న విధంగా ప్రాజెక్టులు పూర్తి అవుతాయి. ప్రజలకు మేలు జరుగుతుంది. 2024 ఎన్నికల్లో ప్రజలు తిరుగులేని తీర్పు ఇచ్చారు. ప్రభుత్వంపై అనేక ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయి. వీటిని నేరవేర్చే క్రమంలో అనేక నిర్ణయాలు తీసుకుంటున్నాం. పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలసీలు తెచ్చాం. దీనికి అనుగుణంగా సమస్త అధికార యంత్రాంగం పని చేయాలి. వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి. తొందరగా ఫలితాలు రాబట్టాలి. టెక్నాలజీ సాయంతో చాలా మంచి ఫలితాలు వస్తున్నాయి. రానున్న రోజుల్లో 150 సర్వీసులు వాట్సాప్ ద్వారా ఇవ్వనున్నాం. దీనికి అందరూ సమాయత్తంకావాలి. ఆధార్‌ను సమర్థవంతంగా ఉపయోగిస్తాం. ప్రతి ఇళ్ల జియో ట్యాగ్ చేస్తాం. పింఛన్లు ఇంటి వద్దనే ఇచ్చారా లేదా అనేది రియల్ టైంలో తెలిసిపోతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సీసీ కెమెరాలు, డ్రోన్లు రియల్ టైం డేటాను సమర్థవంతంగా వినియోగిస్తే అద్భుతాల సృష్టించవచ్చు. రెవెన్యూశాఖలో చాలా సమస్యలున్నాయి. వాటన్నింటికీ పరిష్కారం చూపాలి. స్మార్ట్ వర్క్ చేయండి. టెక్నాలజీని వాడండి. కచ్చితంగా ఫలితాలు వస్తాయి. భవిష్యత్ అవసరాలను గుర్తించి విజన్-2047ను తీసుకువచ్చాం. ఇందులో పేర్కొన్న 10 లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేయాలి. 2025 గేమ్ చేంజర్‌లో కీలకం కావాలి. అతి పెద్దమార్పులకు ఈ ఏడాదిలో నాంది పలకాలి. రూ.80 వేల కోట్లతో గోదావరి నీళ్ల బనకచర్లకు సాధ్యమా అని అడుగుతున్నారు. అందరం కలిసి సమష్టిగా, వేగంగా అడుగులు వేద్దాం. మనం ఎంత వేగంగా, సమర్థవంతంగా పని చేస్తే అంత త్వరగా ఫలితాలు వస్తాయి' అన్నారు. 2025 మార్పునకు, వేగానికి, పాలనను కొత్త పుంతలు తొక్కించడానికి, ప్రజల సంతృప్తిని పెంచడానికి వేదిక కావాలని, ఆ దిశగా అన్ని స్థాయిల్లో సిబ్బంది, అధికారులు పని చేయాలని చంద్రబాబు స్పష్టంచేశారు.



సీఎం చంద్రబాబుతో జెన్‌కో ఎండీ చక్రధరబాబు, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, సీపీడీసీఎల్ సీఎండీ రవి

అనుసంధానంలో 'వెలిగొండ'కు ప్రాధాన్యమివ్వాలి

- చంద్రబాబుకు విన్నవించిన '20 సూత్రాల' చైర్మన్ లంకా దినకర్

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానంలో వెలిగొండ రిజర్వాయరుకు ప్రాధాన్యమివ్వాలని సీఎం చంద్రబాబును రాష్ట్ర '20 సూత్రాల కార్యక్రమం' చైర్మన్ లంకా దినకర్ కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఉండవల్లి నివాసంలో సీఎంను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నదుల అనుసంధానంపై ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని వివరిస్తూ లేఖను అందించారు. రాష్ట్రంలో గోదావరి-కృష్ణా-పెన్నా నదులను అంతర్రాష్ట్ర స్థాయిలో అనుసంధానం చేయడం ద్వారా సీఎం చంద్రబాబు అపరభగీరథుడుగా మారనున్నారని కొనియాడారు. 2019-24 మధ్య కాలంలో నదుల అనుసంధానంపై ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రం అనేకసార్లు నాటి సీఎం జగన్‌ను కోరినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. ఆనాడు తెలంగాణ సీఎం కేసీఆర్‌తో కలసి జగన్ డ్రామాలాడారని విమర్శించారు.

ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ హబ్‌గా ఏపీ

- పరికరాల సేకరణకు ఏపీటీఎస్ ఎండీ అధ్యక్షతన కమిటీ

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ హబ్‌గా రాష్ట్రాన్ని మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో వినియోగించేందుకు అవసరమైన పరికరాల సేకరణకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్(ఏపీటీఎస్) మేనేజింగ్ డైరెక్టర్ కన్వీనర్‌గా కమిటీని నియమిస్తూ బుధవారం ఐటీ శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వు జారీ చేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా ఐటీ కార్యదర్శి లేదా అతని ప్రతినిధి ఉంటారు. ఆర్‌టీజీఎస్ సీఈవో, రాష్ట్ర ఐటీ అసోసియేషన్ ప్రతినిధి, తిరుపతి ఐఐటీ ఫ్యాకల్టీ, స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం నిపుణులు, పరిశ్రమలు, వాణిజ్య శాఖ నిపుణుడు, ఐఐటీ మద్రాస్ ప్రతినిధి సభ్యులుగా ఉంటారు.

జాయింట్ ఎల్‌పీఎంల సబ్‌డివిజన్‌కు ఫీజు మినహాయింపు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): భూముల సర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్)ల సబ్ డివిజన్ కోరుతూ రైతులు ఇచ్చే దరఖాస్తులకు ఫీజు మినహాయింపునిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆరు నెలల పాటు ఫీజు మినహాయింపు వర్తిస్తుందని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తాజాగా ఉత్తర్వులు(జీఓ-1) జారీ చేశారు. భూముల సర్వే జరిగిన గ్రామాల్లో ఉమ్మడి భూమి పటాలను సబ్ డివిజన్ చేయడానికి రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందుకు రెవెన్యూశాఖ నిర్దిష్టంగా ఫీజు వసూలు చేస్తోంది. అయితే, భూముల సర్వేల్లో అనేక తప్పులు జరిగాయి. సబ్ డివిజన్ పనులు సరిగా చేయలేదు. ఈ సమస్యను పరిష్కరించాలని రైతుల నుంచి పెద్ద ఎత్తున విన్నపాలు వస్తున్నాయి. రెవెన్యూ సదస్సుల్లోనూ ఈ సమస్యను ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. ఈ నేపథ్యంలో భూ పరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్‌ఏ) నుంచి ప్రతిపాదనలు తెప్పించుకొన్న ప్రభుత్వం ఆరు నెలల పాటు జాయింట్ ఎల్‌పీఎంల సబ్ డివిజన్ సేవకు ఫీజు మినహాయింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వైద్య సేవల నాణ్యత పెంచాలి: మంత్రి సత్యకుమార్

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో ప్రభుత్వ, ప్రయివేటు వైద్య సేవల్లో నాణ్యత పెంచాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రయివేటు రంగ వైద్యులు, సిబ్బందిని ఉద్దేశించి బుధవారం బహిరంగ లేఖ రాశారు. వైద్య సేవల్లో లోపాలను తొలగించాలన్నారు. సీఎం చంద్రబాబు విడుదల చేసిన స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్‌కు అనుగుణంగా ఆరోగ్య, సంపన్న, ఆనంద ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణకు అంతా పునరంకితం కావాల ని ఆకాంక్షించారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో ఖర్చుతో కూడిన వైద్యం, రోగ నిర్ధారణ కోసం అనవసరమైన పరీక్షలు చేయించడం, సిబ్బందికి తక్కువ వేతనాలు తదితర అంశాలు వాటి వ్యాపార దృక్పథానికి అద్దం పడుతున్నాయన్నారు.

టీ హైకోర్టు జడ్జీలకు 'రాష్ట్ర అతిథులు'గా గుర్తింపు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హైకోర్టు జడ్జీలకు ఇచ్చే ప్రాధాన్యం, గుర్తింపును తెలంగాణ నుంచి వచ్చే హైకోర్టు జడ్జీలకు కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ విన్నపం మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ నుంచి ఏపీకి వచ్చే హైకోర్టు జడ్జీలను ముఖ్య అతిథులుగా పరిగణించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జడ్జీల అధికారిక లేదా అనధికారిక పర్యటనలోనూ ప్రోటోకాల్ పాటించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.



బుధవారం గన్నవరం విమానాశ్రయంలో తారసపడ్డ డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ కరచాలనం

బ్యాంక్ మేనేజర్ ఉరఫ్ లేడీ రౌడీ షీటర్



ప్రభావతి

(మొదటటి పేజీ తరువాయి)

దౌర్జన్యాలకు పాల్పడటం మొదలుపెట్టారు. ఆమె ఆగడాలు భరించలేక పోలీసులు రౌడీషీట్ తెరిచారు. అప్పటినుంచి ఆమె అరాచకాలు మరింతగా ముదిరాయి. ఈ క్రమంలో మర్రిబంధంలో మరో ఆగడానికి దావులూరి ప్రభావతి తెర లేపారు. కర్రలు, రాడ్లు తీసుకుని స్థానిక జనసేన నేతపై ఆమె దాడి చేశారు. ఆ నేత చేతులు కట్టేసి తీవ్ర వేధింపులకు గురిచేశారు. కుటుంబంతో కలిసి క్రూరంగా దాడి చేయడంతో ఆయన స్పృహ తప్పి పడిపోయారు. ఆ వివరాల్లోకి వెళితే..

కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గంగూరులో బ్యాంక్ మేనేజర్‌గా ప్రభావతి కొంతకాలం పనిచేశారు. నూజివీడు మండలం సీతారామపురానికి చెందిన వైసీపీ నాయకుడు కవులూరి యోగేశ్వరరావు ఈ బ్యాంకులో 380 గ్రాముల బంగారం తాకట్టు పెట్టారు. ఫోర్జరీ సంతకంతో ఆ బంగారం కొట్టేసిన కేసులో ప్రభావతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆమె ఉద్యోగం పోయింది. అప్పటి నుంచి కవులూరి యోగికి, ప్రభావతికి మధ్య వివాదాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రులను; తాజాగా రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనితను ఆమె కలిసి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. అయితే ఆమె వ్యవహార శైలిని తెలుసుకున్న వారు ఈమె విషయంలో ముఖం చాటేశారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ప్రభావతి కలిశారు. ప్రభావతి వ్యవహారంపై మర్రిబంధంలోని స్థానిక జనసేన నాయకులను ఆయన సమగ్ర వివరాలు కోరారు. ఈ వ్యవహారాలను దోనవల్లి వెంకట్రావు మర్రిబంధంలో చూస్తున్నారు. అయితే, వెంకట్రావు.. పవన్‌కు తనపై వ్యతిరేకంగా సమాచారం ఇచ్చారంటూ ఆయనపై ఆమె కక్ష పెంచుకున్నారు. ఈ క్రమంలో బుధవారం వెంకట్రావుపై ప్రభావతి... తన తండ్రి రంగారావు, సోదరుడు ప్రభుకుమార్‌లతో కలిసి దాడి చేశారు. చేతులు కట్టేసి విచక్షణారహితంగా కొట్టారు. దీనిని గమనించిన గ్రామస్థులు, ఘటనను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి,సామాజిక మాధ్యమాలలో పోస్టు చేశారు. సమాచారం అందుకున్న నూజివీడు రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గ్రామస్థుల సాయంతో క్షతగాత్రుడిని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.



దాడి చేస్తున్న ప్రభావతి కుటుంబ సభ్యులు

ఆది నుంచి వివాదాలే..

ప్రభావతి ఆది నుంచీ వివాదాస్పదురాలే. సొంత కుటుంబ సభ్యుల ఆస్తులను కైంకర్యం చేశారు. మర్రిబంధం పక్కనే గల పల్లెర్లమూడిలో బంగారం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని బెదిరింపులకు దిగారనే ఆరోపణలు ఆమెపై ఉన్నాయి. గ్రామంలో ప్రతి రోజూ గిల్లికజ్జాలు పెట్టుకుంటూ ఉండటంతో నూజివీడు రూరల్ పోలీసులు ఆమెపై రౌడీషీట్ సైతం నమోదు చేశారు. అయితే, ప్రభావతిపై పోలీసులు చర్యలు చేపట్టడంలో తీవ్ర జాప్యం చేటు చేసుకోవడం వల్లే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభావతి ఒక పథకం ప్రకారం గతంలోనూ, ఇప్పుడూ అధికార పార్టీ నాయకుల పేర్లను వాడుతుండటంతో పోలీసులు ఆమెపై చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ఆమె బాధితులు నానాటికి పెరిగిపోతున్నారు. ఇప్పటికైన పోలీసులు తక్షణం స్పందించి ప్రభావతిని అదుపులోకి తీసుకుని తమకు రక్షణ కల్పించాలని మర్రిబంధం గ్రామస్థులు కోరుతున్నారు. కాగా, గాయపడిన వెంకట్రావును ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ, ఇతర జనసేన నాయకులు నూజివీడు ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు.





కడప నగర శివారులో సీకేదిన్నె మండల పరిధిలో సజ్జల సోదరులు ఆక్రమించిన అటవీ భూముల్లో సాగు చేసిన పంటలు

రిజర్వ్ ఫారెస్ట్‌లో 'సజ్జల' సామ్రాజ్యం!

(మొదటటి పేజీ తరువాయి)

సమాచారం ప్రకారం సజ్జల పేరు బయటకు రాకుండా ఆయన అండతో సోదరులు, కుటుంబ సభ్యులు అటవీ భూములను ఆక్రమించారని తెలుస్తోంది. వారంతా ఆయన బినామీలనే ప్రచారం ఉంది. గత ప్రభుత్వంలో సజ్జల సోదరులు కడప శివారు ప్రాంతంలో చేసిన ఈ అక్రమాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. సజ్జల రామకృష్ణారెడ్డి కడప జిల్లా వాసి. వైసీపీ హయాంలో అప్పటి సీఎం జగన్ తరువాత అన్నీ ఆయనే చూసుకునేవారు. అప్పట్లో సీఎంతో పాటు సీఎస్, డీజీపీ కూడా కడప వాళ్లే. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా సజ్జల సోదరులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఏకంగా అటవీ భూమినే కబ్జా చేశారు. కాల్వలు, కుంటలు కూడా ఆక్రమించారు.

200 ఎకరాలతో సజ్జల ఎస్టేట్

సజ్జల రామకృష్ణారెడ్డి, దివాకర్‌రెడ్డి, జనార్ధనరెడ్డి.. ముగ్గురూ అన్నదమ్ములు. వీరిలో దివాకర్‌రెడ్డి చనిపోయారు. కుటుంబంలో మొత్తం పెత్తనమంతా సజ్జల రామకృష్ణారెడ్డిదని చెబుతారు. కడప నగర శివారులోని సీకేదిన్నె రెవెన్యూ పొలంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిని ఆనుకుని సజ్జల సోదరులకు భూములున్నాయి. కడప నుంచి రాయచోటి మార్గంలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డు వరకు విలువైన భూములున్నాయి. ఇక్కడ కడప వైసీపీ నేతలకు ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. అప్పుడప్పుడూ ఇక్కడ రేవ్ పార్టీ జరుగుతుందని చెబుతారు. సీకేదిన్నె రెవెన్యూ పొలంలోని సర్వే నెంబరు 1599, 1600/1, 2, 1601/1, 1ఎ, 2, ఇంకా ఇతర సర్వే నెంబర్లలో సజ్జల రామకృష్ణారెడ్డి సోదరుడు దివాకర్‌రెడ్డి తనయుడు సందీప్‌రెడ్డికి దాదాపు 130 ఎకరాలకు పైగా ఉన్నాయి. సీకేదిన్నె రెవెన్యూ పొలం సర్వే నెంబరు 1629లో 11,129.33 ఎకరాల అటవీ భూమి ఉంది. సజ్జల సోదరులు ఈ భూముల్లో కొంత ఆక్రమించేశారు. ఇక్కడ సజ్జల ఎస్టేట్‌కు సంబంధించి మొత్తం 206.13 ఎకరాల భూమి ఉంది. ఇందులో పట్టా భూమి 146.75 ఎకరాలు, ప్రభుత్వ భూమి 10.2 ఎకరాలు, డీకేటీ 5.14 ఎకరాలు, చుక్కల భూమి 2.02 ఎకరాలు ఉన్నాయి. అటవీ భూమి 42.20 ఎకరాలను ఆక్రమించేశారు. ఇందులో మామిడి, నేరేడు, టేకు ఇతర పంటలు సాగు చేశారు. అక్కడే గెస్ట్‌హౌస్‌లు కట్టారు. అక్కడ పనిచేసే ఉద్యోగులకు షెడ్లు ఏర్పాటు చేశారు.

కుటుంబ సభ్యులే బినామీలు!

ఆ ప్రాంతానికి బయటి వ్యక్తులను అనుమతించరు. సజ్జల అండతోనే కోట్ల విలువ చేసే భూములు కొట్టేశారని అంటున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి నేరుగా తన పేరు లేకుండా తన కుటుంబ సభ్యుల ద్వారా ఆక్రమించినట్లు చెబుతారు. వారు సజ్జల బినామీలనే ప్రచారం ఉంది. ఇప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో ఆ భూములు రిజర్వు ఫారెస్టులో ఉన్నాయి. అటవీ ప్రాంతం కావడంతో ఇప్పటికీ అక్కడ నెమళ్లు తిరుగుతున్నాయి. కోట్ల రూపాయల విలువ చేసే భూములు కొట్టేసినా అటు అటవీశాఖ, ఇటు రెవెన్యూ యంత్రాంగం కళ్లు మూసుకున్నాయి. అటవీ భూముల ఆక్రమణ వ్యవహారం ఇటీవల కలెక్టర్ దృష్టికి రావడంతో సర్వే చేయిస్తున్నారు.

తిరుపతి జిల్లా పెన్నేపల్లి స్టీల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

- ఏడుగురు కార్మికులకు తీవ్ర గాయాలు
- పూర్తి వివరాలు తెలియక అయోమయం



ఫ్యాక్టరీలో ఎగసిపడుతున్న మంటలు

పెళ్లకూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పెన్నేపల్లి వద్ద ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీలో బుదవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. పరిశ్రమలోని ఫర్నేస్ బాయిలర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద శబ్దంతో బాయిలర్ పేలిపోయింది. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న ఏడుగురు కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని నాయుడుపేట, నెల్లూరు ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, స్టీల్‌ప్లాంట్‌లో రాత్రి షిఫ్టులో 50 నుంచి 70 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. వీరంతా బీహార్‌వాసులేనని స్థానికులు చెబుతున్నారు. యాజమాన్యం వివరాలు చెప్పకుండా గోప్యత పాటిస్తుండటంతో అంతా అయోమయం నెలకొంది.



గవర్నర్‌తో చంద్రబాబు భేటీ

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గవర్నర్, సీఎం చంద్రబాబు కాసేపు ముచ్చటించారు. అంతకుముందు రాజ్‌భవన్‌కు వచ్చిన చంద్రబాబుకు అధికారులు స్వాగతం పలికారు. రాజ్‌భవన్ సెక్రటరీ హరిజవహర్ లాల్ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సీఎం వెంట ఆయన ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర ఉన్నారు.



1600 మందికి రూ. 24.16 కోట్లు లబ్ధి

నూతన సంవత్సరం తొలిరోజు సీఎంఆర్ఎఫ్ ఫైలుపై చంద్రబాబు సంతకం

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం తొలిరోజున బుధవారం సీఎం చంద్రబాబు పేదలకు ప్రయోజనం కలిగించే సీఎం సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) ఫైలుపై సంతకం చేశారు. ఒకేసారి 1600 మందికి రూ.24.16 కోట్ల నిధులు విడుదల కానున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి డిసెంబరు 31 వరకూ రూ.100 కోట్లకు పైగా సాయం చేసింది. తాజాగా చంద్రబాబు సంతకంతో మరో రూ.24.16 కోట్లు విడుదల కానున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మొత్తం 9,123 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రయోజనం పొందారు.

మోయలేనన్ని పాపాలు!

● నిన్న నరసరావుపేట, ఈ రోజు కనకదుర్గమ్మ గుడికి వెళ్లినప్పుడు నా పట్ల ప్రజల స్పందన చూసి చాలా ఆనందం కలిగింది. నేను ఏదో చేస్తానన్న నమ్మకం వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. అది నా బాధ్యతను మరింత పెంచుతోంది.

● బీజేపీ గుజరాత్‌లో వరుసగా ఏడు సార్లు, కేంద్రం, హరియాణాలోనూ వరుసగా మూడుసార్లు గెలిచింది. అది ఎలా సాధ్యమైందో అధ్యయనం చేస్తున్నాం. పని చేయడం ఒకటే చాలదు. ప్రజలు నిరంతరం మనతో ప్రయాణం చేసేలా చూసుకోవాలి.

\- సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాల నుంచి తీవ్రమైన పోటీ ఉన్నా తట్టుకుని వీటిని తెచ్చామన్నారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో పెట్టే బీపీసీఎల్ రిఫైనరీ నుంచి ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 75 శాతం వాళ్లకు తిరిగి ఇవ్వడానికి అంగీకరించి దానిని సాధించామని చెప్పారు. ఆ రిఫైనరీ వస్తే ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుంటాయని, ఉద్యోగాలు రావడంతోపాటు పెద్ద సంఖ్యలో అనుబంధ పరిశ్రమలు వస్తాయని వివరించారు. జగన్ హయాంలో ఒక్క విద్యుత్ రంగంపైనే రూ.1.25 లక్షల కోట్ల భారం పడిందన్నారు. ఆ భారం తగ్గించుకోవడానికి అడ్డగోలుగా కరెంటు బిల్లులు పెంచేశారని విమర్శించారు. 'ప్రస్తుతం కరెంటు కొనుగోలు ధర యూనిట్‌కు రూ.5.18గా ఉంది. దానిని ఈ ఏడాదిలో రూ.4.80కి తేవాలని నిర్ణయించాం. ఎన్ని మార్గాలుంటే అన్ని మార్గాలూ వెతికి పట్టుకుని ప్రజలపై భారం తగ్గించాలని ప్రయత్నిస్తున్నాం. రాబోయే రోజుల్లో కొత్తగా చార్జీలు పెంచకుండా చూస్తాం' అని తెలిపారు. బెనిఫిట్ షోలకు తెలంగాణ సర్కారు అనుమతులు నిలిపివేసినా ఏపీ ప్రభుత్వం అనుమతులు ఇవ్వడానికి సినీ రంగం నుంచి వచ్చిన విజ్ఞప్తులు కారణమా అన్న ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు. 'మనం దృష్టి పెట్టాల్సిన పెద్ద పెద్ద అంశాలు వేరే ఉన్నాయి. వాటిపై పనిచేయడం మాకు ప్రయారిటీ' అని వ్యాఖ్యానించారు. ఇంకా ఏమన్నారంటే..

ఖాళీ చిప్ప చేతికిచ్చారు..

ఈ ఏడాది మొత్తానికి రాష్ట్రం తెచ్చుకోవలసిన రుణం మొత్తాన్ని వాళ్లన్న రెండు నెలల్లోనే తెచ్చేసి వాడేసి ఖాళీ చిప్ప చేతికిచ్చి వెళ్లారు. కొత్తగా అప్పు తెచ్చుకోవడానికి కూడా దారి లేకుండా చేశారు. ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రానికి రావాల్సిన రెండేళ్ల నిధులను ముందే తీసేసుకుని ఖర్చు పెట్టేశారు. దాని నుంచి కూడా వచ్చే పరిస్థితి లేదు. కేంద్ర ఆర్థిక సాయంతో నడిచే 93 పథకాల కింద నిధులు తీసుకుని దారి మళ్లించారు. ఆ పథకాలన్నీ ఆగిపోయాయి. గతంలో ఇచ్చిన నిధులు ఆ పథకాలకు ఖర్చు చేసినట్లు చూపిస్తేనే మళ్లీ కొత్తగా నిధులు వస్తాయి. దీంతో రూ.950 కోట్లు విడుదల చేసి.. ఆర్థిక సంఘం పనుల కోసం ఖర్చు చేసిన రుజువులు చూపించి.. తర్వాతి విడత నిధులు కేంద్రం నుంచి తెచ్చుకోవలసి వచ్చింది. ఈ మాదిరిగా ఇప్పటికి 74 కేంద్ర పథకాలను మళ్లీ దారిలో పెట్టాం. ఢిల్లీకి నాలుగైదుసార్లు వెళ్లి మన పరిస్థితి వివరించాను. అమరావతి, పోలవరం ప్రాజెక్టులను దారిలో పెట్టాం. అభివృద్ధి, సంక్షేమాలను బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్తున్నాం. అందుకే పేదల పింఛన్లు రూ.4 వేలకు పెంచాం. ఒక్క ఈ పద్దు కింద ఖర్చే రూ.33 వేల కోట్లు అవుతోంది. దేశంలో ఏ రాష్ట్రమూ ఇంత ఇవ్వడం లేదు. గుజరాత్ వంటి రాష్ట్రాలు రూ.1,000 లోపే ఇస్తున్నాయి. అన్న క్యాంటీన్లు తెరిచాం.

మెతక వ్యక్తిని కాదు..

మా ప్రభుత్వం కావాలని రాజకీయ కోణంలో ఎవరినీ వేధించదు. అదే సమయంలో తప్పులు చేసిన వారిని ఉపేక్షించదు. నేను 1995లో మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజాన్ని కఠినంగా అణచివేశాను. నేను మెతక వ్యక్తినైతే వీటిని అణచివేయలేను. రాజకీయ కక్ష సాధింపులకు మేం వ్యతిరేకం. కానీ దోచుకున్న వారిని వదిలి పెట్టం. ఒకట్రెండు అవినీతి కేసుల్లో అరెస్టులు కూడా కాక ముందే నిందితులకు బెయిల్ ఎలా వచ్చిందో సమీక్ష చేస్తాం.

దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఇంకా ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటివి ఇవ్వాలి. ఒకదాని వెంట ఒకటి ఇస్తాం. మేం సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాకున్న అంచనా వేరు. కానీ అధికారంలోకి వచ్చాక లోతుగా చూస్తే ఎంత ఘోరంగా ఉందో తెలిసింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇంత లోతుగా మాకు తెలియదు. అయినా జగన్ మాదిరిగా మేం దులపరించుకుని పోదలచుకోలేదు. ఉద్యోగులకు వారంలోగా సీపీఎస్ రద్దుచేస్తానని హామీ ఇచ్చి.. తర్వాత దాని గురించి అవగాహన లేక చెప్పామని ఆయన దులిపేసుకొన్నాడు. మద్య నిషేధం గురించి ఎన్నికల ముందు పెద్ద పెద్ద మాటలు చెప్పి తర్వాత మాట మార్చేశాడు. ఇసుక తక్కువ రేటుకు దొరికే ఏర్పాటు చేస్తానని చెప్పి తన జేబులు నింపుకొన్నాడు.

ఎవరు తప్పుచేసినా కఠినంగా ఉంటాం..

మా ఎమ్మెల్యేలకు కౌన్సెలింగ్ ప్రారంభించాం. వారిని పిలిచి మాట్లాడుతున్నాం. ఇప్పటికే కొందరితో మాట్లాడాను. ప్రజల్లో పార్టీ ఇమేజ్ కాపాడుకోవాలి. ఎంత స్థాయివారు తప్పుచేసినా ఊరుకునేది లేదు. ఎమ్మెల్యేలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కుదరదు. ప్రజాజీవితంలో ఉన్నప్పుడు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. తప్పు ఎమ్మెల్యేలు చేసినా.. అధికారులు చేసినా.. కింది స్థాయిలో నాయకులు, కార్యకర్తలు చేసినా కఠినంగా ఉంటాం. వారివల్ల పార్టీకి చెడ్డపేరు వస్తే సహించేది లేదు. ఆ విషయంలో బాధ్యతగా ఉండడం వల్లే టీడీపీ 40 ఏళ్లుగా ప్రజల్లో నిలిచి ఉంది. మా పార్టీలో కూడా కొందరు ఆవేశపూరితంగా తమ అభిప్రాయాలు చెబుతూ ఉంటారు. నాయకుడిగా అందరి అభిప్రాయాలూ తెలుసుకుని నా నిర్ణయం నేను చేయాలి. పొత్తులపై మా కేడర్ అభిప్రాయం ఒకలా ఉండేది. నా నిర్ణయం మరొక రకంగా ఉంది. ప్రతివారూ తమ ఎజెండానే అమలు చేయాలంటే సాధ్యం కాదు. మేం దీర్ఘకాలిక వ్యూహంతో పని చేయాలనుకుంటున్నాం. హైదరాబాద్‌ను దేశంలో మ రే నగరం కానంత అభివృద్ధి చేసినా ఎన్నికల్లో ఓడిపోయాను. అన్ని ఇజాలు పోయి ఇప్పుడు మెటీరియలిజం వచ్చింది. మాకేం చేస్తావో ముందు అది చెప్పు అని అంటున్నారు.



బుధవారం మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కూటమిలో మాట్లాడుకుంటున్నాం..

వైసీపీలో అవినీతి ఆరోపణలకు గురైన నేతలు కూటమిలోని ఏదో ఒక పార్టీలో చేరి షెల్టర్ తీసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మిత్రులం అంతర్గతంగా మాట్లాడుకుంటున్నాం. యథాలాప వ్యాఖ్యలు సరికాదు. చరిత్రలో లేని విధంగా ఈసారి టీడీపీ సభ్యత్వం కోటికి చేరువవుతోంది. ఎమ్మెల్యేల పనితీరు బాగున్న నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు బాగా జరుగుతోంది. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మా పార్టీ నేతలు, కేడర్ చాలా బాగా పనిచేశారు. కానీ పని చేసిన వారు ఉన్నంత సంఖ్యలో పదవులు లేవు. అయినా నీటి సంఘాలు, సహకార సొసైటీలు, మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు, స్థానిక సంస్థలు వంటి వాటిలో సర్దుబాటు చేసే ప్రయత్నం చేస్తున్నాం.

బీసీలకు పెద్దపీట..

ఈసారి బీసీ వర్గాలకు ప్రభుత్వంలో బాగా ప్రాధాన్యం ఇస్తున్నాం. చరిత్రలో మొదటిసారి రాష్ట్రంలో బీసీ వర్గానికి వ్యక్తిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని చేశాం. డీజీపీ కూడా అదే వర్గాలకు చెందిన వ్యక్తి. మా పార్టీ అధ్యక్షుడు కూడా బీసీయే. మంత్రివర్గంలో కూడా వారికి బాగా పెద్ద ప్రాతినిధ్యం ఇచ్చాం.

త్వరలో ఆకస్మిక తనిఖీలు

త్వరలో నా ఆకస్మిక తనిఖీలు మొదలవుతాయి. ప్రభుత్వ శాఖల్లో పనితీరు ప్రమాణాలు మెరుగుపరుస్తాం. ప్రభుత్వ పనితీరులో వేగం పెంచుతాం. 150 రకాల సేవలను వాట్సాప్ ద్వారా పొందే ఏర్పాటు చేస్తున్నాం. అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద క్యూఆర్ కోడ్ పెట్టి.. అధికారులు, ఉద్యోగుల పనితీరుపై ప్రజలు ఫీడ్ బ్యాక్ ఇచ్చే ఏర్పాటు చేస్తున్నాం. పింఛన్ల పంపిణీని పరిశీలించే టెక్నాలజీ ప్రవేశపెడుతు న్నాం. తాజా సర్వే ప్రకారం 7 శాతం లబ్ధిదారులను కొంత దూరం పిలిపించారు. ఎందుకలా చేశారో కారణాలు కనుక్కుంటున్నాం. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతాన్ని సరిగ్గా లెక్కవేయడానికి కొత్త పరికరాలు సరఫరా చేస్తాం. ధాన్యం మిల్లుకు చేరిన వెంటనే రైతు ఖాతాలో డబ్బు పడేలా చూస్తాం. సామాన్య ప్రజలు తమ సమస్యను తెలపడానికి నోటితో చెబితే రికార్డయి.. సంబంధిత శాఖకు వెళ్లే కృత్రిమ మేధ(ఏఐ) టెక్నాలజీని ప్రవేశపెట్టబోతున్నాం.

అమెరికా తుది నివేదిక కోసం..

విద్యుత్ ఒప్పందాల్లో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ అదానీ కంపెనీలపై అమెరికా ప్రభుత్వం నమోదు చేసిన కేసులో తుది నివేదిక కోసం ఎదురు చూస్తున్నాం. ఈ కేసు నాకు లడ్డూ మాదిరిగా దొరికిందని మీరు అనుకోవచ్చు. కానీ నాకు విశ్వసనీయత ముఖ్యం. రేపు అమెరికా ప్రభుత్వం కాదంటే ఇబ్బంది పడాలి. అందుకే తుది నివేదిక కోసం చూస్తున్నాం.

సినిమా రంగంపై అమరావతి ప్రభావం!

భవిష్యత్‌లో సినిమా రంగంలో అమరావతి కూడా ప్రభావం చూపే ప్రాంతం అవుతుంది. మొదట్లో ఈ రంగానికి బెజవాడ కేంద్ర స్థానంగా ఉండేది. స్టూడియోలు, నటులంతా మద్రాసులోనే ఉన్నా.. సినిమా పంపిణీ సంస్థలు, ఇతర సంస్థలు బెజవాడలోనే ఎక్కువగా ఉండేవి. ఆ రంగంలో హైదరాబాద్ ప్రాముఖ్యం విస్తరించింది. ఇప్పుడు పరిస్థితి ఇంకా మారింది. భవిష్యత్‌లో అమరావతి కూడా ప్రభావం చూపించే స్థాయికి రావచ్చు.

పోలవరం పరిశీలనకు ఎంపీల బృందం రాక

» 11న పర్యటించనున్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పోలవరం పనులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమీక్షను నిర్వహిస్తోంది. ఈ కమిటీ సభ్యులు ఈ నెల 10న రాజమండ్రి వస్తారు. 11న పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు, గతంలో నిర్మించిన డయాఫ్రమ్‌వాల్ ఎందుకు దెబ్బతిన్నది? ఎగువ దిగువ కాఫర్ డ్యామ్‌లు, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మాణ పనులను కమిటీ సమీక్షిస్తుంది. డయాఫ్రమ్‌వాల్ ఎందుకు దెబ్బతిన్నది?. 2019 నుంచి పనులు ఎందుకు సాగలేదు. దీని ప్రభావం ప్రాజెక్టుపై ఎలాంటి ప్రభావం చూపిందో కూడా పార్లమెంటరీ కమిటీ సమీక్షిస్తుంది. అవసరమైతే రెండు రోజుల పాటు ప్రాజెక్టు ప్రాంతంలోనే కమిటీ ఉంటుందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ వర్గాలు వెల్లడించాయి.

సీఎస్ విజయానంద్‌కు శుభాకాంక్షల వెల్లువ



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డీజీపీ తిరుమలరావు

అమరావతి, విజయవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం అమరావతి సచివాలయంలో పలువురు ఉన్నతాధికారులు, వివిధ శాఖాధిపతులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీ ద్వారకాతిరుమలరావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ముఖ్యకార్యదర్శులు ముఖేష్‌కుమార్ మీనా, కాంతిలాల్‌దండే, జయలక్ష్మి, సునీత, శశిభూషణ్ కుమార్, కార్యదర్శులు, కలెక్టర్లు, జేసీలు, సచివాలయ ఉద్యోగులు, ఏపీఎన్జీవో సంఘం, రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సీఎస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, దుర్గామల్లేశ్వర దేవస్థానం తరఫున దేవాదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామచంద్రమోహన్, దేవస్థాన స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్డీ ప్రసా ద్ తదితరులు సీఎస్ విజయానంద్‌ను కలిసి అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని అందజేసి, వేద మంత్రాలతో ఆశీస్సులు అందజేశారు.

ఐఏఎస్ అధికారి బుడితి సర్వీస్ పొడిగింపు

సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ సర్వీస్‌ను ప్రభుత్వం ఏడాదిపాటు పొడిగించింది. వ్యవసాయ, పట్టు, సహకార, మార్కెటింగ్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేస్తూ మంగళవారంతో ఉద్యోగ విరమణ చేయాల్సిన రాజశేఖర్ సర్వీస్‌ను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 1 నుంచి ఏడాదిపాటు లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు అవే శాఖలకు ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఆయన కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఐఏఎస్, ఐపీఎస్‌లకు పదోన్నతి

ఐదుగురు ఐఏఎస్ అధికారులకు, ఏడుగురు ఐపీఎస్ అధికారులకు పదోన్నతి లభించింది. 2012 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులు వి.విజయరామరాజు, మల్లికార్జున, ఎస్.నాగలక్ష్మి, వి.ప్రసన్న వెంకటేష్, ఎస్.మంజీర్ జిలానీ అదనపు కార్యదర్శులుగా పదోన్నతి పొందారు. మంగళవారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వీరు జాయింట్ సెక్రటరీ కేడర్‌లో ఉన్నారు. పాఠశాల విద్య డైరెక్టర్‌గా వి.విజయరాజు, బీసీ సంక్షేమ డైరెక్టర్‌గా మల్లికార్జున్, గుంటూరు కలెక్టర్‌గా ఎస్.నాగలక్ష్మి, సాంఘిక సంక్షేమ పాఠశాలల సెక్రటరీగా ప్రసన్న వెంకటేష్, మార్క్‌ఫెడ్ ఎండీగా డా.మంజీర్ జిలానీ విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతులు పొందినా వీరంతా అక్కడే కొనసాగనున్నారు.

ఏడీజీగా మనీశ్‌కుమార్ సిన్హా

రవాణా శాఖ కమిషనర్ మనీశ్‌కుమార్ సిన్హాకు పదోన్నతి లభించింది. ఐజీ ర్యాంక్ అధికారిగా ఉన్న ఆయనకు అడిషనల్ డీజీగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. అదేవిధంగా డీఐజీ ర్యాంక్ అధికారి రాజకుమారికి ఐజీగా పదోన్నతి లభించింది. 2011 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఐపీఎస్‌లకు సీనియర్ ఎస్పీ నుంచి డీఐజీలుగా పదోన్నతి లభించింది. డి.సత్యయేసుబాబు,సి.హెచ్.వెంకటప్పలనాయుడు, కేకేఎన్ అన్బురాజన్, బాబుజీ అట్టాడ, ఫకీరప్ప కాగినెల్లి బుధవారం నుంచి డీఐజీలుగా కొనసాగుతారు.

నాకు న్యాయం చేయండి

» సీఎం చంద్రబాబుకు శాంతి భర్త మదన్‌మోహన్ విజ్ఞప్తి

వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అక్రమాలపై సీఎం చంద్రబాబుకు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి భర్త, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ) అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.మదన్‌మోహన్ ఫిర్యాదు చేశారు. గత నవంబరులో తనను హైదరాబాద్ నుంచి కోల్‌కతాకు బదిలీ చేశారని, విజయసాయిరెడ్డి వల్లే బదిలీ చేశారని చెప్పారు. తిరిగి తనను హైదరాబాద్‌కు బదిలీ చేయించాలని కోరారు. శాంతి అవినీతి, అక్రమాలను సీఎంకు వివరించారు. విశాఖలో అన్యాక్రాంతమైన భూముల విషయంలో విజయసాయిరెడ్డి, శాంతి పాత్రలపైనా విచారణ జరిపించాలని కోరారు. తన భార్య శాంతికి పుట్టిన బిడ్డకు, విజయసాయిరెడ్డికి డీఎన్ఏ పరీక్ష చేయించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం సీఎం చంద్రబాబును ఆయన కలిసి ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు.

8న విశాఖకు ప్రధాని మోదీ రాక

విశాఖపట్నం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న విశాఖపట్నం రానున్నారు. ఆరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకూ ఆయన నగరంలో ఉంటారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసే బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలో ఎన్‌టీపీసీ నిర్మించనున్న గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటుకు శంకుస్థాపన, రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే కార్యక్రమాలను సభా వేదిక నుంచి చేపడతారు. ఈ నెల 4న నిర్వహించనున్న నేవీడే పరేడ్‌కు సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు. అదేరోజు రాత్రి తిరిగి విజయవాడ వెళ్లిపోతారని అధికార వర్గాలు తెలిపాయి. మళ్లీ 8న ప్రధానితోపాటు ఏయూలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. కాగా, మంత్రి నారా లోకేశ్ 7న విశాఖకు రానున్నారు. శతశాతం టీడీపీ సభ్యత్వం తీసుకున్న భీమిలి మండలం ముచ్చర్ల గ్రామాన్ని ఆయన సందర్శిస్తారు.

ఉండవల్లిలోని సీఎం నివాసానికి అధికారిక గుర్తింపు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉంటున్న నివాసాన్ని ప్రభుత్వం అధికారిక నివాసంగా గుర్తించింది. ఈమేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తద్వారా ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలను సీఎం నివాసంలో నిర్వహించుకునే వెసులుబాటు కల్పించారు.

మేనేజరే చూసుకున్నారు!

» గోదాం వ్యవహారాలు నాకేమీ తెలియదు: పేర్ని నాని భార్య

» బియ్యం మాయం కేసులో పోలీసుల ముందు హాజరు



మచిలీపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదాం వ్యవహారాలన్నీ తమ మేనేజర్ మానస తేజ చూసేవారని మాజీమంత్రి పేర్ని నాని భార్య, గోడౌన్‌లో రేషన్ బియ్యం మాయం కేసులో ప్రధాన నిందితురాలు(ఏ-1) జయసుధ తెలిపారు. ఈ వ్యవహారాల గురించి తనకేమీ తెలియదని ఆమె చెప్పినట్లు సమాచారం. బుధవారం మచిలీపట్నం తాలూకా పోలీసు స్టేషన్‌లో విచారణకు ఆమె హాజరయ్యారు. మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు న్యాయవాదుల సమక్షంలో విచారణ జరిగింది. రాబర్ట్‌సన్‌పేట సీఐ ఏసుబాబు, మచిలీపట్నం తాలూకా ఎస్ఐ సత్యనారాయణ ఆమెకు పలు ప్రశ్నలు సంధించారు. పొట్లపాలెంలో గోడౌన్ నిర్మాణం ఎప్పుడు చేశారు.. ఎంత భూమి కొన్నారు.. గోడౌన్ ఎవరి పేరున ఉంది.. ప్రభుత్వానికి ఎప్పుడు, ఎంత అద్దె ప్రాతిపదికన ఇచ్చారు.. గోడౌన్‌లో బియ్యం నిల్వ వ్యవహారాలను మీరే చూశారా.. నగదు లావాదేవీలు ఎవరు చూసేవారు తదితర ప్రశ్నలు అడిగి వివరాలు రాబట్టారు. అనంతరం ఇద్దరు జామీనుదారులతో పోలీసులు సంతకాలు చేయించుకున్నారు. తర్వాత ఆమె స్టేషన్ నుంచి వచ్చారు. కాగా.. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌కు ప్రభుత్వం కేటాయించిన కారులో జయసుధ స్టేషన్‌కు రావడం వివాదాస్పదమైంది. ఇంకోవైపు ఆమె రావడంతో అక్కడకు పెద్దఎత్తున వైసీపీ కార్యకర్తలు చేరుకుని హడావుడి చేశారు. బియ్యం మాయం కేసులో ఏ-1గా ఉన్న పేర్ని జయసుధకు కృష్ణా జిల్లా కోర్టులో గత నెల 30వ తేదీన ముందస్తు బెయిల్ మంజూరైన సంగతి తెలిసిందే.

ఏసీబీ కేసులో బెయిల్ ఇవ్వండి

» సమాచార శాఖ మాజీ కమిషనర్ విజయ్‌కుమార్ రెడ్డి పిటిషన్

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో సాక్షి దినపత్రిక, సాక్షి టీవీ చానల్‌కు ప్రకటనల జారీ, సొమ్ము చెల్లింపు విషయంలో కోట్ల రూపాయలు అనుచిత లబ్ధి చేకూర్చారంటూ ఏసీబీ నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సమాచార పౌరసంబంధాలశాఖ మాజీ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై తప్పుడు కేసు పెట్టారని, అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు రానుంది. వైసీపీ ప్రభుత్వంలో జగన్ పత్రిక, జగన్ టీవీ చానల్‌కు అనుచిత లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకోవడంతోపాటు, సాక్షి మీడియా గ్రూపులో పనిచేస్తున్న పలువురు సిబ్బందిని ఐ అండ్ పీఆర్, ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లలో ఉద్యోగులుగా చట్టవిరుద్ధ నియామకాలు జరిపారంటూ అప్పటి ఐ అండ్ పీఆర్ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డిపై ఏపీ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.దిల్లీబాబురెడ్డి ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై ప్రాథమికంగా విచారణ జరిపిన ఏసీబీ అధికారులు విజయ్‌కుమార్ రెడ్డిని ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. దీంతో ముందస్తు బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

వారంపాటు బాబు బిజీ..!

నేడు మంత్రివర్గ సమావేశం

» రేపు రాత్రికి హైదరాబాద్‌కు

» 6, 7 తేదీల్లో కుప్పం టూరు

» 8న విశాఖలో ప్రధాని పర్యటనకు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో వరుసగా వారం రోజులు సీఎం చంద్రబాబు పర్యటనల్లో బిజీగా గడపనున్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ఆయన అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరుగనుంది. మూడో తేదీ రాత్రి హైదరాబాద్ వెళ్లి తెలుగు సభల కార్యక్రమంలో పాల్గొంటారు. 4న విశాఖలో నేవీ డే వేడుకలకు హాజరవుతారు. ఆరు, ఏడు తేదీల్లో తన నియోజకవర్గం కుప్పంలో పర్యటిస్తారు. 8న విశాఖ జిల్లాలో జరిగే ప్రధాని మోదీ పర్యటనలో పాల్గొంటారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటించనున్నారు. అక్కడ వరల్డ్ ఎకనమిక్ ఫోరం వార్షిక సదస్సులో పాల్గొనాల్సిందిగా ఆయనకు ఆహ్వానం అందింది. మంత్రులు లోకేశ్, టీజీ భరత్, సీఎం అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా, ప్రైవేట్ సెక్రటరీ కృష్ణ కపర్ది రావి, సీఎస్‌వో శ్రీనాథ్ బండారు, వైద్యాధికారి ఎండీ అజారుద్దీన్‌తో కూడిన బృందం 19నే దావోస్‌కు బయల్దేరుతుంది. వీరి పర్యటనను ఖరారు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 'షేపింగ్ ది ఇంటెలిజెంట్ ఏజ్' అనే థీమ్‌తో నిర్వహించే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు ప్రపంచస్థాయి పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారు. వారి పెట్టుబడులను ఆకర్షించేందుకు చంద్రబాబు దావోస్‌ను వేదికగా ఉపయోగించుకోనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న సహజ వనరులు, అవకాశాల గురించి పెట్టుబడిదారులకు వివరిస్తారు. వివిధ చర్చల్లో చురుగ్గా పాల్గొంటారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, పారిశ్రామిక పాలసీలు, సుస్థిర అభివృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వ్యవసాయం, మాన్యుఫాక్చరింగ్, ఐటీ తదితర రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించాలని చంద్రబాబు భావిస్తున్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం మార్గదర్శకాల ప్రకారం దావోస్ సదస్సు వద్ద ఏపీ ప్రభుత్వం ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసేందుకు 500 చదరపు మీటర్ల స్థలాన్ని కేంద్రం రిజర్వ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్న చంద్రబాబుకు కనకదుర్గమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

ప్రజల నుంచి వినతులు

సీఎం చంద్రబాబు మధ్యాహ్నం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చారు. పార్టీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తనను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులతో సాయంత్రం వరకు ఆయన ఫొటోలు దిగారు. పలువురు దివ్యాంగులు, బాధితులు తమ సమస్యలపై వినతిపత్రాలు ఇవ్వగా, పరిష్కరిస్తానని సీఎం హామీ ఇచ్చారు.

త్వరలో మరింత మంచి చూస్తారు!

» భవిష్యత్ తెలుగువాళ్లదే..: సీఎం


విజయవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తెలుగువారికి మంచి జరిగేలా అనేక కార్యక్రమాలు చేపట్టామని.. భవిష్యత్ మన తెలుగు వాళ్లదేనని సీఎం చంద్రబాబు అన్నారు. త్వరలోనే మరింత మంచి చూస్తారన్నారు. కొత్త సంవత్సరం తొలిరోజున సీఎం ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. 'తెలుగు వారికి, భారతీయులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.. ప్రజలు, రాష్ట్రం అభివృద్ధి చెందేలా దుర్గమ్మ చల్లని చూపు మనపై ఉంది.. అందరికీ ఆదాయం పెరిగి, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నా.. అందరికీ శుభం, మంచి జరగాలని దుర్గమ్మను ప్రార్థించా' అని తెలిపారు.

నేవీ చరిత్రలో సరికొత్త రికార్డు

» 15న రెండు యుద్ధ నౌకలు, ఒక సబ్‌మెరైన్ ప్రారంభం

» ముంబైలో ఘనంగా వేడుక

విశాఖపట్నం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళం కొత్త రికార్డు సృష్టించబోతోంది. యుద్ధంలో ముందుండి పోరాడే రెండు యుద్ధ నౌకలు, ఒక సబ్‌మెరైన్ ఒకేరోజు ప్రారంభం కాబోతున్నాయి. ముంబైలోని మజగావ్ డాక్ యార్డు వేదికగా 15న ఈ కార్యక్రమం జరగనుంది. ఇది భారత నేవీ చరిత్రలో మైలురాయిగా నిలిచిపోనుంది. పూర్తిగా దేశీయ పరిజ్ఞానం, ఆధునిక సాంకేతికతో స్టెల్త్ ఫ్రిగేట్ క్లాస్‌కు చెందిన (ప్రాజెక్టు 17ఏ) నీల్‌గిరి యుద్ధనౌక, స్టెల్త్ డెస్ట్రాయర్ క్లాస్‌కు చెందిన (ప్రాజెక్ట్ 15బి) యుద్ధ నౌక సూరత్,



సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ వఘ్‌షేర్

స్కార్పియన్ క్లాస్ ప్రాజెక్టుకు చెందిన సబ్‌మెరైన్ 'వఘ్‌షేర్' నిర్మితమయ్యాయి. ఈ మూడింటిని మజగావ్ డాక్‌యార్డు షిప్ బిల్డర్స్ నిర్మించడం విశేషం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.